RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com



వుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు | 11-11-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 233 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on



సమానత్వం, లౌకికత్వమే నా భారతీయ భావన: సోనియా గాంధీ

ఆర్ఎస్ఎస్ భావజాల ప్రభావంతో మోదీ ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి

న్యూఢిల్లీ, నవంబర్ 10 (ఎఎంస్) :
ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అధికారిక సమావేశాల్లో ఎదురుపడినప్పటికీ, ఆయనతో వ్యక్తిగతంగా మాట్లాడిన సందర్భాలు దాదాపుగా లేవని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. తన జ్ఞాపకాలతో రూపొందించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో మోదీతో తనకున్న పరిచయం, ఇరువురి మధ్య ఉన్న సైద్ధాంతిక విభేదాలు, భారతదేశం పట్ల భిన్నమైన దృక్పథాలను ఆమె వివరించారు. ఈ పుస్తకం నేడు పాఠకుల ముందుకు వచ్చింది. నరేంద్రదామోదర్‌దాస్ మోదీ భారత ప్రధానమంత్రిగా పన్నెండేళ్లకు పైగా కొనసాగుతున్నారని, ప్రస్తుతం మూడోసారి ప్రధానమంత్రి పదవిలో ఉన్నారని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇంతకాలంలో ఆయనతో తనకు నిజమైన వ్యక్తిగత సంబంధం ఏర్పడలేదని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌లో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు కలుసుకోవడం వంటి అధికారిక, అర్ధ అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే తాము ఎదురుపడుతుంటామని వివరించారు. అలాంటి సందర్భాల్లో మోదీ, తాను పరస్పరం నమస్కరించుకుంటామని సోనియా గాంధీ తెలిపారు. అయితే మోదీ తనను ఎదుర్కొన్నప్పుడు కళ్లలోకి చూడకుండా చూపు మరల్చుకుంటారని పేర్కొన్నారు. గతంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల మధ్య ఉండే స్నేహపూర్వక సంబంధాలకు ఇది భిన్నంగా ఉందని అభిప్రాయపడ్డారు. అధికారిక పలకరింపులకు మించి తమ మధ్య ఎలాంటి సంభాషణలు జరగలేదని, అయితే పుట్టినరోజులు, నూతన సంవత్సర సందర్భాల్లో మాత్రం మర్యాదపూర్వక శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నామని పుస్తకంలో పేర్కొన్నారు. తాను ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం తిరిగి వచ్చిన సందర్భాల్లో మోదీ ఆరోగ్యం గురించి అడిగేవారని సోనియా గాంధీ వెల్లడించారు. 'మీరు బాగున్నారా?' అని మోదీ ప్రశ్నించగా, 'అవును.. ఇప్పుడు బాగున్నాను, ధన్యవాదాలు' అని తాను సమాధానమిచ్చినట్లు వివరించారు.

మోదీది భిన్నమైన భారత భావన

భారతదేశం పట్ల నరేంద్ర మోదీకి ఉన్న ఆలోచనా విధానం తనకు పూర్తిగా భిన్నమైనదని సోనియా గాంధీ పేర్కొన్నారు. మోదీ భారత భావన ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల ఆలోచనలు, ఆయన వ్యక్తిగత జీవిత అనుభవాల ద్వారా రూపుదిద్దుకుందని తెలిపారు. ఆయన విశ్వాసం, సంస్కృతికి ఇతరుల కంటే అధిక ప్రాధాన్యత ఇచ్చే మౌలికవాద ధోరణి అందులో ప్రతిబింబిస్తోందని విమర్శించారు. తనకు భారతదేశం గురించి తెలిసిన విషయాలన్నీ కుటుంబ సభ్యుల జీవితం, వారి సేవా భావం, దేశం పట్ల వారి విశ్వాసం నుంచి నేర్చుకున్నవేనని సోనియా గాంధీ వివరించారు.

ప్రజలకు చేరువగా పోలీసు అధికారులు ఉండాలి

నూతన డీఎస్పీలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



ప్రజాసేవే లక్ష్యంగా డీఎస్పీలు పనిచేయాలి
తెలంగాణ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది
నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలి
పోలీసు వ్యవస్థ ప్రతిష్టను కాపాడాలి
ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రథమ కర్తవ్యం
పారదర్శక నియామకాలతో డీఎస్పీల ఎంపిక
మూడు దశాబ్దాల తెలంగాణ భవిష్యత్తు మీ బాధ్యత

హైదరాబాద్, నవంబర్ 10 (వుదయం) :
ఎన్నో సవాళ్లు, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి డీఎస్పీల నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ జారీ నుంచి నియామకాలు పూర్తయ్యే వరకు మొత్తం ప్రక్రియను తమ ప్రభుత్వమే నిర్వహించిందని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డీఎస్పీలు నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవిష్యత్తును రాబోయే ముప్పై ఏళ్ల పాటు ఏ దిశగా నడిపించాలనే కీలక బాధ్యత పోలీసు అధికారుల చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నూతన డీఎస్పీలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల చరిత్రను ప్రస్తావిస్తూ.. 2011లో గ్రూప్1 నియామకాలు చేపట్టిన తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు నియామకాలు జరగలేదని గుర్తుచేశారు. కొన్ని నెలల ఆలస్యం జరిగినా ఉద్యోగార్థులు తమ జీవితంలో విలువైన సంవత్సరాలను కోల్పోయామనే బాధకు గురవుతారని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో గందరగోళం వంటి పరిణామాలు అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్లక్ష్య నిర్ణయాల వల్ల ఎంతోమంది నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు, నష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉన్నతస్థాయి ఉద్యోగ నియామకాలను నిర్వహించే కమిషన్‌లో గతంలో సరైన అవగాహన, అర్హతలు లేని వ్యక్తులకు సభ్యులుగా అవకాశం కల్పించారని విమర్శించారు. వైద్య వృత్తిలో ఆర్ఎంపీలుగా పనిచేసిన వారిని సైతం నియామక వ్యవస్థలో సభ్యులుగా నియమించడం సరైన విధానం కాదన్నారు. కమిషన్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని అభిప్రాయపడ్డారు. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, అదే తరహాలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పునర్నిర్మించామని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర కమిషన్‌కు స్వయంగా వెళ్లి అక్కడి విధానాలు, నిర్వహణ తీరును పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తొలి అధ్యక్షుడిగా పదవీ విరమణ చేసిన పోలీసు మహా సంచాలకుడు మహేందర్ రెడ్డిని నియమించామని వివరించారు. పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులను సభ్యులుగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. భవిష్యత్తును నిర్ణయించే నియామక వ్యవస్థపై నిరుద్యోగులకు నమ్మకం తగ్గితే ఉద్యోగ నియామకాల పట్ల కూడా అపనమ్మకం ఏర్పడుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షుడిగా నియమించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతం, విద్యార్థుల పట్ల నిబద్ధత కలిగిన అధికారులు కీలక బాధ్యతల్లో ఉంటే నియామక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 562 మంది ఉద్యోగాల్లో చేరారని ముఖ్యమంత్రి వెల్లడించారు. 112 మంది డీఎస్పీల నియామకం రాష్ట్రంలో ఒక గొప్ప పరిణామమని అభివర్ణించారు. నియామకాల ప్రక్రియలో ప్రభుత్వం పూర్తి పారదర్శకతను పాటించిందని స్పష్టం చేశారు.

ఎల్‌నినో కష్టకాలంలో రైతులకు బ్యాంకుల భరోసా కావాలి

రైతాంగానికి బ్యాంకర్లు ప్రత్యేకంగా సహకరించాలి: తుమ్మల

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి

హైదరాబాద్, నవంబర్ 10 (వుదయం) :
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రైతాంగానికి అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కరవు కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అర్హులైన రైతుల పంట రుణాలను భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించాలని, రుణాల గడువును పొడిగించడంతో పాటు రబీ సాగుకు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందించాలని కోరారు. రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు.
మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి వివిధ రంగాలకు రుణాల పంపిణీపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూల ధోరణిని అవలంబించాలని, అర్హులైన విద్యార్థులకు గరిష్ఠంగా రుణాలు అందించాలని సూచించారు. విద్యా రుణాల పంపిణీని సమితి కన్వీనర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు.
సామాన్య ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు వ్యక్తిగత గృహ నిర్మాణ రుణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గృహ నిర్మాణ సంస్థలకు మాత్రమే రుణాలు మంజూరు చేయడం కాకుండా వ్యక్తిగతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి కూడా బ్యాంకులు సహకరించాలని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని, ఈ రంగానికి రుణాల పెంపు ద్వారా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సేవల రంగం పురోగతికి కీలకమని, ఈ రంగానికి తగిన ఆర్థిక సహకారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు.



రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి

భారత్‌పై చైనా వ్లాగర్ల విషప్రచారం

న్యూఢిల్లీ, నవంబర్ 10 (ఎఎంస్) :
భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనా సామాజిక మాధ్యమ ప్రచారకులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడల దృశ్యాలను దిల్లీ ప్రాంతాలుగా చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడాన్ని దురదృష్టకరమైన చర్యగా అభివర్ణించింది. వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేసే ఇటువంటి ప్రయత్నాలు సంబంధిత వ్యక్తుల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఇటీవల కొంతమంది చైనా వ్లాగర్లు తమ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా భారత్‌లోని జీవన పరిస్థితులపై వీడియోలను ప్రచురించారు. అయితే, బంగ్లాదేశ్‌లోని ఢాకా మురికివాడల దృశ్యాలను చిత్రీకరించి, వాటిని భారత రాజధాని దిల్లీకి చెందినవిగా పేర్కొంటూ ప్రత్యక్ష ప్రసారాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ వీడియోల ద్వారా భారత్‌లోని పరిస్థితులపై తప్పుడు అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాదాపు 150 మంది చైనా పౌరులు ఈ వీడియోలను చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్పందించారు. ఈ అంశానికి సంబంధించి మీడియాలో వెలువడిన కథనాలను పరిశీలించినట్లు తెలిపారు.

యుద్ధం వద్దు.. చర్చలే ముద్దు

ఇరాన్‌పై దాడులకు ట్రంప్ విముఖత!
ఇరాన్‌పై మళ్లీ దాడులకు నెతన్యాహు ఒత్తిడి
రాజకీయ ప్రయోజనాల కోసం యుద్ధానికి యత్నం
ఇరాన్‌తో ఒప్పందానికే ట్రంప్ మొగ్గు



వాషింగ్టన్: ఇరాన్‌పై దాడులను తిరిగి ప్రారంభించే ఆలోచన లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం వెల్లడించారు. అయితే, ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నిరంతరం ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చినట్లు అమెరికా మీడియా కథనం పేర్కొంది. ప్రతిరోజూ ట్రంప్‌కు ఫోన్ చేస్తున్న నెతన్యాహు.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేయాలా అని ప్రశ్నించే వారని తెలిపింది. రాజకీయ ప్రయోజనాలను ఆశించి నెతన్యాహు ఈ ప్రయత్నాలు చేసినట్లు కథనంలో వెల్లడించింది. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలనే ఆసక్తి ట్రంప్‌కు ఉండటంతో ఆయన నెతన్యాహు ప్రతిపాదనలను తిరస్కరించినట్లు పేర్కొంది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇరాన్‌పై దాడులు చేపట్టాలని నెతన్యాహు ట్రంప్‌ను కోరినట్లు సమాచారం. అయితే, యుద్ధం ద్వారా కాకుండా చర్చల మార్గంలోనే సమస్యకు పరిష్కారం కనుగొనాలని ట్రంప్ భావిస్తున్నట్లు వైట్‌హౌస్ అధికారులు వెల్లడించారు. ఇరాన్‌తో కొనసాగిన యుద్ధం కారణంగా అమెరికా కాంగ్రెస్‌లో అధికార రిపబ్లికన్ పార్టీ తన ఆధిపత్యాన్ని కోల్పోవడానికి కూడా అవకాశం ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భూముల వేలాన్ని అడ్డుకుంటాం: ఈటల



హైదరాబాద్, నవంబర్ 10 (వుదయం) :
ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన హౌసింగ్ బోర్డు భూములను ప్రభుత్వం విక్రయించేందుకు సిద్ధమవడంపై మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూముల అమ్మకానికి వ్యతిరేకంగా భాజపా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూకట్‌పల్లిలో జనాభా అధికంగా ఉన్నేపథ్యంలో పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఈ భూములను వినియోగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా భూములను వేలం వేయడం అన్యాయమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ట్రాక్ పార్కు స్థలాన్ని కూడా విక్రయానికి పెట్టడంపై ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఈ నెల 12న జరగనున్న భూముల వేలాన్ని కాలనీవాసులతో కలిసి అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

నవంబరు చివరి నాటికి నామినేటెడ్ పదవుల భర్తీ

దిల్లీ: తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో చర్చించినట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో 'సర్'కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభతోపాటు మెగా బీసీ ర్యాలీలో పాల్గొనాలని రాహుల్‌గాంధీని ఆహ్వానించినట్లు చెప్పారు. మంగళవారం దిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతులకు రాజకీయ రంగంలో మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని ఆయనకు వివరించినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలు, క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అమలు చేస్తున్న కార్యాచరణపైనా రాహుల్‌గాంధీతో చర్చించినట్లు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న భారత్ సమ్మిట్‌కు రాహుల్ హాజరవుతారని తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా గిగ్ కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాహుల్ సూచించినట్లు వెల్లడించారు. ఇటీవల మంత్రులు, ఎంపీల మధ్య నెలకొన్న విభేదాలు, దిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై రాహుల్‌తో ఎలాంటి చర్చ జరగలేదని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు.

ఇంతే కదా...!





వుదయం

అమరవాది లక్ష్మీనారాయణ ఘనంగా జన్మదిన వేడుకలు



వెల్దండ నవంబర్ 10 (వు దయం)

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. నవంబర్ 10న జరిగిన ఈ కార్యక్రమంలో మహాసభ నాయకులు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

ఆల్వాల్ టిమ్స్ పనులు డిసెంబరులో పూర్తి

ఆల్వాల్ నవంబర్ 10 : వుదయం

ఆల్వాల్ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు డిసెంబరు 31లోగా పూర్తిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మేడ్చల్ మల్కాజిగిరిలో మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. 2023లో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు తొలినాళ్లలో 14 శాతం మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం 91 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, మిగిలిన పనులను వేగంగా పూర్తిచేసే మార్గాలపై అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మంత్రి రెండు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 31 గడువులోగా మిగిలిన నిర్మాణాలు పూర్తిచేయాలని మరోసారి ఆదేశించారు. ఆల్వాల్ టిమ్స్‌ను న్యూరాలజీ, నెఫ్రాలజీ సహా పలు సూపర్ స్పెషాలిటీ విభాగాలతో అభివృద్ధి చేయనున్నారు. ఆసుపత్రిలో మొత్తం 36 విభాగాలు ఉంటాయి. వాటిలో 12 బ్రాడ్ స్పెషాలిటీ, 14 సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉంటాయి. ప్రణాళికలో 7 సపోర్టింగ్ ఆసుపత్రులు కూడా ఉన్నాయి. ఒక్కో టిమ్స్‌లో 100 పడకలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు. ప్రధాన ఆసుపత్రి భవనంతోపాటు మెడికల్ హాస్టల్, నర్సింగ్ కళాశాల, నర్సింగ్ హాస్టల్, పరిపాలనా భవనం, పార్కింగ్, క్యాంటీన్ నిర్మాణాల అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ అదనపు పనులకు నిధుల మంజూరును ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు. కొత్త ఏడాదిలో ఆల్వాల్ టిమ్స్‌లో వైద్య సేవలు ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. మరో రెండు నెలల్లో ఓపీ సేవలు ప్రారంభించి, తరువాత దశలవారీగా ఇన్‌పేషెంట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని



నిర్ణయించారు. ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ ఆసుపత్రులను కూడా సూపర్ స్పెషాలిటీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నారు.

ఎంపీటీసీల మాదిరిగా సర్పంచులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని వినతి

కేశంపేట వుదయం ప్రతినిధి (నవంబర్ 10)



కేశంపేటలో నవంబర్ 10న మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సర్పంచులకు ఓటు హక్కు లేకపోవడం విచారకరమని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ప్రథమ పౌరులుగా గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీలకు ఉన్నట్టే సర్పంచులకు కూడా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా చట్టాల్లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆశా వర్కర్ల డిసెంబర్ 15 సమ్మె



కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 10,

కాప్రాలో ఆశా వర్కర్లు డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి విన్నవించారు. ప్రజారోగ్య సేవల్లో తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1,200 మంది ఆశా వర్కర్లు ప్రజారోగ్య సేవలందిస్తున్నారని వారు తెలిపారు. గర్భిణులకు వైద్య సేవలు, తల్లీబిడ్డల సంరక్షణ, టీకాలు, కుటుంబ నియంత్రణతోపాటు అంటువ్యాధుల నివారణలో ఆశా వర్కర్లు కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సేవల పరిధి విస్తృతంగా ఉన్నప్పటికీ న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత తమకు కల్పించడం లేదని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని వారు ఆరోపించారు. గతంలో ఉన్నతాధికారులు ప్రకటించిన నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం హామీ కూడా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఆశా వర్కర్లు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల బీమా, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కనీస వేతనాన్ని రూ.30 వేలకు పెంచడంతోపాటు డీఏలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఆశా వర్కర్లు విజ్ఞప్తి చేశారు. తమ సేవలకు తగిన వేతనాలు, రక్షణలు కల్పించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మె పరిస్థితులను నివారించాలని ఆశా వర్కర్లు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె తప్పదని స్పష్టం చేశారు.



కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 10,


సీఐ, ఎస్ఐలను కలిసిన బీజేపీ నేతలు

కేశంపేటలో నవంబర్ 10న బీజేపీ మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్‌లో కొత్తగా వచ్చిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేశను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు పోలీస్ అధికారులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, మండలంలోని ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతలు, ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రొల్లు రఘురాం గౌడ్, కంచుకోట నరసింహ, మున్నూరు యుగంధర్, తట్టెపల్లి నరసింహతోపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి

ఓఎస్‌డీని కలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద జారీ చేసే ఎల్ఓసీలకు సంబంధించిన విషయాలపై ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌ను కలిశారు. కాప్రా (ఉదయం ప్రతినిధి), నవంబర్ 10, హైదరాబాద్: ఉప్పల్ ని యోజకవర్గంలోని పేద, మధ్యతర గతి కుటుంబాలకు వైద్య చికిత్స కోసం అవసరమైన ముఖ్యమంత్రి సహాయ నిధి-ఎల్ఓసీల మంజూరు, పెండింగ్ దరఖాస్తులు, సంబంధిత అంశాలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌తో చర్చించారు.



అర్హత ఉన్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు వైద్యపరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి-ఎల్ఓసీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత



కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 10,

కాప్రాలో నవంబర్ 10న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐఏఎస్ అధికారి డా. యోగితా రాణిని కలిసి ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వివరించారు. ఉపాధ్యాయుల కొరతను ప్రధానంగా ప్రస్తావిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైన స్థాయిలో బోధనా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యా సంవత్సరం కొనసాగుతున్నందున కొరత ఉన్న పాఠశాలలను వెంటనే గుర్తించి, అవసరమైన చోట ఉపాధ్యాయులను నియమించాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. కొరత కారణంగా విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే సరిపడా ఉపాధ్యాయులతో పాటు మెరుగైన విద్యా వసతులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న లోపాలు విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు 55వ రోజుకు

ఆల్వాల్ నవంబర్ 10 వుదయం ప్రతినిధి

ఆల్వాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు 45వ రోజుకు చేరుకున్నాయి. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి న్యాయం చేయాలని దీక్షా శిబిరం వేదికగా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన విధివిధానాలను త్వరగా ఖరారు చేసి, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీక్షల వ్యవధి 55వ రోజుకు చేరినట్టు శిబిరం నిర్వాహకులు



తెలిపారు. నవంబర్ 10న జరిగిన దీక్షలో పి. శ్రీనివాస్ గౌడ్, రషీద్ కూర్చున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ దయాకర్, రామయ్య, సంగమేశ్వర్, రమేష్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు.

సదర్ ఉత్సవం ఘనం

ఆల్వాల్ నవంబర్ 10 : వుదయం



ఆల్వాల్‌లో నవంబర్ 10న యాదవుల సంప్రదాయాలు, పశుసంపద ప్రాధాన్యాన్ని చాటిచెప్పే సదర్ ఉత్సవాన్ని స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో ఎద్దుల ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఆస్వాదించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన అనుచరులు, బృంద సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

యాదవ సంఘం నిర్వాహకులు ఆయనతో పాటు ఇతర ప్రముఖులను ఘనంగా సన్మానించారు. వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన ఎద్దుల యజమానులకు ప్రత్యేక బహుమతులు అందజేసి అభినందించారు.

మాజీ కార్పొరేటర్ రాజ్ జెతేందర్ నాథ్ మాట్లాడుతూ, సదర్ ఉత్సవం యాదవుల ఆత్మగౌరవానికి, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ వేడుకలను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తూ సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని రాజ్ జెతేందర్ నాథ్ అన్నారు.

జాతర వేళ దుకాణాల మూసివేత ఆదేశం

మహబూబ్‌నగర్.



మహబూబ్‌నగర్‌లో కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతర ప్రాంగణం, పరిసర గ్రామాల్లో కల్లు, మద్యం దుకాణాల మూసివేతకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 10 ఉదయం 5 గంటల నుంచి నవంబర్ 25 రాత్రి 10 గంటల వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. కురుమూర్తి స్వామి జాతర ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో దుకాణాలను మూసివేయాలి. ఎ4 మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. తెలంగాణ అబ్కారీ చట్టం1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

జాతరను ప్రశాంతంగా నిర్వహించడం, శాంతిభద్రతలను కాపాడడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలోని అమ్మాపూర్, దుప్పల్లి, తిరుమలాపూర్, వడ్డెమాన్, అల్లిపూర్, కురుమూర్తి, అప్పంపల్లి, పేరూర్ గ్రామాలకు నిషేధాజ్ఞలు వర్తిస్తాయి. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలని ఎక్సైజ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు.

అర్హులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు

రాజన్న సిరిసిల్ల, నవంబరు10 (వుదయం ప్రతినిధి) :



రాజన్న సిరిసిల్లలో కొత్తగా ఎంపికైన అర్హులకు పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ ఈ నెల 12 నుంచి 18 వరకు జరగాల్సి ఉంది. పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వారికి నూతన పెన్షన్ మంజూరు అర్హత పత్రాలు అందజేయాలని ఆమె సూచించారు. చేయూత సామాజిక భద్రత పథకం కింద వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, నేత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల దరఖాస్తులను కూడా అధికారులు తీసుకున్నారు. అర్హత నిర్ధారణ కోసం మండల, జిల్లా స్థాయి అధికారులతో విచారణ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పరిశీలన ఆధారంగా అర్హులైన వారికి మంజూరు పత్రాలు అందించే ప్రక్రియను అధికారులు నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత పొందిన ప్రతి ఒక్కరికీ చేయూత పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. పంపిణీ గడువు 12 నుంచి 18 వరకు ఉండటంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, ఏడీ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సంతోష్, డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్ పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు పంపిణీ ఏర్పాట్లపై సమీక్షకు హాజరయ్యారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

కోదాడ నవంబర్ 10 (వుదయం)



కోదాడలో నవంబర్ 10న రాష్ట్ర మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన జరగనుంది. మంత్రి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులను పరిశీలించనున్నారు. రెడ్లకుంటలో రూ.47 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మంత్రి పరిశీలిస్తారు. కోదాడలో రూ.54 కోట్ల రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులతోపాటు, రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని సమీక్షించనున్నారు. రూ.50 కోట్ల నవోదయ పాఠశాల తదితర నిర్మాణ పనుల పురోగతిని మంత్రి పరిశీలిస్తారు. ఈ పర్యటనలో వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులపై కూడా సమీక్ష ఉంటుంది. కాకతీయ సేవా సమితి కల్యాణ మండపంలో ఉదయం 11.30 గంటలకు మెగా కంటి వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించనున్నారు.

అనంతరం జూన్‌పహాడ్‌లోని రూ.400 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పరిశీలిస్తారు. బెట్టె తండాలో రూ.40 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన తరువాత మంత్రి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను సమీక్షించనున్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించనున్నారు. పర్యటనలో ప్రాజెక్టులు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతిపై పరిశీలనలు కొనసాగనున్నాయి.

కాప్రా డివిజన్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపన

కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 10, మేడ్చల్ జిల్లా

గోపాల్ రెడ్డి నగర్, సీనియర్ సిటిజన్స్ కాలనీ, కృష్ణ నగర్‌లో పనులు

నవంబర్ 10న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలోని ఉమ్మడి కాప్రా డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు.

గోపాల్ రెడ్డి నగర్, సీనియర్ సిటిజన్స్ కాలనీ, కృష్ణ నగర్ ప్రాంతాల్లో పనులు జరగనున్నాయి. గోపాల్ రెడ్డి నగర్‌లో యూజీడీ పనులకు రూ.14 లక్షలు, సీనియర్ సిటిజన్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, కృష్ణ నగర్‌లో యూజీడీ పనులకు రూ.30 లక్షలు కేటాయించారు.

ఈ మూడు పనులను రూ.84 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. డ్రైనేజీ, రహదారుల సమస్యలకు పరిష్కారం చూపే మౌలిక వసతుల పనులుగా వీటిని అధికారులు అమలు చేయనున్నారు.

బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మెరుగైన రహదారులు, సమర్థవంతమైన మురుగునీటి పారుదల వ్యవస్థ అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు.

పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కాప్రా డివిజన్‌లోని ప్రాంతాల అవసరాల ఆధారంగా యూజీడీ, సీసీ రోడ్డు పనులను వేర్వేరుగా చేపడుతున్నారు.

శంకుస్థాపన అనంతరం సంబంధిత పనుల అమలు అధికారులు ముందుకు తీసుకెళ్లనున్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బైరీ నవీన్ గౌడ్, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలి
- రెండు పడక గదుల ఇళ్ల ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం వుదయం బ్యూరో , నవంబర్ -10

ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్లను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం క్షేత్ర స్థాయిలో పలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, త్రాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్ లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాములు.. వారంలోగా శంకుస్థాపనకు చర్యలు

రైతులు డిమాండ్ ఉన్న పంటల సాగుపై దృష్టి సారించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, వుదయం ప్రతినిధి



రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మంచి ధర లభించేలా మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అనువైన స్థలం అందుబాటులో ఉంటే వారంలోగా శంకుస్థాపన చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం అనుముల మండలం శ్రీనాథపురం గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు, తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు పండించిన ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులందరూ సమిష్టిగా ముందుకు వస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడతామని చెప్పారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద గోదాముల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తామని, మహిళా సంఘాలకు అనువైన భూమి అందుబాటులో ఉంటే వారం రోజుల్లోనే శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కోల్డ్ స్టోరేజీలు, గోదాములు అందుబాటులోకి వస్తే రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకొని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గోదాముల నిర్మాణం, పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి ప్రభుత్వం అవసరమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికీ, రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకుంటూ, నీటిని పొదుపుగా వినియోగించి అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు కూడా రానున్న రోజుల్లో తగ్గే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. మార్కెట్లో డిమాండ్, ధరలు ఉన్న పంటలను గుర్తించి సాగు చేపట్టాలని, పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయో ముందుగానే అంచనా వేయాలని తెలిపారు. 100 రోజుల్లో చేతికి వచ్చే పంటలకు మార్కెట్లో ఎంత మేరకు గిరాకీ ఉందో తెలుసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, శ్రీరామనవమి వరకు పరిస్థితులను గమనించి తదుపరి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. చిక్కుడు, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతుల్లో డిగ్రీలు చదువుకున్న వారు కూడా ఉన్నారని, వారు వ్యవసాయ రంగంలో నూతన ఆలోచనలతో ముందుకు వచ్చి ఆధునిక సాగు విధానాలను అనుసరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మర్రెడ్డి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి - దళారి వ్యవస్థను అరికట్టాలి

- తూకం, తాలు పేరుతో రైతులకు 2.5 కేజీల కోతలతో అన్యాయం
- నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి
- కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



చిలుకూరు నవంబరు 10:(వుదయం)

రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని, దళారులు మరియు వ్యాపారస్తులకు వత్తాసు పలుకుతూ అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తోందని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు, మండల కేంద్రంలో మంగళవారం పర్యటించి, రైతుల పంటను మరియు కొనుగోలు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా, మల్లయ్య యాదవ్, మాట్లాడుతూ, పెట్టుబడి సాయం లేదు.. కరెంటు లేదు, ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఆకాశాన్ని నమ్ముకుని రైతులు ఆరుగాలం శ్రమించి వరి సాగు చేశారు. కానీ ప్రభుత్వం నుండి రైతులకు కనీస సహాయం అందలేదు. రైతుబంధు ఇవ్వలేదు, సకాలంలో సాగునీరు అందించలేదు, కరెంటు లేదు, కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యం నెపంతో దళారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. తూకం, తాలు పేరుతో బస్తాకు రెండున్నర కిలోల చొప్పున అదనంగా కోత విధిస్తూ వ్యాపారస్తులు రైతులను మోసం చేస్తున్నారు. నిన్నటి వరకు రూ. 4,200 ఉన్న ధాన్యం ధరను, రోజురోజుకూ తగ్గిస్తూ ఈరోజు రూ. 3,200 లకు పడవేశారు. క్వింటాలుకు ఏకంగా వెయ్యి రూపాయలు తగ్గించి రైతుల పొట్ట కొడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఒకవైపు రైతుకు కనీస మద్దతు ధర దక్కడం లేదు, మరోవైపు మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. కిలో బియ్యం ధర రూ. 90 దాటిపోవడంతో సామాన్యులు, కూలీలు బియ్యం కొనుక్కోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. సివిల్ సప్లైస్ మంత్రి అండదండలతోనే ఈ బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని, అధికారులు కేవలం కాగితపు ప్రకటనలకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, వరి వేయవద్దని చెప్పిన ప్రభుత్వ మాట విని పొలాలను పడావు పెట్టిన రైతులకు ఇంతవరకు ఎలాంటి కరువు భత్యం అందలేదు. కరువు మండలాలుగా ప్రకటించినా నయా పైసా సాయం చేయలేదు. తుఫానుల వల్ల దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం అంచనా వేయలేదు, కేంద్ర బృందాలు కూడా వచ్చి పరిశీలించిన దాఖలాలు లేవు. "దున్నపోతు మీద వర్షం పడ్డట్టు" వ్యవహరిస్తూ మొద్దు నిద్రపోతున్న ఈ ప్రభుత్వం వెంటనే మేల్కోవాలని మల్లయ్య యాదవ్, డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని, దళారుల దోపిడీని అరికట్టి రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షులు అక్కినపల్లి జానకిరామ చారి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, అలస కాని జనార్దన్,కొండ అన్నపూర్ణ, షేక్ పాషా, అమరగాని లింగరాజు, అంబాల వెంకటి, నూకపంగు వెంకటి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చిలుకూరు నవంబర్ 10:(వుదయం)

మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించిన తహసిల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో మొక్కపాటి నరసింహారావు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం అందించే మద్దతు ధర కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తుందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో, ఏపిఎం వీరబాబు, ఆర్ ఐ సీతయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్గొండ జిల్లా

వుదయం ప్రతినిధి నవంబర్ 10

నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పాకాల రాములమ్మ, బోయ సత్తెమ్మ, శ్యాం సుందర్‌రెడ్డి, మర్రి మాధవి లకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరప్రదాయినిగా నిలుస్తోందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్

మునుగోడు, నవంబర్ 10 (వుదయం):



ప్రజారోగ్య రంగంలో నిరంతరం సేవనందిస్తున్న ఆశా కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వరీకుప్పల ముత్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక సహాయకులకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆశా కార్యకర్తలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని, రిటైర్మెంట్ సమయంలో రూ.5 లక్షల బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. పారితోషికంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ప్రతి ఆదివారం, పండుగలతో పాటు సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, రెండో పీఆర్సీలో రూ.30 వేల కనీస వేతనం నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డీఏలను ఆశా కార్యకర్తలకు కూడా వర్తింపజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ఆశాలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, ఆశా వర్కర్స్ యూనియన్ మునుగోడు మండల అధ్యక్షురాలు వనం నిర్మల, ఉపాధ్యక్షురాలు కమలమ్మ, కవిత, మమత, కమల, నాంపల్లి మండలం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కవిత, మమత, రేణుక, సైదమ్మ, సునంద, అంజమ్మ, చిన్నమ్మ, సునీత, ఇందిరా, సైదమ్మ, వివిధ మండలాల నుంచి ఆశా వర్కర్ యూనియన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెల్మకన్నేలో వెలుగులు.. 36 విద్యుత్ స్తంభాలకు వైర్ల అనుసంధానం



సర్పంచ్ రావుల స్వప్న రమేష్ చొరవ

గట్టుప్పల్, నవంబర్ 10 (వుదయం):

మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నే గ్రామంలో ప్రజల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలకు చెక్ పడింది. గ్రామస్తులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించాలనే లక్ష్యంతో మంగళవారం గ్రామంలో కీలక అభివృద్ధి కార్యక్రమం చేపట్టారు.స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, గ్రామ సర్పంచ్ రావుల స్వప్న రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుని వెల్మకన్నే గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 36 విద్యుత్ స్తంభాలకు వైర్ల అనుసంధాన (కనెక్షన్) పనులను విజయవంతంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుల స్వప్న రమేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడతామని ఆమె తెలిపారు.

ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీపై సమగ్ర విచారణ జరపాలి

- అర్హతలు పరిశీలించకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు
- అధికారులు స్పందించాలి: తగుళ్ళ జనార్దన్ యాదవ్

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్),

నవంబర్ 10: వుదయం ప్రతినిధి



ఆత్మకూర్ (ఎస్) మండల రెవెన్యూ అధికారికి ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీ విషయంలో నిబంధనలు పాటించడం లేదని, అర్హత లేని వారికి కూడా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించాలని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తగుళ్ళ జనార్దన్ యాదవ్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆయన అన్నారు. మండలంలో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ నేపథ్యంలో ఎంత మందికి ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లు జారీ చేశారు, వారి ఆదాయ, ఆస్తుల వివరాలను ఏ విధంగా పరిశీలించారు, అర్హత ప్రమాణాలను పాటించారా అనే అంశాలపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని ఆయన కోరారు. ఈ డబ్ల్యూ ఎస్ కోటా అనేది ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి మాత్రమే వర్తించాలి. ఎవరైనా అనర్హులు తప్పుడు వివరాలతో సర్టిఫికెట్లు పొందినట్లు అయితే వాటిని వెంటనే రద్దు చేసి, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆత్మకూర్ (ఎస్) మండల తహసీల్దార్ ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీపై సమగ్ర విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండాలని, అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ అంశంపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా న్యాయబద్ధమైన విచారణ చేపట్టాలని జన సేవా సమితి డిమాండ్ చేస్తోంది . ఈ కార్యక్రమంలో ఏర్పుల రవి పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు

పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా

సత్తుపల్లి నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



సత్తుపల్లి పట్టణం, సత్తుపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందజేశారు సత్తుపల్లి పట్టణం 27 మంది లబ్ధిదారులకు రూ.27,03,132 విలువైన చెక్కులు. సత్తుపల్లి మండలం 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ఆవశ్యకతను వివరించారు. మహిళల సంక్షేమం, ఆర్థిక భరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మహిళలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు మున్సిపల్ చైర్మన్ రిహన్ కమల్ పాషా , కౌన్సిలర్లు, నసీమా బేగం షరీఫ్ మండల కాంగ్రెస్ నాయకులు గుంటూ సూర్య రామారావు మహిళలు పాల్గొన్నారు.

కార్తీకమాస శోభతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న రామన్నపాలెం గ్రామం

శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు

సత్తుపల్లి నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో భక్తి భావాన్ని చాటిచెప్పేలా రామన్నపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నవంబర్ 10, 2026 నుంచి డిసెంబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం శివారాధనకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో భక్తుల ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ఉద్దేశంతో ఆలయ పూజారి ఊటుకూరి భార్గవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్తీకమాసం సందర్భంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సాయంకాలం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేయించుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక కార్యక్రమాలు:

– నవంబర్ 9న ఆకాశదీపం ప్రారంభం

– నవంబర్ 13న నాగుల చవితి ప్రత్యేక పూజలు

– నవంబర్ 16న తొలి కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

– నవంబర్ 23న రెండవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

– నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు అత్యంత వైభవంగా జ్వాలాతోరణం కార్యక్రమం

– నవంబర్ 30న మూడవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

– డిసెంబర్ 8న కార్తీక అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహణ

కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే జ్వాలాతోరణం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు. ఈ నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, తమ గోత్ర నామాలతో అభిషేకాలు చేయించుకోవాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ, భక్తి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మునగాల , వుదయం ప్రతినిధి

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అఖిలభారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మునగాల మండల కేంద్రంలో మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, రైతుల హక్కుల పరిరక్షణతో పాటు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు అఖిలభారత రైతు సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే ఈ మహాసభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహాసభల విజయవంతానికి బుధవారం మునగాల మండల వ్యాప్తంగా డప్పు వాయిద్యాలు, కోలాట బృందాల నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతుల ఐక్యతను చాటుతూ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి , చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, సుంకర పిచ్చయ్య, షేక్ సైదా, జానయ్య, కృష్ణారెడ్డి, వెంకన్న, వినోద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో చింతకాని ఎంఈఓకు అరుదైన గౌరవం



- వేదికపై సలాది రామారావుకు ఘన సన్మానం
- విద్యారంగంలో సేవలకు సముచిత గుర్తింపు
- మండలానికి గర్వకారణంగా నిలిచిన సత్కారం

చింతకాని నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో సమగ్ర శిక్షా ఖమ్మం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆల్ రౌండ్ స్కూల్స్ అచీవ్‌మెంట్ కార్యక్రమంలో చింతకాని మండల విద్యాశాఖాధికారి సలాది రామారావుకు ఘన సన్మానం లభించింది. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి వాసంతి చేతుల మీదుగా ఆయన శాలువాతో సత్కరించబడి జ్ఞాపికను అందుకున్నారు. విద్యారంగంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పాఠశాలల అభివృద్ధి విద్యార్థుల విద్యా ప్రగతి ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం కల్పించారు. జిల్లా స్థాయి వేదికపై చింతకాని మండల ఎంఈఓకు లభించిన ఈ గుర్తింపు మండల విద్యాశాఖకు ప్రత్యేక గౌరవంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు సమష్టి కృషి అవసరమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి వాసంతి చేతుల మీదుగా సన్మానం అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర చర్యలు

- ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి
- ఎస్పీ కె. నరసింహ ఆదేశాలతో ఎన్ హెచ్-65 వెంట ప్రత్యేక చర్యలు
- ప్రమాద ప్రాంతాల్లో ఆక్రమణలు, బోర్డులు, పొదల తొలగింపు



సూర్యాపేట, నవంబర్ 10: వుదయం ప్రతినిధి

సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 65 వెంట రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారి 65 పై అంజనాపురి చౌరస్తా, కొత్త మార్కెట్ చౌరస్తా, ఈనాడు జంక్షన్ తదితర ప్రమాద ప్రభావిత ప్రాంతాల వద్ద రహదారి భద్రత చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్లను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను తొలగించడంతో పాటు, వాహనదారులకు ఇబ్బంది కలిగించే వ్యాపార బోర్డులను తొలగిస్తున్నామని తెలిపారు. రహదారుల వెంట పెరిగిన పొదలను తొలగించడం, అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం వాహనదారుల అజాగ్రత్త, నిర్లక్ష్యమే నని, ఒక ప్రమాదంలో వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని పేర్కొన్నారు. జరిమానాలు విధించడం కేవలం శిక్షించడానికి మాత్రమే కాకుండా వాహనదారుల్లో బాధ్యతాయుతమైన మార్పు తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సమ్మె నోటీస్ అందజేత

దమ్మపేట నవంబర్ 10(వుదయం ప్రతినిధి)



ఆశ వర్కర్లు గ్రామీణ పట్టణ ఆరోగ్యవ్యవస్థలో కీలకపాత్ర వహిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు 18 వేల రూపాయలు వేతనం ఇవ్వకుండా ఆశవర్కర్లను మోసగించటం వలనే డిసెంబర్ 15 నుండి సమ్మెకు వెళ్లవలసిన పరిస్థితి వచ్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వసంత్ కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ ఉదయం నుండి రాత్రి వరకు ఫీల్డ్ వర్క్ ఆన్లైన్ సర్వేలు టార్గెట్లు డ్యూటీలు చేస్తున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు తగ్గట్లుగా వేతనాలు పెరగటం లేదని అన్నారు. గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యాయని, హామీలు అమలు కోసం ఆందోళనలు నిర్వహిస్తుంటే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమ్మెకు వెళ్లడం తప్ప వేరే గత్యంతరం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆశ వర్కర్లకు 18 వేల రూపాయల వేతనం నిర్ణయించాలని ఉద్యోగ భద్రత చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సునీత, శారద, భాగ్యమ్మ అంజలి, రజిని, నాగమణి జైనాబీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన రావుల గణేష్‌కు గుత్తా అమిత్ రెడ్డి ప్రోత్సాహం



హాకీ బ్యాట్ కొనుగోలుకు రూ.12 వేల ఆర్థిక సహాయం

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 10:

నల్గొండ పట్టణానికి చెందిన యువ హాకీ క్రీడాకారుడు రావుల గణేష్ జాతీయ హాకీ జట్టుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ జట్టుకు ఎంపికైన ఏకైక క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన గణేష్‌ను ప్రోత్సహిస్తూ గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హాకీ బ్యాట్ కొనుగోలు నిమిత్తం ఈ మొత్తాన్ని అందించి క్రీడాకారుడికి అండగా నిలిచారు. యువ క్రీడాకారులు తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి ప్రోత్సాహం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్, నల్గొండ జిల్లా హాకీ కోచ్ ఎవరు అలీ, పీపీ రాంప్రసాద్, మాదగోని కృష్ణ, మాగంటి రాఘవరావు, జక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.




"పదవి వద్దని ఓ వైపు నా మనసు దృఢంగా చెప్పింది. మరోవైపు బాధ్యతను వదిలేస్తే ఎదురయ్యే పరిణామాలను మెదడు హెచ్చరించింది. అలాంటి ఊగిసలాటలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి నాలో నేను ఓ యుద్ధం చేశా. 2004 లో సార్వత్రిక ఎన్నికలు జరగడానికి చాలా నెలల ముందే ప్రధాని పదవిచేపట్టవద్దని నిర్ణయించుకున్నా. ఇదే విషయం పిల్లలకూ చెప్పా. నానమ్మ, నాన్న హత్యలు చూసిన తర్వాత నేను ప్రధాని కావాలని రాహుల్, ప్రియాంక కోరుకోలేదు. ఆ హోదా నా కుటుంబానికి డేంజర్ అని వారు భావించారు."

-సోనియా గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

వే'మన' పద్యం

తమకుగల్గు పెక్కు తప్పలునుండగా
ఓగు నేరమెంచు నొరులగాంచి
చక్కిలంబుగాంచి జంతిగ నగినట్లు
విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజా ఉద్యమం

నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ ప్రజా సభ దేశ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలిచింది. గత పన్నెండేళ్లుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకత్వంలోని మతతత్వ శక్తులు, కార్పొరేట్ ప్రయోజనాల కూటమికి వ్యతిరేకంగా పోరాడుతున్న రాజకీయ శక్తులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడంలో 'ఇండియా' కూటమి కీలక పాత్ర పోషించడం సహజ పరిణామమే. ఓటు హక్కు పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటం క్రమంగా దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందిందనడానికి రామ్‌లీలా మైదానంలో వెల్లువెత్తిన ప్రజా స్పందనే నిదర్శనం. ప్రజల ఓటు హక్కును సామూహికంగా హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విషయం ఇప్పుడు ఎలాంటి సందేహానికీ తావులేకుండా చర్చనీయాంశమైంది. ఇప్పటికే 'సర్' ప్రక్రియ అమలైన రాష్ట్రాలతోపాటు ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లోనూ కోట్లాది ఓట్లు తొలగించబడ్డాయన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరు, ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలో సాగిన విధానం, అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జ్ఞానేశ్ కుమార్ నియామకం, ఆయన గత రాజకీయ పరిపాలనా నేపథ్యం, ఆర్ఎస్ఎస్‌బీజేపీ రాజకీయ ఎజెండాతో ముడిపడిన కీలక పరిణామాల్లో ఆయన పోషించిన పాత్రను పరిశీలిస్తే ప్రస్తుత పరిణామాలపై అనుమానాలు తలెత్తడం సహజమే. దాదాపు ఏడాదిన్నరగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను పునర్వ్యవస్థీకరించింది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులనే దెబ్బతీస్తుంది. ఈ ఆందోళనలకు రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచిన అంశం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు. లక్షలాది మంది హిందువుల ఓట్లు తొలగించబడ్డాయని ఆయన స్వయంగా ప్రకటించడం ఈ ప్రక్రియలోని లోపాల తీవ్రతను వెల్లడిస్తోంది. ఓటర్ల తొలగింపు మతం, సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉందా అన్న అనుమానాలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్నిస్తున్నాయి. రామ్‌లీలా మైదానంలో ప్రజలు ప్రదర్శించిన ఐక్యత ఈ అసంతృప్తికి ప్రతిబింబం. ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజలు నిర్బంధాలను, ఆంక్షలను ఎదుర్కొంటూ పోరాడుతున్నారు. నిరసనలకు వేదికలుగా నిలిచే ప్రదేశాలను సైతం ప్రభుత్వం ఆంక్షల పరిధిలోకి తీసుకురావడం ప్రజాస్వామిక నిరసన హక్కును కుదించడమే. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్ల హక్కులను పునరుద్ధరించాలని ఈ తీర్మానం డిమాండ్ చేసింది. ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీ ఆధిపత్యానికి అవకాశం కల్పిస్తున్న చట్టాన్ని సవరించాలన్న డిమాండ్ కూడా ఈ సందర్భంలో ముందుకొచ్చింది. ఇదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. విదేశీయులందరినీ దేశం నుంచి వెళ్లగొడతామని ప్రకటించడమే కాకుండా, 'సర్'కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటం అక్రమ వలసదారులను కాపాడేందుకేనని ఆరోపించడం రాజకీయ దుష్ప్రచారానికి నిదర్శనం. ఎన్నికల సంఘం సమర్పించిన పత్రాలు, న్యాయస్థానాలకు అందించిన వివరాలకు భిన్నంగా కోట్లాది మంది చొరబాటుదారులను తొలగించామని రాజకీయ నాయకులు చేస్తున్న ప్రకటనలు మరిన్ని సందేహాలను రేకెత్తిస్తున్నాయి. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరు కోట్ల మంది విదేశీయులను ఓటర్ల జాబితాల నుంచి తొలగించామని ప్రకటించగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కూడా 'సర్' ప్రధాన ఉద్దేశం విదేశీయులను గుర్తించి బంగ్లాదేశ్‌కు పంపించడమేనని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ ప్రకటనలకు అధికారిక గణాంకాలు మద్దతుగా ఉన్నాయా అన్నది కీలకమైన ప్రశ్న. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది కేవలం ఎన్నికల్లో పాల్గొనే సాధనం మాత్రమే కాదు; అది పౌరుల రాజకీయ అస్తిత్వానికి, సమానత్వానికి, రాజ్యాంగ హామీలకు ప్రతీక. ఆ హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘమే అనుమానాలకు తావిచ్చే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం ఎలా నిలుస్తుంది? రామ్‌లీలా మైదానం నుంచి వినిపించిన ప్రజా స్వరం ఈ విషయాన్నే స్పష్టం చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాలన్న సంకల్పంతో ప్రజలు ఐక్యంగా నిలబడితే ఎలాంటి అధికార దురహంకారాన్నైనా ప్రశ్నించగలరు. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం మరింత విస్తృతం కావాల్సిన సమయం ఇదే.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

ప్రయాణికుల రద్దీకి బస్సులేవి? ఉద్యోగుల ప్రాణాలకు భరోసా ఏది?

ఒకవైపు బస్సు నిండిపోయింది.. మరోవైపు ఫుట్‌బోర్డుపై ప్రయాణికులు వేలాడుతున్నారు. బస్సు ఆపాలని ప్రయాణికుల ఒత్తిడి.. ఆపకపోతే బస్సుకు అడ్డంగా నిలబడి దౌర్జన్యం! బస్సు ఎక్కినవారు లోపలికి జరగరు.. జరగమంటే చోటు లేదంటూ సిబ్బందిపై ఆగ్రహం! ప్రమాదం జరుగుతుందని హెచ్చరిస్తే వినరు.. బస్సు ఆపితే ఆలస్యమవుతుందని గొడవ! చివరకు ప్రయాణికుల ఆగ్రహానికి గురయ్యేది డ్రైవర్, కండక్టర్లే! తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో నిత్యం కొనసాగుతున్న ఈ దుర్భర పరిస్థితి ప్రజా రవాణా వ్యవస్థలోని తీవ్రమైన సంక్షోభానికి అద్దం పడుతోంది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా.. ఆ రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో పాలనా యంత్రాంగం ఎంతవరకు సఫలమైంది?

ప్రయాణికులు పెరిగారు.. బస్సులు సరిపోతున్నాయా?

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గణాంకాలే పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నాయి. 2022లో రోజుకు సుమారు 43 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. 2025 మార్చి నాటికి ఈ సంఖ్య 60 లక్షలకు చేరింది. అంటే రోజుకు సుమారు 17 లక్షల మంది అదనంగా ప్రయాణిస్తున్నారు. దాదాపు 40 శాతం ప్రయాణికుల పెరుగుదల నమోదైంది. 2026 ఆగస్టు నాటికి సంస్థ అధికారిక గణాంకాల ప్రకారం రోజువారీ ప్రయాణికుల సంఖ్య 61.19 లక్షలకు చేరింది. సెప్టెంబర్‌లో రవాణా శాఖ మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం రోజుకు దాదాపు 65 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఇంతటి భారీ పెరుగుదలకు అనుగుణంగా బస్సుల సంఖ్య ఎంత పెరిగింది? 2025 మార్చిలో సుమారు 9,384 బస్సులతో నడిచిన సంస్థ, 2026 ఆగస్టు 31 నాటికి 10,174 బస్సులకు చేరుకుంది. అంటే సుమారు 790 బస్సులు, దాదాపు 8.4 శాతం పెరుగుదల. ఇదే సమయంలో 2022తో పోలిస్తే ప్రయాణికుల పెరుగుదల దాదాపు 42 శాతానికి పైగా ఉంది. ప్రయాణికుల పెరుగుదల వేగానికి, బస్సుల పెరుగుదల వేగానికి మధ్య ఉన్న వ్యత్యాసం రద్దీ సమస్యను మరింత స్పష్టంగా చూపిస్తోంది.

మహాలక్ష్మి పథకం.. ప్రయాణికులకు వరం, వ్యవస్థకు అదనపు బాధ్యత!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం లక్షలాది కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తోంది. మహిళల ప్రయాణ స్వేచ్ఛను పెంచింది. ఈ పథకాన్ని తప్పుపట్టడం సమస్యకు పరిష్కారం కాదు. అయితే సంక్షేమ పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం తగిన బస్సులు, సర్వీసులు ఏర్పాటు చేయాలి.

2023-24లో మహాలక్ష్మి పథకం ప్రారంభ దశలో రోజుకు సగటున 29.42 లక్షల మహిళా ప్రయాణాలు నమోదయ్యాయి. 2026 సెప్టెంబర్ నాటికి ఈ సంఖ్య రోజుకు 37.09 లక్షలకు చేరింది. అంటే రోజుకు సుమారు 7.67 లక్షల అదనపు మహిళా ప్రయాణాలు, దాదాపు 26 శాతం పెరుగుదల. 2026 జూలై నుంచి సెప్టెంబర్ వరకు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మరో 97.20 లక్షల మహిళా ప్రయాణాలు అదనంగా నమోదయ్యాయి. ప్రయాణికులకు సంక్షేమం అందించడం ప్రభుత్వ బాధ్యతే. అదే సంక్షేమం వల్ల పెరిగిన రద్దీని నియంత్రించడం కూడా ప్రభుత్వ బాధ్యత. ప్రయాణ సౌకర్యాలు పెంచకుండా ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేస్తే క్షేత్రస్థాయిలో సమస్యలు తప్పవు. సంక్షేమానికి మౌలిక వసతులు తోడుకావాలి. లేకుంటే ప్రయాణికుల ప్రయోజనం, ఉద్యోగుల భద్రత రెండూ దెబ్బతింటాయి.

ఉచిత ప్రయాణం.. గౌరవప్రదమైన ప్రయాణానికి అడ్డంకిగా మారుతోందా?

మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మరో కోణం కూడా వెలుగులోకి వస్తోంది. కొంతమంది మహిళా ప్రయాణికులు తాము టికెట్ చార్జీలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఉచిత ప్రయాణం కంటే గౌరవప్రదంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. టికెట్ లేకుండా ప్రయాణించడం వల్ల తోటి పురుష ప్రయాణికులతో పాటు ఇతర ప్రయాణికుల మధ్య కొన్నిసార్లు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు బస్సు చార్జీల మినహాయింపు విషయంలోనూ కొందరు ఉద్యోగులు, తోటి ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ పెరగడంతో తమకు నిలబడేందుకు కూడా చోటు దొరకడం లేదని, కొన్ని మార్గాల్లో బస్సులు ఎక్కలేని పరిస్థితి ఏర్పడుతోందని పురుష ప్రయాణికులు వాపోతున్నారు. అయితే ఈ సమస్యకు మహిళల ఉచిత ప్రయాణాన్ని తప్పుపట్టడం పరిష్కారం కాదు. ప్రయాణికులందరికీ సమానమైన గౌరవం, సౌకర్యం, భద్రత కల్పించే విధంగా రవాణా వ్యవస్థను తీర్చిదిద్దడమే అసలు లక్ష్యం కావాలి. అవసరమైతే ప్రయాణికులపై కొంత మేర చార్జీలు విధించి, రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపడం, సీటింగ్ సౌకర్యాన్ని పెంచడం, రద్దీ మార్గాల్లో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడం వంటి ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలించాలి. ఉచిత ప్రయాణం ఒక సంక్షేమం కావచ్చు.. కానీ ప్రయాణంలో గౌరవం, సౌకర్యం, సమానత్వం మాత్రం ప్రతి పౌరుడి హక్కు.



37 వేల మంది ఉద్యోగులు.. రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు!

టీజీఎస్‌ఆర్టీసీ పరిధిలో 2026 ఆగస్టు నాటికి 37,009 మంది ఉద్యోగులు ఉన్నారు. 10,174 బస్సులు, 2,889 రూట్లు, 11,104 గ్రామాలకు రవాణా అనుసంధానం.. రోజుకు 61.19 లక్షల ప్రయాణికులు! ఇంతటి విస్తృత వ్యవస్థను నడిపిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లపై ఎంతటి పని ఒత్తిడి ఉంటుందో ఊహించవచ్చు.

ప్రత్యేకించి 3,273 పల్లె వెలుగు బస్సుల్లో గ్రామీణ ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంటోంది. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 88.28 శాతంగా నమోదైంది. ఇది రాష్ట్రవ్యాప్త సగటు మాత్రమే. కొన్ని మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు పూర్తిగా నిండిపోయి ఫుట్‌బోర్డు ప్రయాణం తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. బస్సు నిండిపోయిందని చెప్పినా ప్రయాణికులు ఆగరు. ఫుట్‌బోర్డుపై నిలబడవద్దంటే వినరు. లోపలికి వెళ్లమంటే స్థలం లేదంటారు. బస్సు ఆపకపోతే అడ్డంగా నిలబడి దౌర్జన్యం చేస్తారు. ప్రయాణికుల భద్రత కోసం ప్రయత్నించే సిబ్బందే చివరకు బాధితులవుతున్నారు.

ప్రవళిక మృతి.. ఉద్యోగుల భద్రతపై నిలిచిన ప్రశ్న!

విధుల్లో ఉన్న మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక ప్రయాణికురాలితో వివాదం అనంతరం తీవ్రంగా గాయపడి మరణించిన ఘటన రాష్ట్రాన్ని కలచివేసింది. ఒక ఉద్యోగి విధుల్లో ఉండగానే ప్రాణాలు కోల్పోవడం ప్రజా రవాణా వ్యవస్థలో భద్రత ఎంత కీలకమో తెలియజేస్తోంది. గొడవలు, దూషణలు, బెదిరింపులు నిత్యకృత్యంగా మారుతున్నాయని ఆర్టీసీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు నడపడం డ్రైవర్ బాధ్యత. ప్రయాణికులకు సేవలందించడం కండక్టర్ బాధ్యత. కానీ బస్సుల కొరత, ప్రయాణికుల రద్దీ, దౌర్జన్యాలను నియంత్రించడం కూడా వారి వ్యక్తిగత బాధ్యతేనా? అధికారుల వైఫల్యానికి ఉద్యోగులు మూల్యం చెల్లించాలా?


బస్సులు పెంచండి.. ఉద్యోగులను రక్షించండి!

ప్రభుత్వం రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాలను గుర్తించి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో ప్రత్యేక సర్వీసులు నడపాలి. బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలి. ఫుట్‌బోర్డు ప్రయాణాన్ని అరికట్టాలి. సిబ్బందిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి. అదే సమయంలో ఉద్యోగుల ఫిర్యాదులను వినేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రద్దీని నియంత్రించలేని పరిస్థితుల్లో సిబ్బందిని ఏకపక్షంగా బాధ్యులుగా చేయకూడదు. వారికి యాజమాన్యం అండగా నిలవాలి.

ప్రయాణికుల సంఖ్య పెరిగితే.. బస్సుల సంఖ్య ఎందుకు పెరగలేదు?

ఈ ప్రశ్నకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం సమాధానం చెప్పాలి. సంక్షేమ పథకాలకు ప్రచారం ఎంత అవసరమో, వాటికి సరిపడా సౌకర్యాలు కల్పించడం అంతకంటే అవసరం. ప్రజలకు ఉచిత ప్రయాణం అందిస్తూ ఉద్యోగులకు నరకయాతన మిగల్చడం సంక్షేమ పాలన లక్షణం కాదు. బస్సులు పెంచకుండా రద్దీని తగ్గించలేరు. ఉద్యోగులను రక్షించకుండా ప్రజా రవాణాను సురక్షితం చేయలేరు. ప్రయాణికుల ప్రాణాలు ఎంత విలువైనవో.. వారిని గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్, కండక్టర్ల ప్రాణాలు కూడా అంతే విలువైనవి. ప్రభుత్వం మేల్కొనాలి.. అధికారులు బాధ్యత వహించాలి.. ఆర్టీసీ సిబ్బందికి భద్రత కల్పించాలి.

\బస్సులు పెంచండి.. రద్దీ తగ్గించండి.. దౌర్జన్యాలను అరికట్టండి.. ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదనకు పరిష్కారం చూపండి. ప్రజా రవాణా వ్యవస్థను నడిపిస్తున్న ఉద్యోగులే నిత్యం అవమానాలు, బెదిరింపుల మధ్య పనిచేస్తుంటే.. ఆ వ్యవస్థ బలోపేతం ఎలా అవుతుంది? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఈ రద్దీ సమస్య మరిన్ని విషాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజలకు ప్రయాణ హక్కు ఉంది.. ఉద్యోగులకు ప్రాణ భద్రత హక్కు ఉంది! ఈ రెండింటినీ కాపాడటం ప్రభుత్వ బాధ్యత.



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్,
సెల్: 9010128884)

భారత యువశక్తికి నైపుణ్యా అండ కావాలి

దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్గగలిగే సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తి కాదు, మేధో వ్యవస్థ. సమాజ గతిని మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యాతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం జాతీయ విద్యా దినోత్సవం : స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రి(194758), విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు, దార్శనికుడు, సమైక్యతావాధి మేధావి, రచయిత, పరిపాలనాదక్షుడు, భారత రత్న అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏట 11 నవంబర్‌న దేశవ్యాప్తంగా "జాతీయ విద్యా దినోత్సవ వేడుక"లను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ విద్యా దినోత్సవం ఇతివృత్తంగా "విద్యను సహసృష్టి చేయడంలో యువశక్తి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. నేటి భారత విద్యా విధానానికి గట్టి బీజాలు వేసిన మహాయోధుడు అబుల్ కలాం. ఆయన నేతృత్వంలోనే భారత దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఐఐటీలు, ఏఐసిటిఈ, ఐఐఎస్‌సి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ/బాలికల నిర్బంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేసిన కలాం దార్శనికత కొనియాడదగినది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావి మన కలాం. విద్య మహోన్నత ప్రయోజనాలు అనేకం:

విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాణి తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి. విద్యార్థి కేంద్రిత విద్య (స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్):

విద్యార్థి కేంద్రిత విద్య లేదా స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వు లాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడించ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు. భారత దేశ విద్యా వ్యవస్థ: నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేటు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 459 రాష్ట్ర యూనివర్సిటీలు, 126 డీమ్డ్ యూనివర్సిటీలు, 430 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్‌లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్‌లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 91 యూనివర్సిటీలు మాత్రమే ఉండడం విచారకరం. భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలుపుతూ యువభారతం నిరుద్యోగంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్ధులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రీట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలురంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



మధుసూదన్ రెడ్డి
9949700037

"అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు"

కనుకధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహులని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



"భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయానోన్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉందు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్ఖ్యాతి: కాశ్యయశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్ట దిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహులని దర్శిస్తే నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమవుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధ వారం యమ ద్వితీయ సందర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

సొసైటీ ముసుగుతో ప్రభుత్వ నియంత్రిత సంస్థలు



ఢిల్లీ హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు, ప్రభుత్వం నియంత్రించే సంస్థను సొసైటీగా నమోదు చేసినా రాజ్యాంగ పరిశీలన తప్పదని స్పష్టం చేసింది. నేషనల్ బుక్ ట్రస్ట్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 పరిధిలో 'రాష్ట్రం'గా గుర్తించింది. సొసైటీగా నమోదు చేయడం ఒక్కటే రాజ్యాంగ బాధ్యతల నుంచి తప్పించుకునే మార్గం కాదని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం తెలిపింది. సంస్థ పేరుకంటే దాని పనితీరు, నిర్ణయాలపై ప్రభుత్వ నియంత్రణ ఎంత లోతుగా, విస్తృతంగా ఉందన్నదే ముఖ్యమని పేర్కొంది. ప్రభుత్వ గ్రాంట్లు పొందడం, ప్రజా ప్రయోజన పనులు చేయడం లేదా ప్రభుత్వ ప్రమేయం ఉండడం మాత్రమే సంస్థను స్వయంచాలకంగా 'రాష్ట్రం'గా మార్చవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే ఆర్థిక, పరిపాలనా, కార్యాచరణ స్వయంప్రతిపత్తిని ప్రభుత్వం గణనీయంగా పరిమితం చేస్తే రాజ్యాంగ పరీక్ష వర్తిస్తుందని తెలిపింది. ఎన్‌బీటీని 1957లో ప్రభుత్వ తీర్మానంతో ఏర్పాటు చేసి, సాహిత్య ప్రోత్సాహం మరియు ప్రజలకు అందుబాటు ధరల్లో పుస్తకాల అందుబాటుకోసం 1962లో పునర్వ్యవస్థీకరించారు. దాని చైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది; విద్య, ఆర్థిక, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖల ప్రతినిధులు పాలక మండలి, కార్యనిర్వాహక కమిటీలో ఉంటారు. ఆర్థిక వ్యవహారాల్లోనూ ప్రభుత్వ పర్యవేక్షణ కొనసాగుతోందని ధర్మాసనం గుర్తించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తారు. వార్షిక నివేదికలు, ఆడిట్ ఖాతాలను ప్రభుత్వానికి సమర్పించాలి; కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఖాతాలను ఆడిట్ చేయగలరు. పుస్తకాల విక్రయాల ద్వారా ఎన్‌బీటీ స్వతంత్రంగా ఆదాయం పొందుతోందన్న వాదనను కోర్టు తిరస్కరించింది. ఆదాయ వనరును సంస్థను నడిపించే విస్తృత వ్యవస్థ నుంచి విడిగా చూడలేమని తెలిపింది. ప్రజా పని చేయడం ఒక్కటే 'రాష్ట్రం' హోదాకు సరిపోదని కూడా స్పష్టం చేసింది. ఆర్టికల్ 12 కింద 'రాష్ట్రం'గా గుర్తింపు పొందినందున ఎన్‌బీటీపై రిట్ పరిధి వర్తిస్తుంది; రాజ్యాంగంలోని భాగం మూడు హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను సంస్థ గౌరవించాలి. అయితే ఈ హోదా దానిని ప్రభుత్వ శాఖగా లేదా ఉద్యోగులను ప్రభుత్వ సివిల్ సర్వెంట్లుగా మార్చదు. నవంబర్ 6 తీర్పుతో ఎన్‌బీటీ అప్పీల్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

నాగ్‌పూర్‌లో ఎగిరే బాణసంచాపై నగరపాలక సంస్థ నిషేధం

ప్రాణనష్టం తప్పినా కోట్ల రూపాయల ఆస్తినష్టం



నాగ్‌పూర్‌లో మంగళవారం నగరపాలక సంస్థ కీలక ఆదేశం జారీ చేసింది. లక్ష్మీపూజ రోజున 24 గంటల్లో 42 చోట్ల మంటలు చెలరేగిన ఘటనల నేపథ్యంలో, ఆకాశంలోకి ఎగిరే బాణసంచా, స్కై షాట్లు, రాకెట్లతోపాటు వాటికి సమానమైన ఇతర బాణసంచాపై 30 నవంబర్ వరకు పూర్తిగా ఆంక్షలు విధించింది. ఆదేశాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ విపిన్ ఇటన్‌కర్ జారీ చేశారు. దీపావళి వేడుకల్లో ఆదివారం సాయంత్రం తర్వాత బాణసంచా నుంచి ఎగిరిన నిప్పురవ్వలు నగరంలోని పలు ప్రాంతాల్లో మంటలకు కారణమయ్యాయి. ఈ ఘటనల్లో ప్రాణనష్టం జరగకపోయినా, కోట్ల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ప్రమాదాలపై విపత్తు నిర్వహణ చట్టం 2005 కింద, ప్రధాన అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో విశ్లేషణ చేపట్టారు. విశ్లేషణలో ఆకాశంలోకి ఎగిరే బాణసంచా వల్ల మంటల ఘటనలు గణనీయంగా పెరిగినట్లు తేలింది. నగర భౌగోళిక నిర్మాణం, ఎత్తైన భవనాలు, దట్టమైన జనావాసాలు, మురికివాడలు, వాణిజ్య సంస్థలు, గోదాములు, మండే పదార్థాల నిల్వ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని ఆంక్షలు విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భవనాల పైకప్పులు, టెర్రస్‌లు, బాల్కనీలు, ఇరుకైన వీధులు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, వాహన నిలుపుదొడ్లలో ఈ బాణసంచా కాల్చరాదు. నగరపాలక సంస్థ పరిధిలో రాకెట్లు లేదా స్కై షాట్ల నుంచి వెలువడే నిప్పురవ్వలు భవనాల పైకప్పులు, మురికివాడలు, పాత ఇనుము దుకాణాలు, గోదాములు, పెట్రోల్ బంకులు, వాహనాలపై పడితే పెద్ద మంటలు చెలరేగే ప్రమాదం ఉందని ఉత్తర్వులు హెచ్చరించాయి. ప్రజా ఆస్తుల రక్షణ, సంభావ్య అగ్ని ప్రమాదాల నివారణ, ప్రజా భద్రత కోసం తక్షణ నిరోధక ఆదేశం జారీ చేసినట్లు డాక్టర్ ఇటన్‌కర్ తెలిపారు. ఆంక్షలు ఉన్నప్పటికీ ఫుల్జడీలు, చక్రాలు, అనార్లు కాల్చేందుకు అనుమతి ఉంది. ఆకాశంలోకి ఎగిరే బాణసంచాపై నిషేధం మాత్రం స్పష్టంగా అమలులో ఉంటుంది. ఈ నిర్ణయం మంటల ఘటనలపై చేసిన పరిశీలనలో నమోదైన ప్రమాద సూచనల ఆధారంగా తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం, నాగ్‌పూర్ పోలీస్ కమిషనరేట్ ఆదేశాన్ని కఠినంగా అమలు చేయాలి. ఉల్లంఘనలకు ప్రస్తుత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. విపత్తు నిర్వహణ చట్టం 2005లోని సెక్షన్ 51 నుంచి 60 వరకు, భారతీయ న్యాయ సంహిత 2023 నిబంధనల ప్రకారం జరిమానా, చట్టపరమైన చర్యలు ఉంటాయని ఉత్తర్వులు స్పష్టం చేశాయి. ఆదేశం అమల్లో ఉన్న సమయంలో నిషేధిత బాణసంచా కాల్చిన వారిపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ తెలిపింది. 30 నవంబర్ వరకు కొనసాగనున్న ఆంక్షలు భవనాల పైకప్పులు, టెర్రస్‌లు, బాల్కనీలు, మురికివాడలు, రద్దీ మార్కెట్లు, వాహన నిలుపుదొడ్ల వంటి ప్రాంతాలకు వర్తిస్తాయి.

ప్రధానమంత్రి పదవిపై సోనియా గాంధీ అంతర్గత పోరాటం

ఆత్మకథలో తొలిసారి వివరాలు వెలుగు



న్యూఢిల్లీ నుంచి వెలువడిన వివరాల ప్రకారం, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ 2004 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలన్న తన అంతర్గత సంఘర్షణను తొలిసారి వెల్లడించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి మెజారిటీ సాధించింది. తాజాగా విడుదలైన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో సోనియా, మొదట ప్రధానమంత్రి పదవిని స్పష్టంగా నిరాకరించినట్లు తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిడితో చివరకు 'ఠీక్ హై' అని చెప్పినా, ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తల్లి పదవి స్వీకరించడాన్ని వ్యతిరేకించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల హత్యల అనుభవం నేపథ్యంలో ప్రధానమంత్రి పదవి సోనియాకు మరింత ప్రమాదాన్ని తెస్తుందని వారు ఆందోళన చెందారు. జనపథ్ నివాసంలోని రాజీవ్ గాంధీ సమాధి మందిరంలో కూటమి నాయకులు వరుసగా పదవి స్వీకరించాలని కోరారు. సోనియా నిరాకరించడంతో వారు అంగీకరించబోమని చెప్పి ఒత్తిడి చేశారు. ఆ సమయంలో బయట ఉన్న ప్రియాంక, తల్లి ఒప్పుకున్నారని విని రాహుల్‌ను పిలిచారు. రాహుల్ ఆ నిర్ణయంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, ప్రియాంక మాత్రం ఎవరినీ అనుసరించవద్దని, స్వయంగా నిర్ణయించినట్టే చేయాలని తల్లికి సూచించారు.

అనుమతి లేని యుద్ధం, అధికార దుర్వినియోగం

రిపబ్లికన్ ప్రతినిధి థామస్ మాసీ, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్‌పై అభిశంసన తీర్మానాలపై ఓటింగ్ నిర్వహించేలా చర్య తీసుకున్నారు. ప్రతినిధుల సభ నియమాల ప్రకారం ఆ ఓటింగ్ బుధవారం లోగా జరగాలి.

కెంటకీకి చెందిన మాసీ హెగ్‌సెత్‌పై ఎనిమిది అభిశంసన ఆరోపణలను ప్రవేశపెట్టి, కాంగ్రెస్ అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా యుద్ధం నడిపారని, అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

మాసీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు బహిరంగ విమర్శకుడిగా ఉన్న పదవి వీడబోతున్న రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు.

ప్రతినిధుల సభలో మాట్లాడుతూ హెగ్‌సెత్ 'తీవ్రమైన నేరాలు, దుష్ప్రవర్తనలు' చేశారని, పదవిలో చట్టవిరుద్ధ ఆదేశాలను అమలు చేశారని అన్నారు. అభిశంసన తీర్మానాలపై ఓటింగ్‌కు కొంతమంది రిపబ్లికన్ల మద్దతు లభించే అవకాశం ఉందని ఆయన భావిస్తున్నారు.

మాసీ హెగ్‌సెత్‌పై అభిశంసన తీర్మానాలను తొలిసారి 15 సెప్టెంబరులో ప్రవేశపెట్టారు. అయితే వాటిపై చర్చ జరిగేలోపు సభ స్పీకర్ మైక్ జాన్సన్ అమెరికా కాంగ్రెస్‌ను విరామంలోకి పంపారు.

కొత్త సభ్యులు జనవరిలో బాధ్యతలు చేపట్టే వరకు ప్రతినిధుల సభపై రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగుతుంది.

న్యూయార్క్‌కు చెందిన సభ మైనారిటీ నాయకుడు హకీమ్ జెఫ్రీస్ హెగ్‌సెత్ అభిశంసనకు తాను గట్టిగా అనుకూలమని చెప్పారు.

'హెగ్‌సెత్ వెళ్లిపోవాల్సిందే' అని ఆదివారం ఏబీసీ న్యూస్‌తో అన్నారు.



మరోవైపు హెగ్‌సెత్ సోమవారం నావల్ వార్ కాలేజీలో సైనిక విద్యలో మార్పులను ప్రకటించారు.

అమెరికా సైనికాధికారులు వేగం, కచ్చితత్వం, ప్రాణాంతక సామర్థ్యంతో యుద్ధం చేసేలా ఆ మార్పులు ఉంటాయని తెలిపారు. అయితే విజయం సాధించడంలో వైఫల్యమే హెగ్‌సెత్‌పై రాజకీయ ఒత్తిడిని పెంచిందని కథనం పేర్కొంది.

గత వారం జరిగిన చారిత్రక మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమికి ఇరాన్ యుద్ధం, దాని వల్ల సంప్రదాయవాద ఓటర్లపై పడిన ఖర్చుల భారం కారణమని ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర రిపబ్లికన్ నేతలు అన్నారు. హెగ్‌సెత్ గురువారం విడుదలైన చిన్న వీడియోలో విమర్శకులకు బదులిచ్చారు.

తనపై అభిశంసన ముప్పు 'వ్యక్తిగత విధ్వంస రాజకీయాలకు సంబంధించినది' అని, అది తనపై పనిచేయదని అన్నారు. ప్రభుత్వ నిధులను పక్షపాత రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడాన్ని హ్యాచ్ చట్టం నిషేధిస్తుందని పేర్కొంటూ కామన్ కాజ్, సిటిజన్స్ ఫర్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఎథిక్స్ ఇన్ వాషింగ్టన్ ఆ వీడియో చట్ట ఉల్లంఘన కావచ్చని వాదించాయి.

ఇరాన్, యెమెన్‌పై అనుమతి లేని దాడులతో యుద్ధం ప్రకటించే కాంగ్రెస్ అధికారాన్ని హెగ్‌సెత్ బలహీనపరిచారని మాసీ తీర్మానం ఆరోపిస్తోంది.

ఇరాన్‌లోని పాఠశాలలో 100 మందికి పైగా పిల్లలు మరణించిన ఘటనతో పౌరుల ప్రాణనష్టాన్ని తగ్గించే చట్టాలను వ్యవస్థాబద్ధంగా ఉల్లంఘించారని పేర్కొంది.

కరీబియన్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్నారనే అనుమానం ఉన్న పడవలను ముంచేయాలని ఆదేశించి, సిబ్బందిని రక్షణ లేకుండా వదిలేశారని కూడా ఆరోపించింది. సెనేటర్ మార్క్ కెల్లీ, ఇతరులు సైనికులను చట్టవిరుద్ధ ఆదేశాలను పాటించవద్దని కోరినందుకు వారిపై దర్యాప్తు, కేసుల బెదిరింపులు మొదటి సవరణకు విరుద్ధమని తీర్మానం పేర్కొంది.

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించడం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని కూడా ఆరోపించింది.

పవన్ కల్యాణ్, అన్నా లెజ్నేవా పరస్పర అంగీకారంతో విడిపోయారు



పవన్ కల్యాణ్, అన్నా లెజ్నేవా పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివాహం ముగిసినా, మంచి స్నేహితులుగా, పిల్లలకు బాధ్యతగల తల్లిదండ్రులుగా కొనసాగుతామని చెప్పారు.

పిల్లల ఆనందం, సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితంలో వచ్చిన ఈ మార్పు సమయంలో ప్రజలు అవగాహనతో, సున్నితత్వంతో వ్యవహరించి తమ గోప్యతను గౌరవించాలని పవన్, అన్నా కోరారు.

తమ ప్రయాణంలో తోడుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విడిపోతున్నట్లు ప్రకటించిన తర్వాత అన్నా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను నిష్క్రియం చేశారు.

పవన్ కల్యాణ్‌కు అన్నా మూడో భార్య. 2011లో తెలుగు చిత్రం 'తీన మార' చిత్రీకరణ సమయంలో రష్యన్ మోడల్ అన్నా లెజ్నేవాతో పవన్‌కు పరిచయం ఏర్పడింది.

అన్నా ఆ చిత్రంలో చిన్న పాత్ర పోషించారు. తొలుత స్నేహంగా మొదలైన పరిచయం క్రమంగా ప్రేమగా మారింది.

సెప్టెంబర్ 2013లో పవన్, అన్నా హైదరాబాద్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకున్నారు. వారికి పోలెనా అంజనా పవనోవా అనే కుమార్తె, మార్క్ శంకర్ పవనోవిచ్ అనే కుమారుడు ఉన్నారు.

పవన్ తొలి వివాహం నందినితో మే 1997లో జరిగింది. 1999లో ఇద్దరూ విడిపోయినా, విడాకులు 2008లో పూర్తయ్యాయి.

వివాహం జరిగిన 10 సంవత్సరాల తర్వాత నందినికి భరణంగా పవన్ 5 కోట్లు ఇచ్చారు. పవన్ 2001లో 'బద్రీ' చిత్ర సహనటి రేణు దేశాయ్‌తో సహజీవనం ప్రారంభించారు.

2004లో వారికి అఖిరా నందన్ జన్మించారు. జనవరి 2009లో పవన్ తన ఇంట్లో ఆర్యసమాజ్ విధానంలో రేణును వివాహం చేసుకున్నారు.

2010లో వారికి ఆద్యా జన్మించింది. పవన్, రేణు దేశాయ్ 2012లో విడాకులు తీసుకున్నారు.

ఆసియాన్ సమావేశం కోసం మనీలాలో పేదల తొలగింపు



వచ్చే వారం మనీలాలో జరగాల్సిన ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఆసియాన్) శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో, ప్రధాన మార్గాల వెంట వీధి వ్యాపారులు, నిరాశ్రయులను తొలగించి నగర పేదరికాన్ని దాచేందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ సమావేశం నవంబర్ 16 నుంచి 18 వరకు జరగాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరవుతారని అంచనా వేస్తుండగా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వా సమావేశం చుట్టుపక్కల అధికారిక పర్యటన చేపట్టనున్నారు. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో ఏసీటీ టీచర్స్ పార్టీ లిస్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్ష ఉపనేత ఆంటోనియో టినియో సోమవారం మాట్లాడుతూ, రాజధాని అంతటా పేదల నివాస ప్రాంతాలను తరలించే చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నగరానికి 'శుభ్రపరిచిన' రూపాన్ని చూపించేందుకే ఈ చర్యలు చేపట్టారని, అవి ఐదు దశాబ్దాల క్రితం ఫెర్డినాండ్ మార్కోస్ సీనియర్, మాజీ ప్రథమ మహిళ ఇమెల్డా మార్కోస్ నిర్వహించిన వివాదాస్పద సుందరీకరణ కార్యక్రమాలను పోలి ఉన్నాయని ఆయన అన్నారు. మనీలా టైమ్స్ ప్రకారం, లైట్ రైల్ ట్రాన్సిట్ లైన్ 1 కింద ఉన్న వీధి వ్యాపారులు, పసాయ్ నగరంలోని మనీలా ఫిల్మ్ సెంటర్ సమీపంలోని అనధికార నివాసితులను తొలగించారు. పొరుగునున్న పరాన్యాకే నగరంలోని బక్లారన్ చర్చి చుట్టూ ఉన్న దుకాణాలపైనా చర్యలు తీసుకున్నారు. పరాన్యాకే మేయర్ ఎడ్విన్ ఒలివారెజ్ ప్రకారం, తన పరిధిలోని చర్యల ఉద్దేశం ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రహదారులపై అడ్డంకులు తొలగించడం, సమావేశ సమయంలో నివాసితులు మరియు సందర్శకులకు స్పష్టమైన, క్రమబద్ధమైన వాతావరణం కల్పించడం. స్థానిక పారిశుధ్య, ప్రాంత విభజన నిబంధనలు పాటిస్తే సమావేశం తర్వాత తొలగించిన వ్యాపారులు తిరిగి రావచ్చని ఆయన చెప్పారు.

సమావేశ మార్గాల వెంట తాత్కాలిక ప్రజా కళాకృతులు, విభజన తెరలు ఏర్పాటు చేయడాన్ని కూడా టినియో విమర్శించారు. కళాకృతులను ఉపయోగించి ఆకలి, నిరాశ్రయత్వాన్ని విదేశీ అతిథుల కళ్లకు దూరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సామాజిక గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, తొలగించబడిన వ్యాపారులు, కార్మికులకు వెంటనే పరిహారం ఇచ్చి, వ్యాపారులు ఎలాంటి షరతులు లేకుండా తిరిగి రావడానికి హామీ ఇవ్వాలని ఆయన కోరారు. మలకాన్యాంగ్ ప్యాలెస్ మాత్రం ఈ చర్యలను విదేశీ అతిథుల రాకకు భద్రతా ఏర్పాట్లలో భాగంగా సమర్థించింది. విదేశీ నేతలకు తగిన భద్రత కల్పించగల దేశంగా ఫిలిప్పీన్స్‌ను చూపించాల్సిన అవసరం ఉందని ప్యాలెస్ ప్రెస్ అధికారి క్లెయిర్ కాస్ట్రో మంగళవారం తెలిపారు.

భద్రతే అత్యున్నత ప్రాధాన్యమని, పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వం మాత్రమే కాక మొత్తం పౌర సమాజ బాధ్యత అని ఆమె అన్నారు. పసాయ్‌లో ప్రభావిత వ్యాపారులకు ఆర్థిక సహాయం, ఆహార పొట్లాలు పంపిణీ చేస్తామని సామాజిక సంక్షేమ, అభివృద్ధి శాఖ తెలిపింది. సమావేశం జరిగే కాలమంతా అప్రమత్తతను పెంచి, సాయుధ దళాలు, ఇతర ప్రభుత్వ సంస్థలతో నిఘా సమన్వయాన్ని కొనసాగిస్తామని జాతీయ రాజధాని ప్రాంత పోలీసు కార్యాలయం ప్రకటించింది.

ఢిల్లీలో భారత్, అమెరికా కొత్త మాదకద్రవ్య ముప్పులపై సంయుక్త చర్యలకు అంగీకారం



ఢిల్లీలో నవంబర్ 2 నుంచి 3 వరకు జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో భారత్, అమెరికా దేశాలు కొత్తగా ఉద్భవిస్తున్న మాదకద్రవ్య ముప్పులను ఎదుర్కొనేందుకు సమన్వయ చర్యలు చేపట్టాలని అంగీకరించాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నిర్వహించిన రెండో భారత్-అమెరికా మాదకద్రవ్య విధాన కార్యనిర్వాహక వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత ప్రతినిధి బృందానికి ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ అనురాగ్ నాయకత్వం వహించగా, అమెరికా బృందానికి నేషనల్ డ్రగ్ కంట్రోల్ పాలసీ కార్యాలయ తాత్కాలిక ఉప డైరెక్టర్ డెబ్బీ సెగ్విన్ నేతృత్వం వహించారు. నవంబర్ 10న విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర మాదకద్రవ్య నిరోధక సంస్థ సమావేశ వివరాలను వెల్లడించింది. భారత్-అమెరికా మాదకద్రవ్య విధాన చట్రం నిబంధనల ప్రకారం జరిగిన చర్చల్లో అక్రమ మాదకద్రవ్య రవాణాపై ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించారు. నిఘా సమాచార భాగస్వామ్యం, సమన్వయ పోలీసు చర్యలు, మాదకద్రవ్యాల తయారీలో ఉపయోగించే రసాయనాల నియంత్రణ, ఔషధ సరఫరా గొలుసు సమగ్రత, మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు వంటి అంశాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తించారు. కొత్త మాదకద్రవ్య ముప్పులను ఎదుర్కొనేందుకు సంస్థల మధ్య నిరంతర సంబంధాలు, సకాలంలో నిఘా సమాచార మార్పిడి, సమన్వయ చర్యలు అవసరమని సమావేశం స్పష్టం చేసిందని ప్రకటన పేర్కొంది. లక్ష్యిత చట్ట అమలు అంశాల్లో ఉత్తమ పద్ధతులను మరింతగా పంచుకోవాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్ జనరల్ అనురాగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో రూపొందించిన మాదకద్రవ్య నియంత్రణ దృష్టి పత్రాన్ని ప్రస్తావించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కచే పబ్లిక్ స్కూల్ కు శంకుస్థాపన

– ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్(టి పి ఎస్) భవన నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేస్తారు.కాజీపేటలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన నేపథ్యంలో... హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధికి మరొక ముందడుగు పడుతున్న నేపథ్యంలో... తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో.. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయడంపై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగాఆర్డిఓ వెంకటేష్, టీడబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, హనుమకొండ కాజీపేట తహసీల్దార్ రాజు, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

5 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కును అందజేసిన ఎంపీ కావ్య



హనుమకొండ టౌన్, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి) :

హనుమకొండకు చెందిన మహ్మద్ ఆదిల్ అహ్మద్ అనే బాలుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, అతని చికిత్స కోసం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక శ్రద్ధ వహించి రూ.5 లక్షల రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ ఓ సి నీ మంగళవారం కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలంలో తమకు ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు బాధిత కుటుంబ సభ్యులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు.

నేలతీరు, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి.. రైతులకు కలెక్టర్ సూచన

ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలి



నల్గొండ:

రైతులు తమ భూముల నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూసి కొనుగోళ్లు, లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అనుముల మండలం పులిమామిడి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘబంధం సభ్యులు, హమాలీలను గన్నీ బ్యాగుల లభ్యత, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు, సీరియల్ నంబర్ల నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు 64 మంది రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, సీరియల్ నంబర్ల ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రంలో మద్దతు ధర వివరాలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న రైతు గంగయ్యను ధాన్యం తీసుకువచ్చి ఎన్ని రోజులైందని, సీరియల్ నంబర్ ఎంత వచ్చిందని అడిగి తెలుసుకోగా, తనకు 13వ నంబర్ కేటాయించినట్లు రైతు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగులను వెంటనే సరఫరా చేయాలని, లారీలను పంపించి ధాన్యాన్ని త్వరితగతిన లోడింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. హమాలీ కూలీలను కూడా అందుబాటులో ఉంచాలని, నీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా పరిశీలించారు.అనంతరం రైతులతో మాట్లాడుతూ, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రెండు ఎకరాల భూమి ఉన్న రైతులు అవసరాన్ని బట్టి ఒక ఎకరంలో మాత్రమే వరి సాగు చేసి, మిగిలిన భూమిలో తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా ఆలోచించాలని తెలిపారు. సన్న రకం వరి సాగు చేయాలనుకునే రైతులు ప్రభుత్వం సూచించిన రకాలను ఎంపిక చేసుకోవాలని, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుసుమ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో కుసుమ పంటకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, గ్రామపంచాయతీ పరిధిలోనే మార్కెట్ ఏర్పాటు చేయడంతో పాటు పంట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. రైతులు సంఘటితంగా ఏర్పడి సామూహిక వ్యవసాయం చేపడితే మరింత ప్రయోజనం పొందవచ్చని సూచించారు.గ్రామంలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. పాత విద్యుత్ వైరింగ్‌ను మార్చి, సోలార్ విద్యుత్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తే విద్యుత్ వినియోగంలో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, గ్రామపంచాయతీ నిధులతో కోతులను పట్టించి నల్లమల అడవుల్లో వదిలేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి మొదటి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని సర్పంచ్‌కు సూచించారు.భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ అరుణ, సత్యనారాయణ రెడ్డి, ఏఈఓ మహేష్, జీపీఓ స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి ... కలెక్టర్

అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి కావాలి

నవంబర్ నెలాఖరుకు మౌళిక సదుపాయాలతో పాటు అన్ని పనులు పూర్తి చేయాలి

వెలుగుమట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ - 10

ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు అన్ని రకాల మౌళిక వసతుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. వెలుగుమట్ల మోడల్ కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వెలుగుమట్ల మోడల్ కాలనీలో మొత్తం 300 ఇళ్లకు మంజూరు ఇవ్వడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక ప్రకారం ఇప్పటికే 22 ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ముగిసి ఫినిషింగ్ దశకు చేరగా, 119 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని వివరించారు. అలాగే 59 ఇళ్లు రూఫ్ లెవల్, 98 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని అన్నారు.లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ఇళ్ల నిర్మాణ స్టేజీని బట్టి ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వివిధ దశల్లో ఉన్న 205 ఇళ్లకు సంబంధించిన పేమెంట్లు పూర్తయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇళ్ల నిర్మాణ వేగాన్ని పెంచేందుకు ఇప్పటివరకు 133 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించామని తెలిపారు. కాలనీ వాసులకు అవసరమైన ఆరోగ్య, విద్యా సదుపాయాలు కల్పించడంలో భాగంగా నిర్మిస్తున్న బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి అన్ని పనులనూ పూర్తి చేసి, కాలనీని మోడల్‌గా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి రాజీ పడకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.కలెక్టర్ తనిఖీ సమయంలో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఈ కె. జగ్రామ్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, అధికారులు, తదితరులు.

రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

–టూరిజం నోడల్ అధికారి ఎ. ధర్మ నాయక్

ములుగు, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి) :

రామప్ప సరస్సు ఐలాండ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్ సూచించారు.మంగళవారం రామప్ప సరస్సు ఐలాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టూరిజం ఏఈవిజయ్, సంబంధిత అధికారులు తదితరులు.

జాతీయ ఐక్యతా దినోత్సవంలో యాదాద్రి జిల్లా బృందం

గుజరాత్ పర్యటన విజయవంతం..

కలెక్టర్ అనురాగ్ జయంతికి కృతజ్ఞతలు



యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తానగర్‌లో నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఎంపికైన 16 మంది సభ్యుల బృందం పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, బృంద నోడల్ అధికారి కె. ధనంజనేయులు ఆధ్వర్యంలో బృంద సభ్యులు ఈ నెల 9న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గుజరాత్ వంటి జాతీయ వేదికపై జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, యువత ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. అక్కడ పొందిన అనుభవాలను, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని జిల్లాలోని ఇతర యువతకు తెలియజేయాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని, భవిష్యత్తులో మరింత మంది యువతకు ఇలాంటి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న బృంద సభ్యులను అభినందించారు.జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కె. ధనంజనేయులు మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించిన కలెక్టర్‌కు, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్‌లోని ఏక్తానగర్ సందర్శనతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగాయని పేర్కొన్నారు. జాతీయ సమైక్యతా భావాన్ని చాటిచెప్పే ఈ పర్యటన విజయవంతం కావడానికి బృంద సభ్యులు సమన్వయంతో సహకరించారని తెలిపారు.ఈ బృందంలో తాజ్‌పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, తుర్కపల్లి సర్పంచులు కోమటిరెడ్డి సంతోష, భూక్యా సంతోష్ కుమార్, నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి తో పాటు సరగడ కరుణ్, పులేపాక అంబేద్కర్, వడ్లకొండ వేణు, డాక్టర్ చావా రాజ్‌కుమార్, కొర్ణ నరేష్, భువనగిరి సాయినాథ్, వట్టేపల్లి నరేష్, అర్రా విజయ్, జోక్ర రామ్ చరణ్ తేజ్, చిట్యాల శివకుమార్, చేగురి రామనవాసు, యాగమామిడి వెంకట నరసింహ పాల్గొన్నారు. మెడికల్, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర సంస్థల ప్రతినిధులు కూడా బృందంలో ఉన్నారు.

భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయమూర్తులకు ఘన సన్మానం

న్యాయరంగంలో అత్యున్నత స్థానాలకు ఎదిగి భద్రాచలం ప్రాంతానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖులు

యువ న్యాయవాదులకు వీరి ప్రస్థానం స్ఫూర్తిదాయకం – బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్



భద్రాచలం, 10/11/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం ప్రాంతం నుంచి న్యాయవాద వృత్తిలో తమ ప్రస్థానాన్ని ప్రారంభించి, నిరంతర కృషి, పట్టుదల, ప్రతిభాపాటవాలు, వృత్తిపట్ల అంకితభావంతో న్యాయవ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అత్యున్నత న్యాయమూర్తులుగా విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులకు భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన, ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలం పుణ్యక్షేత్రం పేరును రాష్ట్రస్థాయిలో మారుమోగేలా చేస్తూ న్యాయరంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన శ్రీ మండా వెంకటేశ్వరరావు, శ్రీ దేవరపల్లి నాగేశ్వరరావులను ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. ఒకప్పుడు ఇదే భద్రాచలం న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదులుగా తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించి, నేడు న్యాయమూర్తులుగా ఉన్నత బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రముఖులను అదే ప్రాంతానికి ఆహ్వానించి సత్కరించుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ, భద్రాచలం ప్రాంతం నుంచి న్యాయవాద వృత్తిని ప్రారంభించి, తమ ప్రతిభతో న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానాలను అధిరోహించి, నిబద్ధతతో, నిజాయితీతో, పారదర్శకతతో విధులు నిర్వహిస్తున్న గొప్ప న్యాయమూర్తులను మన బార్ అసోసియేషన్ తరపున సత్కరించుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు. న్యాయరంగంలో ఉన్నత స్థానాలను చేరుకోవడం అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యే విషయం కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం, సమాజానికి సేవ చేయాలనే సంకల్పం ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి విశిష్ట వ్యక్తులను మన మధ్యకు ఆహ్వానించి గౌరవించుకోవడం ద్వారా యువ న్యాయవాదులకు స్ఫూర్తిని అందిస్తున్నామని తెలిపారు. ఇదే భద్రాచలం ప్రాంతంలో జన్మించి, ఇక్కడి వాతావరణంలో పెరిగి, తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకొని ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ ముమ్మునేని సుధీర్‌కుమార్‌ల విశిష్ట సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ కొనియాడారు. భద్రాచలం ప్రాంతం నుంచి ఇంతమంది ప్రముఖులు న్యాయవ్యవస్థలో అత్యున్నత శిఖరాలను అధిరోహించడం ఈ ప్రాంత ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. న్యాయవ్యవస్థలో తమదైన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటూ ప్రజలకు న్యాయం అందించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇలాంటి ప్రముఖులు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి సభనుద్దేశించి మాట్లాడుతూ, న్యాయవాద వృత్తి అనేది కేవలం ఉపాధి కోసం చేపట్టే వృత్తి మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, ధర్మం, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు న్యాయవాదులు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యతాయుతమైన వృత్తి అని పేర్కొన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రతి కక్షిదారుడికి సత్వర న్యాయం అందించడంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. న్యాయవాద వృత్తి విలువలను కాపాడుతూ, వృత్తి పట్ల నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ, కక్షిదారులకు న్యాయం అందించడంలో న్యాయమూర్తులు అనుసరిస్తున్న విధానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. భద్రాచలం పుట్టినిల్లు నుంచి న్యాయవాదులుగా తమ ప్రయాణాన్ని ప్రారంభించి, రాష్ట్రస్థాయిలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వీరి ప్రస్థానం యువ న్యాయవాదులకు ఆదర్శప్రాయమని కొనియాడారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం శ్రమిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వీరి విజయప్రస్థానం నిరూపిస్తోందని పేర్కొన్నారు. అనంతరం సన్మానాన్ని స్వీకరించిన శ్రీ మండా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తాము అడుగుపెట్టి న్యాయవాద విద్యను అభ్యసించి, వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఈ భద్రాచలం పుణ్యక్షేత్రంలో తోటి మిత్రులు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఇంతటి ఘనమైన సన్మానాన్ని అందుకోవడం తనకు ఎంతో అపురూపమైన అనుభూతిని కలిగించిందని అన్నారు.

మారుమూలలపై కలెక్టర్ నజర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

జిల్లాలోని మారుమూల, సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మంగళవారం మణుగూరు మండలం చిన్నరాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ బాహ్య సరిహద్దులు, అటవీ భూముల హద్దులు, భూముల విస్తీర్ణం, సర్వే పురోగతిపై సర్వేయర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మొత్తం 1,395 ఎకరాల భూమి ఉండగా, అటవీ శాఖ రికార్డుల ప్రకారం 554 ఎకరాలు అటవీ భూమిగా ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పలువురు రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులు, అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల వినతులను సావధానంగా విన్న కలెక్టర్, రీసర్వే పూర్తయిన అనంతరం భూముల సరిహద్దులు, రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. రైతులు సమర్పించిన వినతులను సంబంధిత అధికారులు రికార్డుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్ తాగునీటి సరఫరా, విద్యుత్, వీధి దీపాలు, మొబైల్ నెట్‌వర్క్, రహదారి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాంనగర్ నుంచి పాములపాడు వరకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 70 కాడస్ట్రల్ గ్రామాలతో పాటు, పటాలు లేని ఏడు నాన్ కాడస్ట్రల్ గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 23 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించి, మండల కేంద్రాలకు సమీపంలోని గ్రామాలతో పాటు మారుమూల, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్లు తెలిపారు. మండల కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలను ప్రత్యేక అధికారులు తరచూ సందర్శించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, తాగునీటి సౌకర్యం, చేయూత పింఛన్లు తదితర సంక్షేమ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రజలు తెలియజేసే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.రీసర్వే ప్రక్రియలో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భూముల సరిహద్దులు, రికార్డులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే నిర్వహించి డిసెంబర్ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులు, భూ రికార్డులపై స్పష్టత ఏర్పడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నరేష్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సర్వేయర్లు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమెరికాలో అదృశ్యమైన శ్రీజ ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

బాధిత కుటుంబానికి కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫోన్‌లో భరోసా..

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి

నల్గొండ జిల్లా కనగల్ మండలం అమెరికాలోని బోస్టన్‌లో చదువుకుంటున్న కనగల్ మండలం శాబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కోయ యాదగిరి రెడ్డి, రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2వ తేదీ నుంచి అదృశ్యమైంది. పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లలో భాగంగా బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆందోళనకు గురయ్యారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆమె ఆచూకీ తెలియలేదు.కుమార్తె ఆచూకీ తెలియక తీవ్ర ఆవేదనలో ఉన్న తల్లిదండ్రులను నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం శాబ్దుల్లాపూర్ గ్రామంలో పరామర్శించారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేయడంతో ఆయన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శ్రీజ ఆచూకీ కనుగొనేందుకు సహకరించాలని కోరారు.దీనిపై కేటీఆర్ వెంటనే స్పందించి బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని, శ్రీజ తిరిగి వస్తుందని భరోసా ఇచ్చారు. పూర్తి వివరాలు తనకు అందించాలని, అమెరికాలో తనకు పరిచయమున్న వారితో మాట్లాడి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వివరాలను వెంటనే పంపించాలని కంచర్ల భూపాల్‌రెడ్డిని కోరారు.అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సైతం ఫోన్‌లో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదగిరిరెడ్డి దంపతుల ఏకైక కుమార్తె కనిపించకపోవడంతో వారు పడుతున్న వేదన తనను కలచివేసిందన్నారు. విషయం తెలియగానే కేటీఆర్ స్పందించి కుటుంబానికి భరోసా ఇవ్వడం, తన పరిచయాల ద్వారా సహకారం అందిస్తానని చెప్పడం వారికి కొంత ఊరటనిచ్చిందని తెలిపారు. శ్రీజ ఆచూకీ లభించే వరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

పల్లె సత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చండూరు, నవంబర్ 10 (వుదయం):

చండూరు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, బంగారుగడ్డ మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న మాతృమూర్తి పల్లె సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మంగళవారం బంగారుగడ్డ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లారు. అక్కడ పల్లె సత్తమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పల్లె వెంకన్నను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి - సీపీఐ ధర్నా



సూర్యాపేట నవంబర్ 11 వుదయం ప్రతినిధి

ఎన్ లినో ప్రభావంతో వంటలు పండకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వేలాది ఎకరాలు బీడు భూములు గా మారిపోయాయని, సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు సిపిఐ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని అన్నారు. సూర్యాపేట జిల్లాలో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోయారని కాబట్టి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన వారికి వారికి వరికి ఎకరానికి 30,000/- పత్తి మిర్చికి 50,000/- ఇతర పంటలకు 20,000/- రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. పనులు లేని రైతుకూలిలు పస్తులు వుంటున్నారని, వారికి రేషన్ దుకాణం ద్వారా 14 రకాల సరుకులు అందజేయాలని అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు అందజేసి, 200 రోజుల పాటు పని కల్పించాలని, రోజు కూలి 650/- ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీటి లభ్యత లేదు కాబట్టి రవిలో పంటలు వేయవద్దని ప్రభుత్వం చెబుతుందని, కాబట్టి ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎవో కు వినతి పత్రం అందజేశారు.

గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లకు పక్కా ప్రణాళిక రూపొందించాలి: కలెక్టర్

క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవసరమైన శాశ్వత తాత్కాలిక మౌలిక సదుపాయాలను గుర్తించాలి

అన్ని శాఖలు మూడు రోజుల్లోగా నిర్దీత నమూనాలో పనుల అంచనా ప్రతిపాదనలు సమర్పించాలి

పార్కింగ్ షటిల్ బస్సులు స్నాన ఘాట్లు భద్రత ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

గోదావరి పుష్కరాల వివిధ శాఖల పనుల పై సంబంధిత అధికారు లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

గోదావరి పుష్కరాలు –2027 ను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి ఇతర ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్ల కోసం పక్కా ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ బి సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం ఈవై కన్సల్టెన్సీ ఏజెన్సీ హైదరాబాద్ వారు రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ఈవై కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూపుష్కరాలకు ఇంకా ఆరు నెలల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనుల పై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏజెన్సీ రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేర్పులు చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రతి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి పుష్కరాల సమయంలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించాలని ఈవై కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతిపాదించిన అంశాలతో పాటు అదనంగా అవసరమైన సదుపాయాలు పనులను కూడా ప్రతిపాదించాలని తెలిపారు. గోదావరి పుష్కరాలు జరిగే ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయి ప్రణాళిక ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల ఎస్టిమేషన్లను మూడు రోజుల్లోగా నిర్దీత నమూనా ఫారంలో సమర్పించాలని ఆదేశించారు.పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనలు అంచనాలు కచ్చితంగా ఉండాలని ఏదైనా అవసర మైన పనికి నిధుల ప్రతిపాదనలో లోపం జరిగితే పుష్కరాల నిర్వహణ మొత్తం ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి ధర్మపురి గోదావరి తీరంలో స్నాన ఘాట్లు. తాత్కాలిక మరుగుదొడ్లు స్నాన గదులు దుస్తులు మార్చుకునే గదులు మంచినీటి ట్యాపులు పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో గుర్తించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా తాత్కాలిక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి అక్కడి నుంచి స్నాన ఘాట్లు ఆలయానికి చేరుకునేందుకు షటిల్ బస్సుల నిర్వహణపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు వాహనాల రాకపోకలు పార్కింగ్ బస్సుల రాకపోకలు భక్తుల నడక మార్గాలు పరస్పరం ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

1,331.84 హెక్టార్ల లో 9 జోన్లు, 20 సెక్టార్లుగా (వివిధ శాఖల) ప్రణాళిక

ఈవై కన్సల్టెన్సీ ఏజెన్సీ రూపొందించిన లేఅవుట్ ప్రణాళిక ప్రకారంధర్మపురిలో మొత్తం 1,331.84 హెక్టార్ల పరిధిలో పుష్కరాల ఏర్పాట్లను ప్రతిపాదించారు ఇందులో 9 కార్యాచరణ జోన్లు 20 సెక్టార్లుగా విభజించి వివిధ శాఖలకు బాధ్యతలు కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. వసతి బస్సులు బస్‌స్టాండ్ అత్యవసర సేవలు ఘాట్లు మాస్టర్ కంట్రోల్ రూమ్ భక్తుల నడక మార్గాలు ఆలయం వీఐపీ వీవీఐపీ ఏర్పాట్ల కోసం ప్రత్యేక జోన్లను ప్రతిపాదించారు.తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా సుమారు 161 హెక్టార్లలో పార్కింగ్ 33 హెక్టార్లలో టెంట్ సిటీ 10 హెక్టార్లలో హోల్డింగ్ ప్రాంతాలు 4 హెక్టార్లలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణాలు 2.5 హెక్టార్లలో వికయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా ప్రతిపాదించారు. ధర్మపురిలో సుమారు 800 మీటర్ల మేర గోదావరి ఘాట్ల అభివృద్ధి దుస్తులు మార్చుకునే గదులు మరుగుదొడ్లు కేశఖండన కేంద్రాలు ఘాట్ల సుందరీకరణ బ్రహ్మ పుష్కర కుండ అభివృద్ధి జీవవైవిధ్య పార్కు చెరువుల పునరుజ్జీవనం ప్రధాన కూడళ్ల అభివృద్ధి రహదారుల విస్తరణ మార్కెట్ వీధుల అభివృద్ధి బస్టాండ్ ఆధునీకరణ ఆలయ పరిసరాల్లో భక్తులకు అనుకూలమైన వసతుల కల్పన పంటి ప్రతిపాదనలను ఏజెన్సీ వివరించింది అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. వాహనాల రాకపోకలు ట్రాఫిక్ మళ్లింపు పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించేందుకుఅవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కీలక కూడళ్లు ఘాట్లు ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించడం అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తూ పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈసమీక్ష సమావేశంలోఅదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ప్రసూనాంబ ఈవైకన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగర్ నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):



ధ్రువీకరణ పత్రాల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలని సీపీ ఆదేశించారు.స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, వివిధ విభాగాలను పర్యవేక్షించే అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షలో భాగంగా ప్రధానంగా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఉద్యోగ (జాబ్) ధ్రువీకరణ, పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, నిర్దేశిత గడువులోగా నిక్కచ్చిగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి ధ్రువపత్రాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా విభాగం పనితీరు, ఫీల్డ్ అధికారుల కార్యాచరణపై సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమాచార సేకరణను వేగవంతం చేయాలని ఫీల్డ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.కార్యాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని పలు కీలక సూచనలు జారీ చేశారు.ఈ తనిఖీ మరియు సమీక్షా సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ అనిల్, డి.ఎ.వో. విరాజ్ తో పాటు ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఓబీ, ఆర్‌యూబీ పనుల్లో వేగం పెంచాలి- ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టీకరణ

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 10 :



ఆదిలాబాద్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనుల్లో ఇక జాప్యం జరగడానికి వీల్లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజినీర్ (సీఈ), సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూసేకరణ సమస్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైల్వే శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వాటా లేకుండానే రూ.104.50 కోట్ల నిధులు తీసుకురావడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు రూ.14.80 కోట్ల నిధులు విడుదల చేయించేందుకు కృషి చేశానని తెలిపారు.నిధులు సమకూర్చడం తన బాధ్యతగా భావించి కృషి చేశానని, ఇప్పుడు పనులను వేగవంతం చేసి నిర్దీత గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన అడ్డంకులను తక్షణమే తొలగించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

యువతే దేశ భవిష్యత్తు.. మత్తుకు దూరంగా ఉండాలి!

విద్యార్థులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచన

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 10 :



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, చదువు, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. మత్తు పదార్థాల అలవాటు యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని, వాటికి దూరంగా ఉండి జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు.ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – యంగ్ లీడర్స్ డైలాగ్ 2027'లో భాగంగా 'నషా ముక్త్ యువ భారత్' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల నియంత్రణ, యువతలో అవగాహన పెంపునకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సమాజంలోనూ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్ లో ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సాచ్యురేషన్ కార్యక్రమం



కరీంనగర్ నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

కరీంనగర్ జిల్లా మానకొండూరు, లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్ది బ్రాంచ్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సాచ్యురేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,పొదుపు ప్రాముఖ్యత,బీమా,అటల్ పెన్షన్ యోజన తదితర ఆర్థిక పథకాలపై మేనేజర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అన్లైన్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ ఉప-సర్పంచ్ రాపాక ప్రవీణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, చవాలాల్, 1వ వార్డ్ మెంబర్ ఉప్పు శారదా, 5వ వార్డ్ మెంబర్ రాపాక మధుకర్ మరియు మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో మెరిసిన కామారెడ్డి పోలీస్ క్రీడాకారులు

కామారెడ్డి, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

ఒక స్వర్ణం, ఎనిమిది కాంస్య పతకాలతో సత్తాచాటిన పోలీసులు

విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



వరంగల్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు, క్రీడా పోటీలు– 2026లో కామారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం ఒకస్వర్ణం, ఎనిమిది కాంస్య పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకువచ్చారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర వారిని ప్రత్యేకంగా అభినందించి, వారి క్రీడా ప్రతిభను ప్రశంసించారు. బ్యాడ్మింటన్ లో: భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. లక్షి మహిళల 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. డీఏఆర్ కామారెడ్డికి చెందిన ఎల్. బాబాగౌడ్, బి. లక్షి 40 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.ఖోఖోలో: బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డి. బుజ్జి కాంస్య పతకం సాధించారు. హ్యాండ్‌బాల్‌లో: డీఏఆర్ కామారెడ్డికి చెందిన ఎం. రేఖ, జి. శోభ, పిట్లం పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. ప్రియాంక, బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. సవితారాణి, పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఛి. వాసవి కాంస్య పతకాలు సాధించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..."పోలీస్ విధులు నిర్వహిస్తూనే క్రీడల పట్ల ఆసక్తి, అంకిత భావంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ఎంతో సంతోషకరమైన విషయం అని, ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ క్రీడల్లోనూ ప్రతిభ చాటుకోవడం వారి పట్టుదలకు, కృషికి నిదర్శనం. వీరి విజయాలు ఇతర మహిళా పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధిస్తూ కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. పతకాలు సాధించిన క్రీడాకారులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను" అని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, డీఎస్పీలు గటుమాల్, ఉదయ భాస్కర్, స్పెషల్‌బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సంపత్, ఆర్ఐలు సంతోష్‌కుమార్, నవీన్, ఇతర పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ధర్మపురి నవంబర్10(వుదయం ప్రతినిధి):



బాల్య వివాహాలను అరికట్టి చిన్నారుల బంగారు భవిష్య త్తుకు బాటలు వేయాలని గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి తెలి పారు.ధర్మపురి మండలం కమ లాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళ వారం చైల్డ్ హెల్ప్‌లైన్,మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో బాల్య వివాహాల నిరో ధంపై అవగాహన సదస్సు నిర్వ హించారు.ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి సామల్ల. రాజేశం మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, పాల్పడితే రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిం చే అవకాశం ఉందన్నారు.బాల్య వివాహాల వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుందని వివరించారు. చిన్నారుల రక్షణకు 1098, పోలీస్ 100, అత్యవసర సేవ లకు 112,మహిళల సహాయం కోసం 181 నంబర్లను వినియో గించుకోవాలని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ షేర్ ఎన్జీవో ప్రతినిధి కాదరి లత సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయుడు ఎదుల మహే ష్, ఉపాధ్యాయులు, గ్రామస్థు లు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడం అభినందనీయం..

సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



సిర్పూర్(టి): మండల కేంద్రంలో మంగళవారం రోజు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రీహర్ష్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సమస్యల పరిష్కార సమావేశంలో పాల్గొని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్న సబ్ కలెక్టర్ ని అభినందించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా పలువురికి డీఎస్ పెండింగ్ సమస్యలను పరిష్కరించి పట్టాలు అందజేయడం జరిగింది. అన్ని మండల కేంద్రాల్లో ఇటువంటి రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రహీముద్దీన్, సర్పంచ్ ఒడ్డేటి నాగమణి నన్నయ్య, వార్డు మెంబర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేరేళ్లలో దివ్యాంగులకు త్రీ-వీలర్ స్కూటీల పంపిణీ



ధర్మపురి, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజా పాలన సంక్షేమ ఫలాలు దివ్యాంగులకు అట్టడుగు స్థాయికి చేరుతున్నాయి.మండలంలోని నేరేళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో అర్హులైన దివ్యాంగులకు ఉచిత త్రీ-వీలర్ స్కూటీల పంపిణీ కార్యక్రమం మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహకారంతో గ్రామ సర్పంచ్ కాసారపు బాలా గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దివ్యాంగులు మంద సునీత, పాదం పెద్ద మీనయ్యలకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన త్రీ-వీలర్ స్కూటీల తాళాలను సర్పంచ్ కాసారపు బాలా గౌడ్ స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బాలా గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా, సమాజంలో ఆత్మ గౌరవంతో, స్వతంత్రంగా జీవించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సత్కార్యానికి చేయూతనందించిన అడ్లూరు లక్ష్మణ్ కుమార్ సేవలను ఆయన అభినందించారు. కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు తమ దీర్ఘ కాలికల అయిన త్రీ-వీలర్ స్కూటీని ఉచితంగా అందుకోవడం పట్ల లబ్ధిదారులు మంద సునీత, పాదం పెద్ద మీనయ్యలు ఆనందబాష్పాలు రాల్చారు. తమ కష్టాన్ని గుర్తించి వాహనాలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, సహకరించిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌కు, సర్పంచ్ కాసారపు బాలా గౌడ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసారపు కొమురయ్య, వార్డు సభ్యులు మామిడిపల్లి లక్ష్మీ రాజయ్య, బోనకంటి రాకేష్, బైరి నాగేష్,గ్రామ అధ్యక్షులు జంజూరి అశోక్,యూత్ అధ్యక్షులు బైరి గణేష్, మహిళా అధ్యక్షురాలు చక్రాల రజిత శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మడిశెట్టి లక్ష్మణ్, తోటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్కువ ధరలకే ఎరువులు విత్తనాలు అందించడమే లక్ష్యం

హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ సమీపంలోని ఏఆర్ గార్డెన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు తక్కువ ధరలకు ఎరువులు విత్తనాలు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హాకా రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. వానాకాలం వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో త్వరిత గతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ని కోరినట్లు తెలిపారు. రేపు పాక్స్ జగిత్యాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చలిగల్ లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో అత్యధిక మొక్కజొన్న పంట కొనుగోలు చేయటం జరిగిందని తక్కువ సమయం లో పండే పంటలు పండించే విదంగా రైతులు ఆలోచన చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సాగులో విద్యుత్ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్‌కుమార్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారా యణ రెడ్డి పాక్స్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల ముకుందం మాజీ జడ్పీటీసీ పెండెం రాములు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్ సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ పాక్స్ డైరెక్టర్ పురుషోత్తం రావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి కౌన్సిలర్ క్యాదాసు నవీన్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పులిశెట్టి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ దమ్మ మల్లారెడ్డి మాజీ సర్పంచ్ బత్తుల గంగాధర్ మాజీ ఉప సర్పంచ్ నలువాల తిరుపతి నలువాల సురేష్ సర్పంచ్ ఆనంద్ రెడ్డి మాజీ సర్పంచ్ లు దుమాల తిరుపతి బోనగిరి నారాయణ ఏఓ తిరుపతి నాయక్ దాసరి సతీష్ మహేష్ కోటగిరి మోహన్ గంగన్న నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వుదయం

www.voodayam.com

భూ రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్

వనపర్తి నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

పెద్దమందడి మండలం వీరాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర భూ రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వీరాయిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న భూముల కొలతలు, సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే నంబర్ల వారీగా భూముల కొలతలు చేపట్టడంతో పాటు, సంబంధిత భూయజమానులు, రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులను గుర్తించాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు అవకాశం లేకుండా సరిహద్దు రాళ్లను పక్కాగా గుర్తించి, వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రీసర్వే ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, తప్పులకు తావులేకుండా రికార్డులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రీసర్వే సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులు, భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూముల కొలతలు, సరిహద్దుల గుర్తింపు విషయంలో రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను కొనసాగించాలని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో కచ్చితత్వం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ రైతులు, అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు. సర్వే అధికారులు, మండల అధికారులు ఉన్నారు.



ప్రతి ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి

- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ భారీ ధర్నా.. అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు వినతిపత్రం



గద్వాల, నవంబర్ 10 వుదయం బ్యూరో

జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులతో రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ నాయకులు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరువు రైతులను ఆదుకోవాలని, ప్రత్యేక పరిహార ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జోగులాంబ గద్వాల జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి. అంజనేయులు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రతి ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు పంటలు చేతికందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పంట నష్టాలను క్షేత్రస్థాయిలో తక్షణమే అంచనా వేసి అర్హులైన రైతులందరికీ పరిహారం అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక కరువు పరిహార ప్యాకేజీ ప్రకటించాలని కోరారు.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

జోగులాంబ గద్వాల జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నడిగడ్డ ప్రాంత రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టులు పూర్తికాక పోవడంతో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతోందని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయాలని కోరారు.

న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం

ప్రభుత్వాలు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి కరువు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సీపీఐ నాయకులు కోరారు. కేవలం ప్రకటనలు, హామీలతో సమస్యలు పరిష్కారం కావని, తక్షణమే ప్రత్యేక కరువు పరిహార ప్యాకేజీ ప్రకటించి అమలు చేయాలని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు జి. రంగన్న, ఆశన్న, ఏ. నాగార్జున, వెంకట రాములు, గద్వాల మండల నాయకులు నారాయణ, వెంకట రాములు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రభుదాసు, తిమ్మప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భరత్, ప్రవీణ్, నాయకులు సురేందర్, శివ, ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేశ, రఘురెడ్డి, కార్మిక సంఘం నాయకులు అనోక్, సవరన్న, ఉపేంద్ర పాల్గొన్నారు.

డిజిటల్ పాలన పై అవగాహన పెంపొందించుకోవాలి

- ఈ హెచ్ ఆర్ ఎం ఎస్ ఆల్ లైన్ సేవలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట టౌన్ నవంబర్ 10(వుదయం ప్రతినిధి)



డిజిటల్ పాలనపై అవగాహన పెంపొందించుకుని ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ సేవలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎం ఎస్ విధానంపై మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ డిజిటల్ పాలన ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ విధానంలోకి మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ఉద్యోగులకు సంబంధించిన సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నాం అని తెలిపారు. ఈ వ్యవస్థలో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయనీ, మొదటిది హెచ్ఆర్ఎంఎస్‌కు సంబంధించిన ఉద్యోగుల వ్యక్తిగత వివరాలు, రెండవది విధులకు సంబంధించిన వర్క్ మాడ్యూల్, మూడవది సెలవుల మంజూరు, ఇతర సర్వీసు సంబంధిత కార్యకలాపాలు. ఈ సేవలన్నీ ఒకే డిజిటల్ వేదిక ద్వారా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు.. ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అటెండెన్స్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తామని, ఈ నెల 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ అటెండెన్స్ వివరాలను పరిశీలిస్తాం అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి జీతాల బిల్లుల అప్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, జీతాల బిల్లులు సమర్పించే ముందు సంబంధిత శాఖల నుంచి ఆన్‌లైన్ అటెండెన్స్ వివరాలు సక్రమంగా నమోదయ్యాయా లేదా అన్నది పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ప్రస్తుత నెల జీతాలను కేవలం ఆన్‌లైన్ అటెండెన్స్ ఆధారంగా నిర్ణయించడం లేదని, అయితే ఈ నెలలో ప్రతి ఒక్కరి ఆన్‌లైన్ అటెండెన్స్‌ను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపారు. కాబట్టి రాబోయే పది రోజుల్లో ప్రతి అధికారి, ప్రతి ఉద్యోగి తప్పని సరిగా ఈ విధానంలోకి రావాలని తేల్చి చెప్పారు.కొత్త కలెక్టరేట్ భవనంలోకి వెళ్లే సమయానికి ప్రతి ఒక్కరికీ ఈ విధానం అలవాటు కావాలన్నారు.

వచ్చే నెల నుంచి ఉద్యోగుల అటెండెన్స్, సెలవుల నమోదు, సంబంధిత సర్వీసు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆధునిక డిజిటల్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని, పాత విధానాల నుంచి ఆధునిక డిజిటల్ విధానాలకు మారుతున్న ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమను తాము సిద్ధం చేసుకోవాలన్నారు.ఈ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని, మీరు నేర్చుకున్న విషయాలను మీ సిబ్బందికి కూడా వివరించి, 100 శాతం డిజిటల్ వ్యవస్థను అమలు చేసే దిశగా కృషి చేయాలని ఆమె కోరారు. అందరి సహకారంతో డిజిటల్ పాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళ్తామని కలెక్టర్ ఆశా భావం వ్యక్తం చేశారు.కాగా రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి డి టి ఓ రాజ్ గోపాల్ చారీ నాయకత్వం వహించి, నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో పీ ఏ వో దేవ్ సింగ్, జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



అరుణజ్యోతికి న్యాయం చేయాలని క్రైస్తవ సంఘాల డిమాండ్

మహబూబ్‌నగర్ జిల్లా 10నవంబర్ (వుదయం బ్యూరో)

మహబూబ్‌నగర్‌లో క్రైస్తవుల మత విశ్వాసాలపై దాడులను సహించేది లేదంటూ క్రైస్తవ సంఘాలు నిరసన గళం వినిపించాయి. అరుణజ్యోతి అనే యువతిపై లక్ష్మణ్ అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను నిరసిస్తూ తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, క్రైస్తవ మైనారిటీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని బాధితురాలికి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలోనే ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పిలుపులో భాగంగా ఈరోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ ఎస్. వరప్రసాద్, వైస్ చైర్మన్ బి.ఐ. జాకబ్, సెక్రటరీ జె.ఐ. డేవిడ్, కోశాధికారి టి.ఎ. స్టీఫెన్, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు దాసరి శామ్యూల్ ప్రభాకర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షులు కాశపోగు ప్రసాద్, చర్చి కౌన్సిల్ సభ్యులు, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం!

- వీలైనంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోండి.. అత్యవసరమైతేనే బయటకు రండి
- వాహనదారులు వేగం తగ్గించాలి..

అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, నవంబర్ 10:వుదయం

చలికాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప పొగమంచు సమయంలో ప్రయాణాలు చేయవద్దని జిల్లా ప్రజలకు సూచించారు.ప్రయాణం తప్పనిసరైతే వేగం తగ్గించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా తెల్లవారుజామున నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం స్పష్టంగా కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పొగమంచులో అధిక వేగంతో వెళ్లడం, అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపుతప్పి ఢీకొనే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనదారులు హెడ్‌లైట్లు, ఇండికేటర్లు తప్పనిసరిగా వినియోగించాలని, పొగమంచు సమయంలో లో బీమ్ లైట్లు ఉపయోగించాలని సూచించారు. ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. మీ భద్రతే మీ కుటుంబానికి భరోసా.. ప్రయాణంలో తొందరపాటు వద్దు.. జాగ్రత్తే ప్రాణరక్షణ అని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు.

ప్రజల గడపకు పాలన.. నిరుద్యోగులకు కొత్త భరోసా!

- తెలంగాణలో 'ప్రజా సేవక్' వ్యవస్థకు కసరత్తు?
- లక్షమంది యువతకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా ఆలోచన.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడమే లక్ష్యం
- ప్రజలకు చేరువగా పాలన.. గ్రామస్థాయి నుంచి ప్రభుత్వ సేవల పర్యవేక్షణకు కొత్త మార్గం!



వికారాబాద్ నవంబర్ 11 (వుదయం బ్యూరో)

ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'ప్రజా సేవక్' పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదన రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తోందన్న వార్తలు ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సుమారు లక్షమంది వరకు యువతకు అవకాశం కల్పించే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. అయితే ఈ సంఖ్య, నియామకాల విధానం, వేతనాలు, అమలు సమయం వంటి అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరడం అత్యంత కీలకం. అనేక సందర్భాల్లో పథకాలపై అవగాహన లేకపోవడం, దరఖాస్తుల ప్రక్రియపై సమాచారం అందకపోవడం వల్ల అర్హులు ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ప్రజా సేవక్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులను గుర్తించడం, దరఖాస్తులకు సహకరించడం, ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి సేవలు సులభమయ్యే అవకాశం ఉంది.

గ్రామస్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి

ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి ఇటువంటి వ్యవస్థ ఉపయోగపడవచ్చు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారులకు చేరవేసే బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తే పాలనలో వేగం పెరిగే అవకాశం ఉంది. ప్రజా సేవక్ వ్యవస్థ విజయవంతం కావాలంటే నియామకాల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. అర్హతలకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు విధులపై శిక్షణ, అధికారుల పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన సేవలు అందించే విధంగా వ్యవస్థను రూపొందించాలి. లక్షమంది వరకు నియామకాలు చేపడితే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని కూడా సమగ్రంగా అంచనా వేయాలి. అవసరమైన నిధులు, సాంకేతిక సదుపాయాలు, పర్యవేక్షణ వ్యవస్థపై స్పష్టమైన ప్రణాళిక అవసరం.

నవంబర్ 19న సిద్ధిపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కే. హైమావతి ఆదేశం

వుదయం, సిద్ధిపేట బ్యూరో:



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈనెల 19వ తేదీన సిద్ధిపేట జిల్లా కేంద్రంలో చేయనున్న పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సిద్ధిపేటలో జరిగే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'ఇందిరమ్మ బీమా పథకం' మరియు 'ఇందిరమ్మ చీరల పంపిణీ' కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సభా నిర్వహణ కోసం గతంలో సీఎం సభ జరిగిన నాగదేవత గుడి సమీపంలోని ప్రాంగణాన్ని రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పరిశీలించినట్లు వివరించారు. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు, వీఐపీలకు, అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేదిక, పార్కింగ్, హెలిప్యాడ్, డయాస్, తాగునీరు, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, మరియు సీటింగ్ ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలన్నారు. రేపు (బుధవారం) ఉదయం నుంచే సభా ప్రాంగణం క్లీనింగ్, లెవలింగ్ పనులు ప్రారంభించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే సీఎం చేతుల మీదుగా ప్రారంభించాల్సిన, శంకుస్థాపనలు చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను తక్షణమే అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌వో) నాగరాజమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులకు న్యాయమైన పరిహారం

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, నవంబర్ 11: (వుదయం ప్రతినిధి)



రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, తూప్రాన్ మండలంలో భూసేకరణపై కలెక్టరేట్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు అథారిటీ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. భూముల వివరాలు, యాజమాన్య హక్కులు, రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని, పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ అధికారి గఫర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

వెల్దండ నవంబర్ 10 (వు దయం)



రాష్ట్ర బిఆర్ ఎస్ పార్టీ అధినేత మాజీ మంత్రి కేటీఆర్ ని మంగళవారం హైదరాబాదులో ఆయన నివాసంలో కల్వకుర్తి మండల మాజీ ఎంపీపీ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ కొండూరి గోవర్ధన్ మర్యాద పూర్వకంగా కలిసి కశాలువా కప్పి ఘనంగా సన్మానించి కూతురి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసి రావలసిందిగా ఆహ్వానించారు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, విజయ గౌడ్, అనిల్ కుమార్, కొండూరి శేఖర్ తదితరులు లు ఉన్నారు

ఓటరు జాబితాలో పేరు లేకపోయినా.. ఇదే చివరి అవకాశం



అర్హులైన ఓటర్లు వెంటనే ఫారం సమర్పించాలి.. డూప్లికేట్ నమోదుపై కలిన నిఘా

మెదక్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)-2026లో భాగంగా గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ పట్టణంలోని దయారాలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎలక్టోరల్ ఫారాలను పూర్తిచేసి సంబంధిత బూత్ స్థాయి అధికారి (BLO)కి సమర్పించాలని సూచించారు. గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్‌గా గుర్తించినప్పటికీ ఫారాలు అందని ఓటర్ల బూత్‌వారీ జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో ఉన్నట్లయితే, గతంలో ఫారం సమర్పించకపోవడానికి గల కారణాలను వివరిస్తూ అనుబంధం-బి (Annexure-B) ప్రకటనతో పాటు పూర్తిచేసి సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత ERO/AERO/BLOకు స్వయంగా లేదా కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, డూప్లికేట్ ఓటరు నమోదుకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సన్న బియ్యం బ్లాక్ మార్కెట్ దందాపై పౌర సరఫరాల శాఖ పంజా



సిద్ధిపేటలో సూపర్ మార్కెట్లు, రైస్ డిపోలపై ఆకస్మిక తనిఖీలు.. కేసు నమోదు!

సిద్ధిపేట, నవంబర్ 10 (వుదయం బ్యూరో)

నిత్యావసర ధరల భారం, వ్యాపారుల అక్రమ సంపాదనతో సాధారణ జనం జేబులకు చిల్లులు పడుతుండటంతో సిద్ధిపేట పట్టణంలో పౌర సరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు విరుచుకుపడ్డారు. మార్కెట్‌లో ప్రజా అవసరాలను ఆసరాగా చేసుకుని సరుకుల ధరలను ఆకాశానికి పెంచేస్తూ, తూకాలతో మోసం చేస్తున్న అక్రమార్కుల ఆట కట్టించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే సన్న బియ్యం విక్రయాలు జరిగేలా మంగళవారం పౌర సరఫరాల, తూనికలు-కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని మంగళవారం పలు ప్రముఖ వ్యాపార సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ (తూనికలు మరియు కొలతలు) అధికారి శివ రంజని, సహాయ పౌర సరఫరాల అధికారి సాయి రవితో కూడిన బృందం రత్నదీప్ సూపర్ మార్కెట్, మోర్ సూపర్ మార్కెట్, నేషనల్ సూపర్ మార్కెట్, శ్రీ రాజ మల్లికార్జున రైస్ డిపో, మరియు శేషాద్రి రైస్ డిపోలలో దాడులు జరిపారు.

ఈ తనిఖీల్లో 'శ్రీ రాజ మల్లికార్జున రైస్ డిపో'లో తూకాల్లో తేడాలు ఉన్నట్లు స్పష్టంగా గుర్తించడంతో అధికారులు వెంటనే సదరు షాపుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తూ.. "ప్రజా అవసరాలను ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా, తూకాల్లో తేడాలు చూపిస్తే ఉపేక్షించేది లేదు. ఎంతటి పెద్ద మార్కెట్ యజమానులైనా సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. వినియోగదారులు కూడా ఇలాంటి దోపిడీని గమనిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

జనవరిలో అల్వాల్ టిమ్స్ ప్రారంభం

- మంత్రి దామోదర్ రాజనర్సింహా
- అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి
- దాదాపు మూడు గంటల పాటు అన్ని బ్లాక్‌లు, వైద్య విభాగాల తనిఖీ.. అధికారులతో సమీక్ష

హైదరాబాద్ /సంగారెడ్డి :వుదయం

అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి, కొత్త ఏడాదిలో హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు. హాస్పిటల్ నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల ఏర్పాటు పురోగతిని మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి దాదాపు మూడు గంటల పాటు ఆసుపత్రిలోని అన్ని బ్లాక్‌లు, ఓపీ విభాగం, డయాగ్నస్టిక్స్, సీటీ స్కాన్, ఎక్స్ రే విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర వైద్య విభాగాలను మంత్రి స్వయంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ అండ్ బీ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో ఇంకా పూర్తి చేయాల్సిన సివిల్, ఎలక్ట్రికల్, తదితర పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆక్సిజన్, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ వ్యవస్థ, ఓపీ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు, ఫార్మసీ, కన్సల్టేషన్ రూములు, టాయిలెట్లు, ఆపరేషన్ థియేటర్లకు అవసరమైన అనుబంధ సదుపాయాలన్నీ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి విభాగాన్ని ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర విభాగంలో రోగుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రవేశ మార్గాలను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.

అల్వాల్ టిమ్స్ నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేయగా, 2023 ఫిబ్రవరిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని అధిజారులు మంత్రికి తెలిపారు. 2023 డిసెంబర్ నాటికి సివిల్ పనులు 14 శాతం మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం మొత్తం పనులు 95 శాతానికిపైగా పూర్తయ్యాయని మంత్రికి వివరించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి జనవరి 2027 నాటికి ఆసుపత్రిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ హాస్పిటల్‌లో మొత్తం 1,000 బెడ్లు అందుబాటులో ఉంటాయని మంత్రి వెల్లడించారు. 21 మేజర్, 7 మైనర్ ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలతో రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

న్యూరో, జెనెటిక్ సైన్సెస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

అల్వాల్ టిమ్స్‌ను న్యూరో సైన్సెస్, జెనెటిక్ సైన్సెస్ విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విభాగాల్లో అత్యాధునిక వైద్య సేవలతో పాటు పరిశోధనలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి ప్రత్యేక వైద్య విభాగాలతో పాటు వివిధ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



దౌలాపూర్ గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్" రైతు అవగాహన సదస్సు



జగదేవపూర్, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

రైతులు నిరంతరం వరి పంటనే సాగు చేయడం వల్ల భూమిలో పోషకాల సత్తువ తగ్గి, పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతోందని, దీనిని నివారించేందుకు పంట మార్పిడి మరియు పచ్చిరొట్ట ఎరువుల సాగు తప్పనిసరని మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగదేవ్‌పూర్ మండలం లోని దౌలాపూర్ గ్రామంలో రైతులకు విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. భూసార పరీక్షలు, నేల ఆరోగ్య పరిరక్షణ, వివిధ పంటల్లో పాటించాల్సిన సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి సంరక్షణతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తోటపంటల సాగును ప్రోత్సహించడంపై రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద, ఉలవ, పెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. ఇవి 50 శాతం పూత దశకు వచ్చినప్పుడు భూమిలో కలియదున్నడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, పంట దిగుబడి పెరగడమే కాకుండా రసాయన ఎరువుల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఒకవేళ జీలుగ, జనుము విత్తనాలు సకాలంలో లభించకపోతే విత్తనాల కోసం వేచి చూడకుండా పెసర సాగు చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల పచ్చిరొట్ట ఎరువు లభించడమే కాకుండా అదనంగా ఎకరానికి 3 నుంచి 4 క్వింటాళ్ల పెసల దిగుబడి కూడా సాధించవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి క్రాంతి కుమార్, గ్రామ సర్పంచ్ కె. కృష్ణ, ఉప సర్పంచ్ రామచందర్, పంచాయతీ కార్యదర్శి ఐలయ్య, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు కృష్ణ, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమ విద్యార్థులు, గ్రామ రైతులు బాగిరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు క్లాత్ క్లిప్స్ అందజేసిన అడిషనల్ కలెక్టర్

మహబూబ్ నగర్ నవంబర్ 10, వుదయం

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు తాము ఉతికిన దుస్తులను ఆరబెట్టుకునే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందిని తొలగించేందుకు, వారి సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ వసతి గృహ విద్యార్థులకు క్లాత్ క్లిప్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను నిరంతరం పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.





కన్నయ్య పల్లి గార్లపాడు లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

కోయిలకొండ, నవంబర్ 10, వుదయం

మండల పరిధిలోని కన్నయ్య పల్లి మరియు గార్లపాడు గ్రామ పంచాయతీల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) ధనుంజయ్‌గౌడ్ ఆకస్మికంగా పర్యటించారు. కన్నయ్య పల్లి గ్రామంలో జరుగుతున్న ఫార్మ్ పాండ్ (వ్యవసాయ కుంట) నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా, ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఘనంగా ప్రత్యేక పూజలు

రాజాపూర్: నవంబర్ 10, వుదయం

ఈద్గాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో సహాయ ఇంజనీర్ (ఏఈ) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ పరికరాలు, కంట్రోల్ రూమ్ (విద్యుత్ నియంత్రణ కేంద్రం) వద్ద అధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. విద్యుత్ శాఖ సిబ్బంది క్షేమంగా ఉండాలని, సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలందరికీ నిరంతర విద్యుత్ అందడంతో పాటు ప్రాంత అభివృద్ధి జరగాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం హాజరైన భక్తులకు, గ్రామస్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.



సిద్దిపేట జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రైతులు అధైర్యపడొద్దు – అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

సిద్దిపేట, నవంబర్ 10 (వుదయం బ్యూరో)



సిద్దిపేట జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026–27కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన మొత్తం 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభమయ్యాయని, ధాన్యం సేకరణకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. లక్ష్మీ కిరణ్ తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే నాణ్యమైన ధాన్యాన్ని (FAQ) నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల (PPC) నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి, కేటాయించిన రైస్ మిల్లులు మరియు గోదాములకు జాప్యం లేకుండా తరలించేలా రవాణా ఏర్పాట్లు కూడా పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP) పొందేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశామని, కావున రైతులు దళారులను నమ్మి ఆందోళన చెందవద్దని కోరారు. రైతులందరూ తమ ధాన్యాన్ని సమీపంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొంది లాభపడాలని సూచించారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి?

ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన...

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మహబూబ్‌నగర్ జిల్లా 10నవంబర్ (వుదయం బ్యూరో)



జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవల తీరుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా వివేక గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. నారాయణపేట జిల్లా చెందిన శరణప్ప (50) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని వివేక గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుటుంబ సభ్యుడు ప్రాణాలు కోల్పోయారని మృతుడి బంధువులు ఆరోపించారు. చికిత్స సమయంలో తమను లోపలికి అనుమతించకుండా, డబ్బులు డిమాండ్ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వైద్యుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులైన ఆస్పత్రి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- తాడూరు నియోజకవర్గంలో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సముచిత స్థానం కల్పించా....
- తాండూరు ఎమ్మెల్యే బి ఎమ్.రెడ్డి

తాండూరు నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

సమాజంలో స్వపక్షం, విపక్షం అనే తేడా లేకుండా నిష్పక్షపాతంగా వార్తలను అందిస్తూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తాండూరు ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా సత్య భారతి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభ లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ అబద్దాలు ఎక్కువగా ప్రచారమయ్యే నేటి సోషల్ మీడియా కాలంలో నిజమైన జర్నలిజానికి ఎంతో గౌరవం ఉందనిపేర్కొన్నారు.

ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం శ్రమించే జర్నలిస్టులే సంఘటనలకు సంబంధించిన సరైన సమాచారాన్ని అందిస్తారని, అధికారులు కూడా ముందుగా జర్నలిస్టుల సమాచారాన్నే నమ్ముతారని కొనియాడారు. జర్నలిస్టుల ప్లాట్లు, హెల్త్ కార్డులు మరియు ఇతర సమస్యలను ముఖ్యమంత్రి, స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. శాసనసభ స్పీకర్ సమక్షంలో జిల్లా ఎమ్మెల్యేలందరితో కలిసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమములో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు విరసత్ హలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం, శ్రీనివాస్ చారి, శ్రీధర్ జర్నలిస్టులు పాల్గొన్నారుగతంలో కేటాయించిన ప్లాట్ల సమస్యను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు.జర్నలిస్టుల అందరి భరోసా కోసం ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని తక్షణమే తన వంతుగా అందజేసినట్లు వెల్లడించారు.అర్హులైన నిరుపేద జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి హామీ: జర్నలిస్టుల ప్లాట్లు, హెల్త్ కార్డులు మరియు ఇతర సమస్యలను ముఖ్యమంత్రి, స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. శాసనసభ స్పీకర్ సమక్షంలో జిల్లా ఎమ్మెల్యేలందరితో కలిసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమములో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు విరసత్ హలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం, శ్రీనివాస్ చారి, శ్రీధర్ జర్నలిస్టులు పాల్గొన్నారు



రేవంత్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి

- ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించుకుంటున్న రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన రవాణా అధికారులు
- వసూళ్లకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ పల్లయ్య



అయిజ, నవంబర్ 10 వుదయం ప్రతినిధి

రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని, ఇది ప్రజాపాలన కాదని.. లంచాల పాలనగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య విమర్శించారు. అయిజ మండలం తుపత్రాల గ్రామంలో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పంటలకు అందించుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం జిల్లా రవాణా అధికారులు అక్కడికి వచ్చి ట్యాంకర్లతో నీళ్లు పెట్టడం అక్రమమని, ఆపకపోతే రూ.1.50 లక్షలు పోలీస్ స్టేషన్‌లో చెల్లించాల్సి వస్తుందని రైతులను బెదిరించినట్లు ఆరోపించారు. ఒక్కొక్క రైతు నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేసి వెళ్లారని పేర్కొన్నారు.

మాణిక్యం, మహేందర్ గౌడ్ అనే ఇద్దరు రైతుల నుంచి రూ.5 వేల చొప్పున డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. పంటలు ఎండిపోకుండా అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించుకుంటున్న రైతుల పట్ల అధికారులు ఇలాంటి వైఖరి ప్రదర్శించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కురువ పల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, చివరకు రైతులు సొంత ఖర్చులతో నీటిని తెచ్చుకుంటున్నా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతులు తమ వద్ద డబ్బులు లేవని, తాము కష్టాల్లో ఉన్నామని వేడుకున్నా అధికారులు కనికరించకుండా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. ప్రజాపాలన అంటే రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడమేనా అని ప్రశ్నించారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా రవాణా అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మాణిక్యం, మహేందర్ గౌడ్, బాలు రాజు, చిన్న పెద్దయ్య, హుస్సేని, సుజాత, ఈరన్న, భగవాన్ దాస్, ధర్మన్న, రాయుడు, భాస్కర్, రామాంజనేయులు, శేఖర్, రాజు, వడ్డె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి చిరుకానుకలు అందజేసిన భాస్కర్ నాయక్

మిడ్జిల్, నవంబర్ 10, వుదయం:

మండలం కొత్తపల్లి గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకొని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, ఫ్రంట్‌లైన్ సిబ్బందికి స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్ దీపావళి చిరుకానుకలు అందజేశారు. జేబీఎన్ టీమ్ సభ్యుడు రాగుల రమేష్ ద్వారా సిబ్బందికి బట్టలు, స్వీట్స్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు లాలూ, బచ్చమ్మ, ఈదమ్మ, వెంకటమ్మ, బామ్మి, డీలర్ అమీరుద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు పొన్నవి, శారద, మంజుల, ఆశా వర్కర్ స్వర్ణలత, బుక్ కీపర్ భాగ్య, ప్రాథమిక పాఠశాల స్వీపర్ రాములు, వంట మనిషి ఇందిరమ్మ పాల్గొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ డోలు మంగమ్మ శ్రీనివాసులు, ఉపసర్పంచ్ తిరుపతయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులను శాలువాలతో సన్మానించారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం.. రైతుకు రూ.లక్ష నష్టం!

800 గడ్డిమోపులు అగ్నికి ఆహుతి.. ఘటనాస్థలాన్ని పరిశీలించిన జీపీఓ


నవాబుపేట: నవంబర్ 11, వుదయం:



మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రైతుకు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమై తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. మండలానికి చెందిన రైతు కారుకొండ చంద్రయ్య తన ఐదు ఎకరాల పొలంలో పశువుల మేత కోసం సేకరించి నిల్వ ఉంచిన సుమారు 800 గడ్డిమోపుల వాము అనుకోకుండా మంటలు చెలరేగడంతో అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో రైతు, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో మహబూబ్‌నగర్ నుంచి ఫైర్ ఇంజన్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రైతు చంద్రయ్యకు సుమారు రూ.లక్ష ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. కష్టపడి సేకరించి నిల్వ ఉంచిన పశువుల మేత కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన విషయాన్ని బాధిత రైతు తహసీల్దార్ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి నష్టాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు జీపీఓ కమలయ్య ఘటనాస్థలానికి చేరుకుని దగ్ధమైన గడ్డివామును పరిశీలించారు. జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి వివరాలు సేకరించారు. అనంతరం బాధిత రైతు చంద్రయ్యను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేటీఆర్ చేతుల మీదుగా భాస్కర్ రావుకు ఘన సన్మానం

వెల్దండ నవంబర్ 10 (వు దయం)



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ ను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వెల్దండ మండల సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి భాస్కరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భాస్కరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని కేటీఆర్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..నిబద్ధతతో పనిచేసే బీఆర్ఎస్ పార్టీ నాయకులలో భాస్కరరావు ఒకరని కొనియాడారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకొని, ప్రజాక్షేత్రంలో ప్రజాసేవలో మరింత ముందుకు పోతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం అని కేటీఆర్ స్పష్టం చేశారు.ఈ జన్మదిన వేడుకలలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత



- అదనపు కలెక్టర్ నర్సింగరావు
- మెరిట్ ఆధారంగా 49 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

గద్వాల, నవంబర్ 10 వుదయం కరస్పాండెంట్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు పొందిన అభ్యర్థులు బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేయనున్న 49 పోస్టులకు మెరిట్ ఆధారంగా ఎంపికైన అర్హులైన అభ్యర్థులకు మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య వ్యవస్థ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తోందని తెలిపారు. నియామకాలు పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన విధులను సమయపాలన, క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు. జిల్లాలో మొత్తం 49 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో 36, ఆయుష్ విభాగంలో 8, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం పరిధిలో 5 పోస్టులు ఉన్నాయని వివరించారు. నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులు స్వీకరించి, అభ్యర్థుల విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి, నిబంధనల మేరకు మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నియామకాలతో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సేవలు మరింత బలోపేతం అవుతాయని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియామక పత్రాలు పొందిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి, వైద్య సిబ్బంది, ఎంపికైన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

చక్కని ఆరోగ్యం

డెలివరీ తర్వాత బరువు తగ్గాలంటే..!




ప్రసవానంతర సమస్యల్ని దూరం చేయడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేస్తూ.. క్యాలరీలు తక్కువగా, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని డైట్‌లో చేర్చుకుంటే ప్రసవానంతరం త్వరగా బరువు తగ్గచ్చంటున్నారు.

ప్రసవం తర్వాత శరీరం శక్తిని కోల్పోయి పూర్తిగా బలహీనపడుతుంది. అయితే ఈ శక్తిని తిరిగి కూడగట్టుకోవాలంటే.. వ్యాయామం చక్కటి మార్గం అంటున్నారు నిపుణులు. వ్యాయామం చేసే క్రమంలో ఎండార్ఫిన్లు, డోపమైన్, సెరటోనిన్.. వంటి హ్యాపీ హార్మోన్లు శరీరంలో విడుదలవు తాయి. ఇవి శరీరంలో శక్తిని పెంచడంతో పాటు ప్రశాంతతను అందిస్తాయని చెబుతున్నారు. బిడ్డకు జన్మనిచ్చాక నిద్రలేమి, అలసటతో తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతుంటుంది. అయితే విభిన్న వ్యాయామాలు, యోగా, ధ్యానం.. వంటివి ఒత్తిడిని తరిమికొట్టి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఇలా ప్రశాంతంగా ఉండడం వల్ల ఊపిరి తిత్తులు.. మన శరీరంలో అత్యంత ముఖ్యమైనవి. అయితే నేటి జీవనశైలి మార్పులు, కాలుష్యం, ధూమపానం అలవాట్ల కారణంగా చాలామంది ఊపిరితిత్తుల క్యాన్సర్ బారినపడుతున్నారు. రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ల తర్వాత మరణానికి లంగ్ క్యాన్సర్ మరో ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ క్యాన్సర్ ఉన్నవారు శ్వాస తీసుకోవడంలో ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. ఇటీవలి పరిశోధన ప్రకారం.. వ్యాధి నిర్ధారణకు ఐదు సంవత్సరాల కంటే ముందే ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని అంచనా వేయగల ఒక ప్రొటీన్ సిగ్నేచర్‌ను శాస్త్రవేత్తలు రక్తంలో గుర్తించారు. ఇది ముందస్తు చికిత్సకు మార్గం సుగమం చేయడంతో పాటు, రోగులు బతికే అవకాశాల్ని మెరుగుపరుస్తుంది. లండన్‌కు చెందిన ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్, ఆస్ట్రేలియాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన చేశారు. శాస్త్రవేత్తలు మెషిన్ లెర్నింగ్ సాంకేతికతను ఉపయోగించి యూకే బయోబ్యాంక్‌లోని దాదాపు 48,000 మంది రక్త నమూనాల్ని, వారి ఆరోగ్య రికార్డులను విశ్లేషించారు. ఇందులో ఉన్న రక్తంలోని 14 ప్రత్యేక రకాల ప్రొటీన్ల కలయికను వారు గుర్తించారు. ఇవి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నవారిలో సగటున 5.6 సంవత్సరాల ముందే మార్పులను చూపిస్తాయి.

కణితి నుంచి కాదు: ఈ పరిశోధనలో తేలిన అత్యంత కీలకమైన విషయం ఏంటంటే ఈ ప్రొటీన్ సంకేతాలు క్యాన్సర్ గడ్డల నుంచి రావడం లేదు. వాయు కాలుష్యం లేదా ఇతర కారణాల వల్ల ఊపిరితిత్తులలో దీర్ఘకాలంగా ఏర్పడే వాపు లేదా మంట వల్ల ఈ ప్రొటీన్లు రక్తంలో పెరుగుతాయి. ఈ వాతావరణమే నిద్రాణంగా ఉన్న క్యాన్సర్ కణాలను యాక్టివేట్ చేస్తుంది. వారికి కూడా ముప్పే: ప్రస్తుతం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కేవలం 50–70 ఏళ్ల వయసు ఉండి, ఎకువ ధూమపానం చేసేవారికే చేస్తున్నారు. కానీ, లంగ్ క్యాన్సర్ బాధితుల్లో దాదాపు పావు వంతు మంది అస్సలు ధూమపానం చేయనివారే ఉంటున్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యం ఎకువగా ఉండే ప్రాంతాల్లో నివసించే వారిలో ఈ ముప్పు పెరుగుతున్నది. ఈ కొత్త బ్లడ్ టెస్ట్ సిగరెట్ తాగని వారిలో కూడా క్యాన్సర్ ముప్పును ముందే గుర్తిస్తుంది. నివారణ సాధ్యమే: క్యాన్సర్ రాకముందే ఈ ప్రొటీన్ సంకేతాల ఆధారంగా హై–రిస్ ఉన్నవారిని గుర్తిస్తే, వారికి మంటను తగ్గించే మందులు ఇవ్వడం ద్వారా క్యాన్సర్ రాకుండా ముందే ఆపవచ్చని ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో శాస్త్రవేత్తలు గమనించారు. భారతదేశంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో దాదాపు 80% నుంచి 85% మంది రోగులు వ్యాధి చివరి దశకు చేరిన తర్వాతే హాస్పిటల్‌కు వస్తున్నారు.

ఐదేళ్ల ముందే పసిగట్టవచ్చు



ఈ ఐస్‌క్రీమ్ చాలా ప్రత్యేకం

జామ, సీతాఫలం, మ్యాంగో, స్ట్రాబెర్రీ.. ఇలా రకరకాల ఐస్‌క్రీమ్‌లు తిని ఉంటారు. కానీ తాటి ముంజలతో ఐస్‌క్రీమ్ ఎప్పుడైనా రుచి చూశారా? లేదు కదూ.. ఎందుకంటే ఇది బయట దొరకదు.. ఒకసారి ట్రై చేసి చూడండి..

కావలసినవి: పాలు – అర లీటర్, కస్టర్డ్ పౌడర్ – నాలుగు స్పూన్లు, లేత తాటి ముంజలు – 12, పంచదార – 100 గ్రాములు, వెనీలా ఎసెన్స్ – కొద్దిగా



తయారీ: తాటి ముంజలు కడిగి, పొట్టు మొత్తం తీసేయాలి. అలా తీస్తున్నప్పుడు ముంజల్లోని నీటిని చిన్న పాత్రలోకి తీసి ఉంచుకోవాలి. అన్ని ముంజలూ పలిచాక ముక్కలుగా కట్ చేయాలి. కస్టర్డ్ పౌడర్‌ను ఒక బౌల్‌లో వేసి తగినన్ని నీళ్లు జోడించి.. ఉండలు కట్టకుండా కలపాలి. ఇప్పుడు వెడల్పాటి పాత్రలో పాలను వేడి చేయాలి. అవి మరుగుతుండగా.. పంచదార, కస్టర్డ్ పౌడర్ మిశ్రమం, వెనీలా ఎసెన్స్ జోడించి కలియబెడుతుండాలి. అది చిక్కగా క్రీమ్‌లా తయారయ్యాక.. ముక్కలుగా తరిగిన ముంజలను, వాటిలోని నీటిని జతచేసి.. మెల్లగా కలపాలి. కొన్ని క్షణాలుంచి దించేయాలి. గిన్నె గది ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత.. ఓ అరగంట రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. రుచికరమైన తాటి ముంజల ఐస్‌క్రీమ్ తయారైపోతుంది. ఇక ఆస్వాదించి, ఆనందించడమే తరువాయి.

పెదాలు నల్లబడుతున్నాయా?



ఈ సమస్య ఎందుకొస్తుంది? దీన్నుంచి బయటపడాలంటే ఏం చేయాలి? మొదలైన విషయాల గురించి నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం రండి.. లిప్ పిగ్మెంటేషన్‌కి మనం పాటించే అనారోగ్యపూరిత జీవన శైలితో పాటు వివిధ రకాల కారణాలున్నాయంటున్నారు నిపుణులు. రసాయనాలుండే సౌందర్య ఉత్పత్తుల్ని వాడడం, అతినీలలోహిత కిరణాల ప్రభావం, శరీరంలో మెలనిన్ ఉత్పత్తి అధికమవడంతో పాటు కొంతమంది గర్భిణుల్లోనూ ఈ సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఇంట్లో లభించే కొన్ని సహజ పదార్థాలతో ఈ సమస్యను దూరం చేసుకోవచ్చంటున్నారు. SPF 15 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న లిప్‌బామ్‌ను రోజూ బయటికి వెళ్లే ముందు పెదాలకు రాసుకోవాలి. తద్వారా అతినీల లోహిత కిరణాల ప్రభావం అధరాలపై పడకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే పెదాలకు అడ్డుగా మాస్క్ ధరించడం లేదా స్కార్ఫ్‌తో కవర్ చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంలో విటమిన్–ఎ సహకరిస్తుంది. అందుకే ఈ పదార్థం ఉన్న లిప్‌బామ్‌లు, లిప్‌క్రీమ్‌లు తరచూ ఉపయోగించడం వల్ల ఫలితం ఉంటుందట. అలాగే 'ఎ' విటమిన్ అధికంగా ఉండే చిలగడదుంప, క్యారట్, పాలకూర, బ్రకలీ.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడమూ ముఖ్యమే. రాత్రి పడుకునే ముందు పెదాలకు ఆలివ్ ఆయిల్ రాసుకున్నా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇది పొడిబారిపోయి పాలిపోయిన పెదాలకు తేమనందిస్తుంది. తద్వారా అధరాలు మృదువుగా మారడంతో పాటు మంచి రంగులోకి వస్తాయట. మెలనిన్ స్థాయుల్ని అదుపు చేసే శక్తి కలబందకు ఉందని చెబుతోంది ఓ అధ్యయనం. అందుకే కలబంద గుజ్జును రోజూ రాత్రి పూట పెదాలపై రాసుకొని కాసేపు మర్దన చేసుకోవాలి. తద్వారా చర్మానికి తేమ అంది పెదాలు మృదువుగా మారతాయంటున్నారు. కొంతమందికి పదే పదే పెదాలను నాలుకతో అద్దడం, పంటితో కొరకడం అలవాటు! దీనివల్ల కూడా పెదాలు పొడిబారి రంగు మారిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ అలవాటును పూర్తిగా మానుకోవడం మంచిదంటు న్నారు. తేనెను పెదాలపై రాసుకొని ఆరే వరకు అలాగే ఉంచుకోవాలి.. లేదంటే పడుకునే ముందు అప్లై చేసుకొని రాత్రంతా ఉంచుకొని మరుసటి రోజు చల్లటి నీళ్లతో కడిగేయాలి. దీనివల్ల చక్కటి ఫలితం ఉంటుందట. పడుకునే ముందు షియా బటర్.. వంటి సహజసిద్ధమైన ఉత్పత్తుల్ని అప్లై చేసుకోవడం వల్ల పెదాలకు పోషణ లభిస్తుంది.. సమస్య కూడా తగ్గుముఖం పడుతుందట. బయటి నుంచి ఎలాంటి క్రీమ్‌లు, లిప్‌బామ్/లిప్ జెల్.. వంటివి వాడాలనుకున్నా.. ముందుగా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఇతర సహజసిద్ధమైన చిట్కాలు పాటించే ముందు కూడా అవి చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

శాండ్‌విచ్ మసాలా పౌడర్ ఇలా..

శాండ్‌విచ్ చేసినప్పుడు.. ఏమంత టేస్టీగా లేదని పించి అసంతృప్తి కలుగుతోందా? అయితే ఈ మసాలా పౌడర్‌ను చల్లితే స్ట్రీట్‌ఫుడ్ రుచి వస్తుంది. అది ఇంట్లోనే చేయొచ్చు.. శాండ్‌విచ్ మసాలా పౌడర్ కోసం.. జీలకర్ర – 30 గ్రా, బ్లాక్ సాల్ట్, సాధారణ ఉప్పు – తగినంత, మిరియాలు, ఆమ్‌చూర్ పౌడర్ – 2 స్పూన్ల చొప్పున, ఛాట్ మసాలా – టేబుల్ స్పూన్, ఇంగువ – పావు స్పూన్, పుదీనా పొడి – టేబుల్ స్పూన్, ధనియాలు, శొంఠి పౌడర్లు – స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. జీలకర్రను సన్న సెగ మీద కేవలం ఆహారం నమలడానికి మాత్రమే ఉపయోగించాలి. కానీ. చాలామంది దంతాలను కత్తెరలానో, క్యావ్ ఓపెనర్‌లాగో భావిస్తుంటారు. దంతాలతో కూల్ డ్రింక్ బాటిల్ మూతలు తీయడం, ప్లాస్టిక్ ప్యాకెట్లు లేదా చిప్స్ ప్యాకెట్లను చింపడం, టేపులను కత్తిరించడం వంటి పనులు చేస్తుంటారు. ఈ ఒత్తిడి వల్ల దంతాలపై మైక్రో ఫ్రాక్చర్స్ ఏర్పడి పళ్లు ముకలయ్యే ప్రమాదం ఉంది. వాటి వల్ల కూడా: రోజంతా ఏదో ఒకటి తింటూనే ఉండటం లేదా పదేపదే టీ, కాఫీలు తాగడం పళ్లకు అస్సలు మంచిది కాదు. మనం తిన్న ప్రతిసారీ నోటిలో యాసిడ్స్ విడుదలవుతాయి. ఈ యాసిడ్ ఉత్పత్తి నిరంతరాయంగా సాగి, ఎనామెల్ పొరను కరిగించివేస్తుంది. దీనివల్ల దంతాలు లోపలి నుంచి గుల్లగా మారిపోతాయి. ప్రమాదం రెట్టింపు: సోడాలు, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్, ఆలహాల్ లాంటివి తాగడం వల్ల శరీర ఆరోగ్యమే కాకుండా దంతాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. వీటిలో ఉండే అధిక ఆమ్ల గుణాలు దంతాల ఎనామెల్‌ను క్షీణింపజేసి, పిప్పిపళ్లు లేదా క్యావిటీలు వచ్చే ప్రమాదాన్ని వంద శాతం పెంచుతాయి. తిన్న వెంటనే: ఆహారం తిన్న వెంటనే బ్రష్ చేయడం సరైంది కాదు. మనం ఏదైనా తిన్నప్పుడు దంతాల ఎనామెల్ పొర కాస్త మెత్తబడుతుంది. ఆ సమయంలో బ్రష్ చేస్తే ఎనామెల్ సులభంగా ఊడిపోతుంది. కాబట్టి ఏదైనా తిన్న తర్వాత కనీసం 30 నిమిషాలు ఆగి బ్రష్ చేయడం లేదా కేవలం నీటితో నోరు పుకిలించడం మంచిది. ఫ్లాసింగ్ చేయాలి: కేవలం బ్రష్ చేయడంతోనే దంతాల శుభ్రత పూర్తి కాదు. రెండు దంతాల మధ్య ఇరుకుపోయిన ఆహార కణాలను బ్రష్ తొలగించలేదు. ఇందుకోసం డెంటల్ ఫ్లాస్ వాడాలి. ఫ్లాసింగ్ చేయకపోతే ఆ ఆహార కణాలు అకడే కుళ్లిపోయి బ్యాక్టీరియా చేరి ప్లేక్‌లా మారుతుంది. ఇది చిగుళ్ల వ్యాధులకు, దంతాలు కుళ్లిపోవడానికి ప్రధాన కారణమవుతుంది.



కిడ్నీ కష్టాన్ని కనిపెట్టండి



మన శరీరంలో ఎలాంటి విరామం లేకుండా నిరంతరం పనిచేసే అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. శరీరంలో పేరుకుపోయే మలినాలను బయటికి పంపించడం నుంచి రక్తపోటును నియంత్రించడం వరకు అనేక కీలక బాధ్యతలను ఇవి నిర్వహిస్తాయి. అయితే మూత్రపిండాలు దెబ్బతినడం ప్రారంభమైనా చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందుకే కిడ్నీ రుగ్మతలను నిశ్శబ్దంగా దెబ్బతీసే వ్యాధులుగా వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుత కాలంలో మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనశైలి, తక్కువ నీరు తాగడం వంటి కారణాలతో మూత్రపిండాల వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు ఇప్పుడు యువతలో కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం.

భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల బారినపడుతున్నారు. వారిలో చాలామంది చివరి దశలో మాత్రమే సమస్యను గుర్తిస్తున్నారు. ఫలితంగా రక్త శుద్ధి చికిత్సలు, మూత్రపిండాల మార్పిడి అవసరమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అయితే సరైన అవగాహన, ముందస్తు పరీక్షలు, జీవనశైలిలో మార్పులు, ఆధునిక చికిత్సలతో మూత్రపిండాల వ్యాధులను నియంత్రించడం మాత్రమే కాకుండా నివారించడమూ సాధ్యమే అంటున్నారు నిపుణులు. రక్తాన్ని శుద్ధి చేయడం: మూత్రపిండాలు నిరంతరం రక్తాన్ని వడగట్టి శరీరానికి అవసరం లేని మలినాలను మూత్రం రూపంలో బయటికి పంపిస్తాయి. శరీరంలో నీటి సమతౌల్యాన్ని కాపాడటం: శరీరంలో నీరు అధికమైనా, తక్కువైనా సమతౌల్యాన్ని నిలుపుకోవడంలో మూత్రపిండాలు కీలక పాత్ర పోషిస్తాయి. రక్తపోటు నియంత్రణ: ప్రత్యేక రసాయన పదార్థాల ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. రక్తహీనతను నివారించడం: ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్ల తయారీలో సహకరిస్తాయి. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడం: విటమిన్ డిని శరీరానికి ఉపయోగపడే రూపంలోకి మార్చి కాల్షియం శోషణకు సహకరిస్తాయి. మధుమేహం: రక్తంలో అధిక చక్కెర స్థాయులు మూత్రపిండాల్లోని సూక్ష్మ రక్తనాళాలను దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటు: రక్తపోటు ఎక్కువగా ఉండటం వల్ల మూత్రపిండాల వడపోత వ్యవస్థ బలహీనపడుతుంది. ప్యాకెట్లలో లభించే ఆహారాలు, ఊరగాయలు, వేయించిన పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల ప్రమాదం పెరుగుతుంది. తక్కువ నీరు తాగడం: శరీరంలో నీటి లోపం ఏర్పడి మూత్రపిండాలపై ఒత్తిడి పెరుగుతుంది. నొప్పి నివారణ మాత్రలు: వైద్యుల సలహా లేకుండా తరచూ నొప్పి నివారణ మందులు వాడటం మూత్రపిండాలకు హానికరం. ధూమపానం, మద్యపానం: ఇవి రక్తప్రసరణను దెబ్బతీసి మూత్రపిండాల పనితీరును తగ్గిస్తాయి.

మీ దంతాలు భద్రమేనా?



సాధారణంగా దంతాల్లో తీవ్రమైన అసౌకర్యం కలగనంత వరకు చాలామంది వాటి ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. కానీ, కొన్ని అలవాట్లు లోపలి నుంచి దంతాలను క్రమక్రమంగా అరిగేలా చేస్తాయి. దీనివల్ల పళ్లు బలహీనపడి, ఊడిపోయే స్థితికి చేరుకుంటాయి. ఇలాకాకుండా మన దంతాలను రక్షించుకునేందుకు వెంటనే మానుకోవాల్సిన అలవాట్లను తెలుసుకుందాం.. గట్టిగా బ్రష్ చేయడం: కొంతమంది దంతాలు తెల్లగా మెరవాలనే ఆరాటంతో బ్రష్‌ను పళ్లపై వేసి గట్టిగా రుద్దుతుంటారు. ఎకువ సమయం పాటు బ్రష్ చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎకువ. ఇలా చేయడం వల్ల దంతాలను రక్షించే ఎనామెల్ పూర్తిగా అరిగిపోతుంది. ఫలితంగా దంతాల్లో సున్నితత్వం ఏర్పడి చల్లటి లేదా వేడి పదార్థాలు తిన్నప్పుడు పళ్లు జివ్వుమనడం మొదలవుతుంది. ఓపెనర్‌లా వాడటం: పళ్లను


సెన్సెక్స్ ▲ 81,106.65	గోల్డ్ 1,41,452 (10 గ్రాములు)	యూస్ డాలర్ $ 93.9180	ఎస్ బి ఐ రూ. 1,042.00
నిఫ్టీ ▲ 25,044.65	సిల్వర్ 1,82,868 (1 కిలో)	బ్రిటన్ పౌండ్ £ 126.2486	NTPC రూ. 328.75
	చమురు 7,938 (రూ. బ్యారెల్)	యూరో € 105.4116	Maruti Suzuki రూ. 12,928.00
		జపాన్ యెన్ ¥ 0.5943	Bajaj Finance రూ. 1,064.85
			Max Healthcare రూ. 915.00
			HCL Technologies రూ. 1,407.00



మధ్యప్రాచ్య యుద్ధ ప్రభావంతో సంస్థలు కొత్త నియామకాలు

▶ బ్రిటన్ నిరుద్యోగం 4.7 శాతానికి పెరిగింది.

▶ విద్య, ఉద్యోగం లేదా శిక్షణలో లేని యువత సంఖ్య దాదాపు పది లక్షలకు చేరింది.



లండన్‌లో మంగళవారం జరగనున్న ప్రసంగంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఉప గవర్నర్ క్లేర్ లోంబార్డెల్లి కార్మిక మార్కెట్ మందగమనంపై ఆందోళనలను వెల్లడించనున్నారు. నియామకాలు నిలిచిపోవడంతో బ్రిటన్ యువతపై 'తక్కువ వేగ ఆర్థిక వ్యవస్థ' భారం పడుతోందని ఆమె హెచ్చరించారు. మధ్యప్రాచ్య యుద్ధం ఇంధన ధరలను పెంచి ఆర్థిక అంచనాలను మసకబార్చిందని, దాంతో యువ నిరుద్యోగం పెరుగుతోందని ద్రవ్య విధాన ఉప గవర్నర్ లోంబార్డెల్లి తెలిపారు. ఉద్యోగాలు వెతుక్కుంటున్న యువత సంఖ్య వేగంగా పెరుగుతోందని ఆమె అన్నారు. గార్డియన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లోంబార్డెల్లి బ్రిటన్ సంస్థలు సిబ్బందిని కొనసాగిస్తూ కొత్త నియామకాలను నిలిపివేస్తున్నాయని చెప్పారు. తొలగింపులు పెద్దగా లేకపోయినా నియామకాలు తగ్గిన ఈ 'తక్కువ నియామకాలు, తక్కువ తొలగింపులు' ధోరణి అనిశ్చితి తొలగే వరకు కొనసాగుతోందని వివరించారు. కొత్తగా కార్మిక మార్కెట్లోకి వస్తున్నవారే ఎక్కువగా దెబ్బతింటున్నారని అన్నారు. ఇరాన్ యుద్ధం, అధిక పన్నులు, జీవన వ్యయ సంక్షోభంతో వినియోగదారుల డిమాండ్ తగ్గడం వల్ల బ్రిటన్ నిరుద్యోగం ఈ ఏడాది 4.7 శాతానికి చేరింది. యువ నిరుద్యోగం కోవిడ్ మహమ్మారి కాలాన్ని మినహాయిస్తే 2015 తర్వాతి అత్యధిక స్థాయికి పెరిగింది.

విద్య, ఉద్యోగం లేదా శిక్షణలో లేని యువత సంఖ్య దాదాపు పది లక్షలకు చేరడంతో యువ ఉద్యోగ సంక్షోభం ప్రభుత్వ ప్రాధాన్యంగా మారింది.

మాజీ లేబర్ కేబినెట్ మంత్రి అలన్ మిల్బర్న్ రూపొందిస్తున్న యువత, పని అంశాల నివేదిక వచ్చే వారం ప్రచురితమవుతుందని అంచనా. యువతకు తొలి ఉద్యోగాలు అందించే ఆతిథ్య, రిటైల్ రంగాల్లో నియామకాలు గణనీయంగా పడిపోయాయని బ్యాంక్ సర్వేలు సూచిస్తున్నాయని లోంబార్డెల్లి చెప్పారు. యువకుడిని నియమించడం గతంతో పోలిస్తే ఎక్కువ ప్రమాదమనే భావన సంస్థల్లో ఉందని తెలిపారు. లోంబార్డెల్లి బ్యాంక్ ద్రవ్య విధాన కమిటీ మెజారిటీతో కలిసి ప్రాథమిక వడ్డీ రేటును 3.75 శాతం నుంచి 4 శాతానికి పెంచేందుకు ఓటేశారు. డిసెంబరు సమావేశం నుంచే మరో పావు శాతం పెంపు సాధ్యమేనని, అయితే సంఘర్షణ, ఇంధన ధరలు, విస్తృత ఆర్థిక గణాంకాలపై నిర్ణయం ఆధారపడుతుందని చెప్పారు. చమురు ధర బ్యారెల్‌కు $100 కంటే దిగువకు పడిపోయింది. అధిక నిరుద్యోగం ద్రవ్యోల్బణ ఒత్తిడిని తప్పనిసరిగా తగ్గించదని లోంబార్డెల్లి హెచ్చరించారు. అవసరమైన సిబ్బందిని ఉంచుకుంటున్న సంస్థలు భర్తీ చేయడం కష్టమైన ఉద్యోగాలకే నియామకాలు చేపడుతున్నందున నిరుద్యోగం పెరిగినా వేతనాలు, ధరలపై ఒత్తిడి తగ్గకపోవచ్చని ఆమె అన్నారు.

బెంగళూరు వెలుపల పరిశ్రమలకు కర్ణాటక కమిటీ ఆమోదం తెలిపింది



బెంగళూరులో పారిశ్రామిక వృద్ధికి ఊతమివ్వాలనే లక్ష్యంతో రాష్ట్రస్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ కమిటీ సోమవారం 147 పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. మొత్తం పెట్టుబడి విలువ ₹6,825.93 కోట్లు కాగా, వాటిలో ఎక్కువ భాగం బెంగళూరు వెలుపలికి చెందినవే. కమిటీ 161వ సమావేశానికి అధ్యక్షత వహించిన భారీ, మధ్యతరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి ఎం.బి. పాటిల్ మాట్లాడుతూ, బెంగళూరు అర్బన్, బెంగళూరు రూరల్ మినహా ఇతర జిల్లాల్లో 131 ప్రాజెక్టులు రానున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇవి 18,600 ఉద్యోగాలు కల్పిస్తాయని తెలిపారు. ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో ఒక్కొక్కటి ₹50 కోట్లకు మించిన 36 భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి మొత్తం పెట్టుబడి ₹4,507.71 కోట్లు, అంచనా ఉద్యోగాలు 12,074. మరో 108 కొత్త ప్రాజెక్టులకు ₹15 కోట్ల నుంచి ₹50 కోట్ల వరకు పెట్టుబడులు రానున్నాయి.

బెంగళూరులోని అద్వైత్ టెక్ ఎల్ఎల్పీ దేవనహల్లీలో ఐటీ, ఐటీఈఎస్ పార్కును ₹380 కోట్లతో ఏర్పాటు చేసి 500 ఉద్యోగాలు కల్పించనుంది.

సాధారణ లావాదేవీలు ఉండవు

▶ డిజిటల్ బ్యాంకింగ్ సేవలు సాధారణంగా 24 గంటలు అందుబాటులో ఉంటాయి.



నవంబర్ 10, 2026 మంగళవారం బ్యాంకులు, సాధారణ షేర్ మార్కెట్ లావాదేవీలు నిలిచిపోనున్నాయి. దీపావళిబాలీ ప్రతిపద సందర్భంగా ఈ సెలవు అమలవుతుంది. సెలవు ప్రభావం ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, నాగ్‌పూర్, డెహ్రాడూన్, బేలాపూర్, గ్యాంగ్‌టక్ ప్రాంతాల్లోని బ్యాంకింగ్ సేవలపై ఉంటుంది. ఆర్బీఐ నవంబర్ 2026 సెలవుల క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల శాఖలు మూసివుంటాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో మంగళవారం సాధారణ ట్రేడింగ్ జరగదు. ఆదివారం దీపావళి సందర్భంగా షేర్ మార్కెట్‌లో గంటపాటు ముహూర్త్ ట్రేడింగ్ జరిగిన తర్వాత ఈ విరామం వస్తోంది. కమోడిటీ మార్కెట్‌లో మాత్రం వేర్వేరు సమయాలు అమలవుతాయి. దేశంలోని అతిపెద్ద కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎమ్సీఎక్స్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూసివుంటుంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 11:30 గంటల వరకు ట్రేడింగ్ కొనసాగుతుంది. ఎన్సీడీఈఎక్స్‌లో మంగళవారం రోజంతా లావాదేవీలు నిలిచిపోతాయి. బ్యాంకు సెలవులు ప్రాంతాలవారీగా మారుతాయి కాబట్టి ఇతర ప్రాంతాల్లోని శాఖలు తెరిచి ఉండే అవకాశం ఉంది. భారతీయ స్టేట్ బ్యాంక్ (SBI), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా సహా ఇతర బ్యాంకుల శాఖలు ప్రభావిత ప్రాంతాల్లో మూసివుంటాయి. దీపావళి, బాలీ ప్రతిపద, గోవర్ధన పూజ, లక్ష్మీ పూజ, విక్రమ సంవత్ నూతన సంవత్సరం సందర్భంగా ఈ సెలవు ఉంటుంది.

శాఖలు మూసివున్నా మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదు బదిలీ, బిల్లు చెల్లింపులు, ఇతర సేవలు సాధారణంగా అందుబాటులో ఉంటాయి. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు పంపడం, స్వీకరించడం సాధారణంగా 24 గంటలూ కొనసాగుతుంది. బ్యాంకు లేదా చెల్లింపు వ్యవస్థ నిర్వహణ సమయంలో కొంతసేపు అంతరాయం రావచ్చు.

విదేశీ గూఢచర్య చర్యకు జెన్సెన్ హువాంగ్ లక్ష్యమయ్యారా?

▶ ట్రంప్ హువాంగ్‌కు మద్దతు

ఎన్‌విడియా బోర్డు సీఈఓ జెన్సెన్ హువాంగ్ విదేశీ గూఢచర్య చర్యకు లక్ష్యమయ్యారా అనే అంశంపై స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించింది. చైనా గూఢచార సంస్థ కోసం పనిచేసినట్టు అమెరికా అధికారులు అనుమానిస్తున్న మహిళతో హువాంగ్ సంబంధాలపై వచ్చిన నివేదికలు నాయకత్వం, సంస్థ పాలన, పెట్టుబడిదారుల విశ్వాసంపై ప్రశ్నలు లేవనెత్తాయి. భార్యకు నమ్మకద్రోహం చేశానని హువాంగ్ అంగీకరించి, ఉద్యోగులు, బోర్డు, వాటాదారుల పట్ల బాధ్యతల్లో విఫలమయ్యానని చెబుతూ సిబ్బందికి క్షమాపణ చెప్పారు. జాతీయ భద్రత లేదా కంపెనీ రహస్యాలు దెబ్బతిన్నాయని నమ్మడానికి కారణం లేదని ఎన్‌విడియా తెలిపింది. దర్యాప్తుకు సహకరిస్తానని హువాంగ్ ప్రకటించారు. స్వతంత్ర డైరెక్టర్లు బాహ్య న్యాయ సలహాదారుల సహాయంతో అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించనున్నారు. హువాంగ్ భవిష్యత్తు, నిర్ణయ సామర్థ్యం లేదా నాయకత్వంపై అనిశ్చితి పెరిగితే పెట్టుబడిదారుల విశ్వాసం కదిలే ప్రమాదం ఉందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం నాయకత్వ మార్పు జరగడం లేదని బోర్డు స్పష్టం చేసింది. నివేదికల్లో ప్రస్తావించిన ఆలిస్ హువాంగ్ సింగపూర్‌కు చెందిన మెగాస్పీడ్‌తో అనుబంధం కలిగి ఉన్నారు.








ఆస్ట్రేలియా న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌కు లబుషేన్‌ను పక్కనపెట్టింది

ఆస్ట్రేలియా సెలెక్టర్ల చైర్మన్ జార్జ్ బెయిలీ నవంబర్ 9న మార్నస్ లబుషేన్‌ను జాతీయ జట్టు నుంచి తొలగించారు. డిసెంబర్ 9న పెర్త్‌లో ప్రారంభమయ్యే న్యూజిలాండ్‌తో నాలుగు టెస్టుల సిరీస్‌కు అతడిని పరిగణించబోమని ప్రకటించారు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్టులో లబుషేన్ సున్నా, నాలుగు పరుగులు చేశాడు. యాషెస్ 2023 తర్వాత టెస్టు శతకం చేయని అతడి పరుగు 49 ఇన్నింగ్స్‌కు చేరింది. దేశవాళీ క్రికెట్‌లో క్వీన్స్‌లాండ్‌కు కెప్టెన్‌గా తిరిగి వెళ్లి షెఫీల్డ్ షీల్డ్‌లో ఆడనున్నాడు.

టిక్నర్ దూరం. హామిల్టన్ మూడో వన్డేకు న్యూజిలాండ్ మార్పులు




హామిల్టన్‌లో మంగళవారం జరగాల్సిన మూడో వన్డేకు ముందు న్యూజిలాండ్ జట్టులో మార్పులు చేసింది. బ్లెయిర్ టిక్నర్, లాకీ ఫెర్గూసన్ అందుబాటులో ఉండరు; మాట్ హెన్రీ కూడా ఆ మ్యాచ్‌కు దూరం కానున్నారు. వెల్లింగ్టన్‌లో రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తుండగా బంతి తగిలిన టిక్నర్‌కు కంకషన్ లేదని తేలినా, ఐసీసీ నిబంధనల ప్రకారం ఏడు రోజుల విరామం తప్పనిసరి. అతని స్థానంలో నార్తర్న్ డిస్ట్రిక్ట్స్ పేసర్ క్రిస్టియన్ క్లార్క్‌ను ఎంపిక చేశారు. టీ20 సిరీస్‌లో కుడి కాలి కాఫ్ కండరానికి స్వల్ప గాయం కావడంతో ఫెర్గూసన్ నాలుగో, ఐదో వన్డేలకు దూరమయ్యారు. డెవాన్ కాన్వేతో శిక్షణలో ఢీకొన్న హెన్రీ నాలుగో వన్డేకు తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడో వన్డేకు ముందు భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 20 ఆధిక్యంలో ఉంది. ఐదో మ్యాచ్‌కు న్యూజిలాండ్ ఇంకా జట్టును ప్రకటించలేదు. టామ్ లాథమ్, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, నాథన్ స్మిత్ బుధవారం టెస్టు సన్నాహాల కోసం హామిల్టన్ విడిచి వెళ్లనున్నారు.

భారత జట్టు ప్రకటన



భారత మహిళల జట్టు డిసెంబరు 9న రావల్‌లో దక్షిణాఫ్రికాతో టెస్టు మ్యాచ్‌తో ఏడు మ్యాచ్‌ల పర్యటనను ప్రారంభించనుంది. భారత ఎంపిక కమిటీ టెస్టు, వన్డే, టీ20 జట్లను ప్రకటించి స్మృతి మంధానకు మూడు ఫార్మాట్ల కెప్టెన్సీ అప్పగించింది. పర్యటనలో ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉన్నాయి. డిసెంబరు 16న పార్ల్‌లో తొలి వన్డే, 19న కేప్‌టౌన్‌లో రెండోది, 22న బ్లోమ్‌ఫొంటైన్‌లో మూడోది జరగనున్నాయి. డిసెంబరు 26న బెనోనిలో టీ20 సిరీస్ మొదలవుతుంది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా సుమారు నాలుగు నెలలు దూరమైన జెమిమా రోడ్రిగ్స్ జట్టులోకి తిరిగి వచ్చింది. దీప్తి శర్మ టెస్టు, వన్డేలకు వైస్‌కెప్టెన్‌గా ఎంపికైంది. టెస్టు, వన్డే జట్లలో రిచా ఘోష్‌తో పాటు యాస్తికా భాటియాను వికెట్‌కీపర్‌గా తీసుకున్నారు. టెస్టు జట్టులో స్నేహ్ రాణాకు చోటు దక్కగా, వన్డే జట్టులో వైష్ణవి శర్మకు అవకాశం లభించింది. టీ20 జట్టుకు షెఫాలీ వర్మ వైస్‌కెప్టెన్‌గా ఉంటుంది. రిచా ఘోష్, జి కమలిని టీ20ల్లో వికెట్‌కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ డిసెంబరు 29న, మూడోది 30న పోట్చెఫ్‌స్ట్రూమ్‌లో జరగనుంది. దీంతో డిసెంబరులో దక్షిణాఫ్రికాతో భారత జట్టు మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడనుంది.

టైబ్రేక్ పోరులో ముచోవాను అధిగమించి సీజన్ ముగింపు టోర్నీలో సబలెంకా ముందంజ



ఇండియన్ వెల్స్‌లో సోమవారం జరిగిన సీజన్ ముగింపు డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ఆర్యనా సబలెంకా విజయంతో ప్రారంభించింది. మాజీ ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా కరోలినా ముచోవాపై రెండు సెట్లలో గెలిచి ముందంజ వేసింది. బెలారస్‌కు చెందిన నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ విజేత సబలెంకా తొలి సెట్‌లో సర్వీస్ కోల్పోయి 54తో వెనుకబడింది. వెంటనే బ్రేక్ తిరిగి సాధించి 5 5తో సమం చేసింది. టైబ్రేక్‌లో 72తో సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో ఇద్దరి సర్వీస్‌లూ ఇబ్బందుల్లో పడ్డాయి. మ్యాచ్ కోసం సర్వ్ చేస్తూ సబలెంకా 54 ఆధిక్యంలో ఉండగా నాలుగోసారి బ్రేక్ కోల్పోయింది. వెంటనే తిరిగి బ్రేక్ సాధించి 65తో నిలిచింది. ముచోవా బ్యాక్‌హ్యాండ్‌ను నెట్‌లోకి కొట్టడంతో సబలెంకా విజయం ఖరారైంది. సబలెంకా 2022, 2025 ఫైనల్స్‌లో ఓడిన తర్వాత తొలి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్ కోసం పోటీపడుతోంది.

మరో గ్రూప్ మ్యాచ్‌లో అరంగేట్ర క్రీడాకారిణి మిర్రా ఆండ్రీవా ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాను 64, 60తో ఓడించింది.

ఫ్రెంచ్ ఓపెన్ ప్రస్తుత విజేత, 19 ఏళ్ల ఆండ్రీవా తొలి సెట్‌లో 42 ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను నియంత్రించింది. ఆండ్రీవా బుధవారం రెండో రౌండ్ రాబిన్ మ్యాచ్‌లో సబలెంకాను ఎదుర్కోనుంది. సౌదీ అరేబియాలో జరగాల్సిన ఈ ఏడాది టోర్నీని జూలైలో ఇండియన్ వెల్స్‌కు మార్చారు.

బంతి అక్రమంగా మార్చేందుకు వస్తువు తీసుకెళ్తున్న ...

▶ వార్నర్ ఖ్వాజా వాదనలు వంద శాతం నిజమని మద్దతు తెలిపారు.



ఉస్మాన్ ఖ్వాజా వాదనలతో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో పాత వివాదం మళ్లీ ముందుకు వచ్చింది. కుంభకోణం గురించి అందరికీ తెలుసన్న ఖ్వాజా వ్యాఖ్యపై మిచెల్ స్టార్క్ స్పందించారు. 2021లో బౌలర్లు విడుదల చేసిన ప్రకటనకే తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. మైదానంలో బంతిని అక్రమంగా మార్చేందుకు వస్తువును తీసుకెళ్తున్నారన్న విషయం తమకు తెలియదని స్టార్క్ స్పష్టం చేశారు. కేప్‌టౌన్‌లో బడీ తెరపై ఆ వస్తువును తొలిసారి చూశామని తెలిపారు. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన రెండో టెస్టు సమయంలో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ దాన్ని ఉపయోగిస్తున్నాడని ముందే తెలుసన్న ఖ్వాజా వాదనను ఆయన తిరస్కరించారు. ఖ్వాజా పుస్తకాన్ని తాను చదవలేదని, బహుశా ఇకపై కూడా చదవబోనని స్టార్క్ అన్నారు. పుస్తకంలోని వివరాలను రచయితగా ఖ్వాజానే వివరించాలని పేర్కొన్నారు. ఘటనపై వేర్వేరు వ్యక్తులు వేర్వేరు కథనాలు చెబుతున్నారని, ఐదేళ్ల క్రితం చెప్పిన మాటపైనే నిలబడుతున్నానని తెలిపారు. స్టార్క్ గత ఒకటి రెండు రోజుల్లో ఖ్వాజాతో మాట్లాడలేదని చెప్పారు. ఇకపై ఇద్దరూ మాట్లాడుకోవాలా వద్దా అనేది ఖ్వాజా నిర్ణయమేనని అన్నారు. ఖ్వాజా 'సబ్రా' పుస్తకంలోని సాండ్‌పేపర్‌గేట్ అధ్యాయాన్ని బాన్‌క్రాఫ్ట్, డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్‌లకు అంకితం చేశారు.

ఖ్వాజా వెల్లడించిన విషయాలు వంద శాతం నిజమని మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ మద్దతు తెలిపారు. వివాదం మళ్లీ వార్తల్లోకి రావడం నిరాశ కలిగించిందని స్టార్క్ అన్నారు. గత ఎనిమిదేళ్లలో ఆటగాళ్లు, సిబ్బంది ఈ ఘటనను భిన్నంగా చూశారని చెప్పారు. ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే ఉత్కంఠభరిత సీజన్‌ను ప్రారంభిస్తున్న సమయంలో పాత వివాదం తెరపైకి వచ్చిందని స్టార్క్ పేర్కొన్నారు. కోచ్ డారెన్ లెహ్‌మన్ కూడా దీనిపై మాట్లాడారని గుర్తుచేశారు.

అల్ అమీరత్‌లో యూఏఈ బౌలింగ్‌ను ఛేదించిన ఆర్యవీర్ సెహ్వాగ్

▶ 131 బంతుల్లో శతకం పూర్తి చేసిన ఆర్యవీర్, తర్వాత 150 పరుగులు దాటాడు

అల్ అమీరత్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన అండర్19 పురుషుల ఆసియా కప్ గ్రూప్ఏ మ్యాచ్‌లో యూఏఈపై ఆర్యవీర్ సెహ్వాగ్ 168 బంతుల్లో అజేయంగా 160 పరుగులు చేశాడు. వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడైన 19 ఏళ్ల ఓపెనర్ యువ వన్డే క్రికెట్‌లో తనదైన ముద్ర వేశాడు. ఆర్యవీర్ ఇన్నింగ్స్‌కు ముందు తన ఆటతీరుపై చేసిన వ్యాఖ్య కూడా చర్చనీయాంశమైంది. తాను కేవలం సెహ్వాగ్ శైలిలోనే కాకుండా విరాట్ కోహ్లీ తరహాలోనూ ఆడాలనుకుంటున్నానని ప్రచార వీడియోలో చెప్పాడు. వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే దూకుడుగా ఆడటానికి ప్రసిద్ధి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్, నిలకడ, ఒత్తిడిలో సంయమనం కోసం గుర్తింపు పొందాడు. ఆర్యవీర్ ఇన్నింగ్స్‌లో ఈ రెండు శైలుల ప్రభావం కనిపించింది. మ్యాచ్ ప్రారంభంలో పిచ్‌పై పరుగులు చేయడం సులభంగా లేకపోవడంతో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. 131 బంతుల్లో శతకం పూర్తి చేసిన తర్వాత అతను దూకుడు పెంచి బౌండరీలతో స్కోరును వేగంగా నడిపించాడు. ఆర్యవీర్ 37వ ఓవర్‌లో బౌలర్ ఉద్దీశ్ సూరిపై రెండు సిక్సర్లు, రెండు ఫోర్లు బాదాడు. ఆ దశలో అతని ఇన్నింగ్స్ 150 పరుగులు దాటింది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రచురించిన మ్యాచ్ వీడియోలో ఆర్యవీర్ శతకం, 150 పరుగుల దశలను చూపించారు. శతకం తర్వాత అతని దూకుడు మరింత పెరిగింది. అయితే 160 పరుగుల వద్ద ఆర్యవీర్ ఔటయ్యాడు. అండర్19 ఆసియా కప్‌లో యూఏఈపై 168 బంతుల్లో అజేయంగా 160 పరుగులు చేసిన ఇన్నింగ్స్‌తో, 2017లో ఇంగ్లండ్‌పై అండర్19 వన్డేలో శుభ్‌మన్ గిల్ చేసిన 160 పరుగుల స్కోరును అతను సమం చేశాడు.



అనీష్‌కి సినిమా అంటే ప్రాణం: రామ్ చరణ్



వుదయం సినిమా: కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుం డగా, అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాతో నిర్మాతగా కూడా పరిచయం అవుతున్నారు. ఆయన కొత్తగా ప్రారంభించిన వాట్ నెక్స్ట్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలని పెంచింది. ఎస్ తమన్ అందించిన పాటలన్నీ చార్ట్ బస్టర్ అయ్యాయి. 'ఇట్లు అర్జున' నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. కింగ్ నాగార్జున, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, అఖిల్ అక్కినేని ముఖ్య అతిథులు పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.మ్యూజికల్ కాన్సర్ట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ: అందరికీ నమస్కా రం. కింగ్ నాగార్జున గారి ఫ్యాన్స్ కి, మా అభిమానులందరికీ థాంక్యూ సో మచ్. అనీష్ హీరోగా లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. తన తల్లిదండ్రులు చాలా అద్భుతమైన వ్యక్తులు. అనీష్‌కు సపోర్ట్ చేసిన వాళ్ల పేరెంట్స్‌కి థాంక్స్ చెప్తున్నాను. తనకు మరో పెద్ద సపోర్ట్ కింగ్ నాగార్జున గారు. నాగార్జున గారి లాంటి సపోర్ట్ ఉంటే తప్పు జరగడానికి అవకాశం లేదు. నాగార్జున గారు ఎప్పుడూ కొత్త టాలెంట్‌ను పరిచయం చేస్తూ, ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు అనీష్‌ను కూడా ఎంకరేజ్ చేయడం ఆనందంగా వుంది. అలాగే ఈ సినిమాతో నిర్మాతగా పరిచయం అవుతున్న వెంకీకి, డైరెక్టర్ మహేష్‌కి ఆల్ ది బెస్ట్. అనస్వర చాలా అద్భుతమైన నటి. 'కాకా' సినిమాలో కూడా తను చాలా ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. 'ఇట్లు అర్జున'తో తనకు ఒక బ్లాక్‌బస్టర్ వస్తుంది. అలాగే సంక్రాంతికి 'కాకా'తో మరో బ్లాక్‌బస్టర్ వస్తుంది. ఇది రాసి పెట్టుకోండి. తమన్ విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ గారి 'ఓజీ' సినిమాకైనా, అనిష్ 'ఇట్లు అర్జున'కైనా సమానంగా మ్యూజిక్ చేస్తారు, తన మ్యూజిక్‌తో లక్షల మందిని కనెక్ట్ చేస్తాడు. అది పెద్ద హీరోనా, చిన్న హీరోనా అనేది చూడడు. అందరికీ ఒకేలా అద్భుతమైన మ్యూజిక్ ఇస్తాడు. ఇందులో పాటలన్నీ చాలా బాగున్నాయి. అనీష్‌కి సినిమా అంటే చాలా ఫ్యాషన్. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సీన్లు నాకు చూపించాడు. నేను నా ఫస్ట్ సినిమాకు ఎలా చేశానో తెలియదు కానీ, నాకంటే పది రెట్లు బెటర్‌గా చేశాడు. తన ప్రతి సీన్‌ను చాలా అద్భుతంగా చేశాడు. తనకు కచ్చితంగా చాలా పెద్ద ఫ్యూచర్ ఉంటుంది. మూగవాడిగా నటించినప్పటికీ అన్ని నవరసాలను పలికించాడు. ఫ్యూర్ యాక్టింగ్ ఉంటే తప్ప అంత అద్భుతంగా చేయలేం. నేను కూడా 'రంగస్థలం' సినిమాలో చెవిటివాడిగా నటించాను. ఆ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో అంతకంటే పెద్ద విజయం ఈ సినిమాతో అనీష్‌కు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా తన కెరీర్‌లో పెద్ద అడుగు కావాలి. తన భవిష్యత్తు విజయాలకు ఇది మంచి పునాది కావాలి. అనీష్ తన తల్లిదండ్రులను, ప్రేక్షకులను గర్వపడేలా చేస్తాడని ఆశిస్తున్నాను.

13 ఏళ్ల వివాహ బంధానికి పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడాకులు ప్రకటించారు..

వుదయం సినిమా: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కళ్యాణ్ తన భార్య అన్నా కొణిదెల 13 ఏళ్ల వివాహ బంధం తర్వాత విడిపోతున్నట్లు ప్రకటించారు. తాము పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించు కున్నట్లు సోమవారం రాత్రి జనసేన అధికారిక మీడియా వేదికల ద్వారా ఈ జంట సంయుక్త ప్రకటన విడుదల చేసింది.తాము ఒకరితో ఒకరు సఖ్యతతో ఉంటామని ఆ ప్రకటనలో వారు తెలిపారు. తమ పిల్లల సంతోషానికి, సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తల్లిదం డ్రులుగా తమ బాధ్యతలను నెరవేరు స్తామని కూడా వారు పేర్కొన్నారు. ఈ సమయంలో తమ గోప్యతను గౌరవిం చాలని ప్రజలను, మీడియాను కోరారు మరియు తమకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ జంట సెప్టెంబర్ 2013లో వివాహం చేసుకున్నారు మరియు వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, వారు ఎందుకు విడిపోవాలని నిర్ణయించుకున్నారు మరియు వారు తీసుకున్న చట్టపరమైన చర్యల గురించి ఎలాంటి వివరాలు వెల్లడిం చలేదు.అన్నా ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించాలని నిర్ణయించుకున్న తర్వాత వార్తల్లో నిలిచారు. ఆమె కొన్ని నెలల క్రితమే చేరింది మరియు పవన్ కళ్యాణ్‌తో జిమ్ సెల్ఫీలు, పిఠాపురం పర్యటన ఫోటోలతో సహా వ్యక్తిగత విషయాలను తరచుగా పోస్ట్ చేసేది.పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి కావడంతో ఈ వార్త చాలా దృష్టిని ఆకర్షించింది. తాము ఒకరినొకరు గౌరవిం చుకుంటామని, తమ పిల్లలకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఆ జంట తెలిపారు.



'కొక్కొరొకో' గ్లింప్స్ విడుదల..



వుదయం సినిమా: యంగ్ టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించడంలో ముందుండే ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ.. కొత్త దర్శకులకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆర్.వి ఫిల్మ్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై తొలి సినిమాగా 'కొక్కొరొకో' రూపొందుతోంది. ఐదు విభిన్న పాత్రలతో తెరకెక్కుతోన్న ఈ ఆంథాలజీ ద్వారా శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రీసెంట్ గానే 'కొక్కొరొకో' సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతూ ఓ అందమైన గ్లింప్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇందులో శీను, పార్వతి ప్రేమకథను చూపించారు. శీను కోసం పార్వతి ఎదురుచూస్తుండగా.. ఆమెను సర్‌ప్రైజ్ చేయడానికి చెరువులో నుంచి పూలు సేకరించి తీసుకొస్తుంటాడు . ఇలా వీరిద్దరి మధ్య జరిగే చిన్న చిన్న సంఘటనలు, అమాయకమైన ప్రేమను ఈ గ్లింప్స్‌లో అందంగా చూపించారు.ఈ గ్లింప్స్‌లో నటీనటుల సహజమైన నటన, శీను, పార్వతి మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందమైన విజువల్స్, మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిన్న గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. వెండితెరపై ఓ అందమైన ప్రేమకథను చూడబోతున్నామనే ఆసక్తిని కలిగిస్తోంది. శ్రీనివాస్ వసంతాల కథ చెప్పే విధానంపై నమ్మకంతోనే దర్శకుడు రమేష్ వర్మ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. వినూత్నమైన ఆలోచనలతో సినిమాలను తెరకెక్కిస్తూ శ్రీనివాస్.. 'కొక్కొరొకో'తో విజువల్‌గా కొత్త అనుభూతిని అందించడంతో పాటు, భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తారని మేకర్స్ భావిస్తున్నారు. అనిల్ గారే విషయాలన్నీ చూసుకున్నారు. నేను కేవలం నేర్చుకోవడానికి మాత్రమే ఇన్వాల్వ్ అయ్యాను. అది మీరు నవంబర్ 13న చూడబోతున్నారు. ఇది రొటీన్ సినిమా కాదు.

'ఇంకా ఏం అనుకోలేదు!' సాంగ్ లాంచ్ ఈవెంట్

వుదయం సినిమా: వంశీ నందిపాటి ఎంటర్టైన్మెంట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఇంకా ఏం అనుకోలేదు!'. వంశీ నందిపాటి నిర్మాతగా కన్ను సమీర్, వెన్నపూస శ్రీకర్ రెడ్డి సహ నిర్మాతలుగా ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి



పెమ్మసాని సంయుక్తంగా తెరకెక్కించిన ఈ మూవీలో అక్షయ్ లగుసాని, కేయూరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో , జయకృష్ణ, రావు రమేష్, హర్షవర్ధన్, అనిత చౌదరి, సుబ్బ రాజు తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని డిసెంబర్ 11న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'మేఘాలు సంద్రంలో' అంటూ సాగే సాంగ్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో..వంశీ నందిపాటి మాట్లాడుతూ .. ''ఇంకా ఏం అనుకోలేదు!' చిత్రం అందరికీ రిలేట్ అయ్యేలా, కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. గిరి, ప్రణయ్ చెప్పిన ఈ కథ నాకు ఎంతో నచ్చింది. ఈ ఇద్దరి పేర్లు ఇండస్ట్రీ కచ్చితంగా గుర్తు పెట్టుకుంటుంది. సింజిత్ అద్భుతమైన పాటల్ని ఇచ్చాడు. అక్షయ్, సింజిత్ మంచి స్నేహితులు. కేయూరికి ఆల్ ది బెస్ట్. ఈటీవీ విన్‌తో కలిసి ఈ మూవీని డిసెంబర్ 11న ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. ఈ జర్నీలో సపోర్ట్‌గా నిలిచిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు.ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ .. ''ఇంకా ఏం అనుకోలేదు!' మాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఈ చిత్రంతో ఒకేసారి ఇద్దరు దర్శకుల్ని పరిచయం చేయబోతోన్నాం. వంశీకి నిర్మాతగా ఇదే తొలి చిత్రం. అందుకే మా సినిమా ప్రత్యేకం. సినిమాకు సింజిత్ మంచి సంగీతం ఇచ్చారు.

'DNK' అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్..

వుదయం సినిమా: పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ సినిమాలతో పాటు కంటెంట్ ఉన్న చిత్రాలను కూడా ప్రోత్సహిస్తోంది. ఈ బ్యానర్‌పై రూపొందుతున్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'DNK'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాతో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవు తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

'దొంగ నా కొడకా' అనే టైటిల్‌కు సెన్సార్ ప్రాబ్లమ్ వస్తుందని ముందే ఊహించి 'DNK'గా మార్చారా?

–నిజానికి ఈ టైటిల్ విన్నప్పుడు కథకు చాలా పర్ఫెక్ట్‌గా అనిపించింది. అయితే సెన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పారు. దాంతో 'DNK'గా మార్చాం.

ఈ కథను ఓకే చేయడానికి కారణం ఏమిటి?

–ఇది మంచి ఎంటర్‌టైన్‌మెంట్ సబ్జెక్ట్. ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది.

మీరు ప్రొడక్షన్‌లో ఇన్వాల్వ్ అవ్వడం వల్ల సినిమా కాస్ట్ కూడా తగ్గిందని నిర్మాత రవి గారు చెప్పారు. దీనిపై మీరేమంటారు?

అది ఆయన మంచితనం. నిజానికి మేమందరం మంచి టీమ్‌వర్క్‌తో ఈ సినిమా చేశాం. మైత్రీ అనిల్ గారితో కలిసి పనిచేశాము. ప్రొడక్షన్ గురించి నేర్చుకుందామనే ఉద్దేశంతోనే ఇందులో ఇన్వాల్వ్ అయ్యాను.



హీరో మౌళి తనూజ్ ప్రశాంత్

'DNK' కథలో ఉండే ప్రధాన అంశం ఏమిటి?

ఈ కథలో ఒక కుర్రాడు ఈజీ మనీకి అలవాటు పడతాడు. గ్యాంబ్లింగ్ చేస్తే డబ్బులు వస్తాయని ఆ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ అతను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకు పోతాడు.

ఆలీతో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?

ఆలీతో కలిసి నటించడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్. ఆయనతో పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఆయన ఉండటం వల్ల ఆ పాత్రకు మరింత ప్లస్ అయింది.

సినిమాలో ఎలాంటి ఎలిమెంట్స్ ఉంటాయి? మ్యూజిక్ గురించి చెప్పండి?

సినిమా అంతా చాలా మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ట్విస్టులు కూడా ఉంటాయి. సింజిత్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. పాటలను థియేటర్లలో ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు.

'DNK' ఫన్-ఫీల్డ్ ట్రైలర్

వుదయం సినిమా: బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పుడు మరో జెట్ అండ్ జెట్ ఎంటర్‌టైనర్ 'DNK'తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తుండగా, అనిల్ యెర్నేని కో–ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రీను కంబాల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కు మంచి స్పందన వచ్చింది. నవంబర్ 13న సినిమా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో తాజాగా మాస్ మహారాజా రవితేజ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన హీరో, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా అప్పులు చేయడంతో పాటు తన గర్ల్‌ఫ్రెండ్ దగ్గర కూడా డబ్బులు తీసుకుని ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటాడు. ఈ క్రమంలో డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ గర్ల్‌ఫ్రెండ్ తండ్రి అతడి ఇంటికి వచ్చి గట్టిగా హెచ్చరిస్తుంది. అప్పులు పెరిగిపోవడం, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో హీరో తన స్నేహితుడితో కలిసి ధనవంతుల ఇళ్లలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుంటాడు.



'డార్క్ చాక్లెట్' లో ఒక మ్యాజిక్ క్రియేట్ చేశాం..

వుదయం సినిమా: రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్తెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని ను సగర్వంగా అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శశాంక్ శ్రీవాస్తవయ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు ఇప్పటికే మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా నవంబర్ 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ కర్టెన్ రైజర్ ఈవెంట్ నిర్వహించారు.హీరో విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ఇది ఎంతో ప్యాషన్‌తో చాలా డీటెయిల్డ్‌గా బిల్డ్ చేసిన సినిమా. సినిమా విషయంలో మేము ఇంత ఆనందంగా ఉన్నామంటే, దానిపై మాకున్న నమ్మకమే కారణం. కచ్చితంగా ఒక మంచి సినిమాను తీశాం. ఇక్కడికి వచ్చిన నా ఫ్రెండ్స్ అందరికీ థాంక్యూ. ప్రేక్షకులకు గుర్తుండిపోయే సినిమా ఇది. ఇది ఒక కొత్త సినిమా. ఇప్పటివరకు ఈ సినిమా చూసినవాళ్లు మర్చిపోలేకపో తున్నారు. మళ్లీ మళ్లీ చూడాలనుకుంటున్నారు. మేము కచ్చితంగా ఒక మ్యూజిక్ క్రియేట్ చేశాం. ఇది మీరు నవంబర్ 13న చూడబోతున్నారు. ఇది రొటీన్ సినిమా కాదు. సినిమా అనే ఫార్మాట్‌కే ఛాలెంజ్ చేసేంత కొత్తగా శశాంక్ ఈ కథను రాశారు. కచ్చితంగా మీరు ఒక కొత్త సినిమాను చూడబోతున్నారు. ఎవరూ ఈ సినిమాను థియేటర్లలో మిస్ అవ్వకూడదని కోరుకుంటున్నాను. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నాను.డైరెక్టర్ రవికాంత్ మాట్లాడుతూ: టీమ్ అందరికీ అభినందనలు. శశాంక్ కథ చెప్పే విధానం, నటీనటులను ఎంపిక చేసుకునే విధానం చాలా కొత్తగా ఉన్నాయి. విశ్వదేవ్ 35 చేయడం చాలా గర్వంగా ఉంది.



ప్రొడక్షన్ నెం. 2.. త్వరలోనే టైటిల్ అనౌన్స్‌మెంట్

వుదయం సినిమా: సుమ చిత్ర ఆర్ట్స్ సమర్పణలో సుమయా రెడ్డి స్వీయ నిర్మాణంలో నటిస్తున్న రెండో ప్రాజెక్ట్‌ని త్వరలోనే ప్రకటించ నున్నారు. 'డియర్ ఉమ' అంటూ మొదటి సినిమాతోనే నటిగా, నిర్మాతగా, రచయితగా సుమయా రెడ్డి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఇక ఈ రెండో ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రకటన కూడా త్వరలోనే వెలువ డనుంది. ఈ సారి కూడా తన సొంత బ్యానర్‌లోనే హీరోయిన్‌గా సుమయా రెడ్డి నటిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ ప్రొడక్షన్ నెం.2 టైటిల్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉండబోతోందని ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.ఈ పోస్టర్‌లో సుమయా రెడ్డి చేతి నిండా డబ్బు, బంగారంతో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో సుమయా రెడ్డిని చూస్తుంటే మహారాణిలా అనిపిస్తున్నారు. కామెడీ, హారర్ జానర్‌లో ఇది వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రాబోతోంది అని ప్రీ లుక్ పోస్టర్‌తో హింట్ ఇచ్చారు. ఈ ఒక్క పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలు పెంచేశారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌తో పాటుగా ఇతర వివరాల్ని కూడా ప్రకటించనున్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.